thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 314 | కరీంనగర్ మంగళవారం, 20 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 'తుంగభద్ర'పై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం..


బెంగళూరు : తుంగభద్ర డ్యాం కు గతేడాది కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటును అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. టీబీడ్యాంపై కొప్పళ జిల్లా బీజేపీ బృందం పర్యటించింది. ప్రతిపక్ష నాయకుడు దొడ్డనగౌడ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసవరాజ్ కావటూర్, రమేష్, గణేష్, మంజునాథ్, మల్లికార్జున తదితర నాయకులు బృందంలో ఉన్నారు. దెబ్బతిన్న 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటు అమర్చేందుకు రూ.2 కోట్ల వ్యయంతో టెండర్ పిలిచారని, కానీ మళ్లీ రద్దు చేశారన్నారు. ఇక మిగిలిన గేట్లకు ఎప్పుడు టెండర్ పిలుస్తారో.. ఎప్పుడు మరమ్మత్తుచేస్తారో ఆయోమయంగా ఉందని మండిపడ్డారు. డ్యాంకు నీరు వస్తున్న తరుణంలో గేట్లు పటిష్టంగా లేకుంటే నీరు ఎలా నిలుస్తాయని ప్రశ్నించారు. ఇది పూర్తిగా సర్కార్ వైఫల్యమేనన్నారు. పలువురు బీజేపీ నాయకులు డ్యాంను పరిశీలించారు.



## హరీష్ రావుతో ఈటల రాజేందర్ సీక్రెట్ భేటీ ?

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు రోజురోజుకు రంజుగా మారుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో అని టెన్షన్ అందరిలోనూ నెలకొంది. ఇలాంటి నేపథ్యంలో ఈటల రాజేందర్ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన మళ్లీ కెసిఆర్ పార్టీలోకి వస్తారని కూడా ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి తగ్గట్టుగానే తాజాగా ట్రబుల్ షూటర్ హరీష్ రావుతో ఈటల రాజేందర్ రహస్యంగా సమావేశం అయ్యారట. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈటల రాజేందర్ ఆటలు సాగనివ్వకుండా బండి సంజయ్ కుమార్ వ్యవహరిస్తున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మొదటి సర్పంచ్ ఎన్నికల్లో కూడా ఈటల రాజేందర్ అభ్యర్థులు ఓడిపోయేలా బండి సంజయ్ ప్లాన్ వేశారట.

దీంతో ఈటల రాజేందర్ కు హుజురాబాద్ నియోజకవర్గంలో ఘోర అవమానం ఎదురైనట్లు ప్రచారం సాగింది. దీంతో బహిరంగంగానే ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. బండి సంజయ్ పేరు ఎత్తకుండా విమర్శలు చేశారు. ఇలాంటి నేపథ్యంలో హరీష్ రావుతో ఈటల రాజేందర్ సమావేశమైనట్లు తెలుస్తోంది. అందరూ సంక్రాంతి సంబరాలలో మునిగి తేలగా ఈ ఇద్దరు మాత్రం ఫామ్ హౌస్ లో రహస్యంగా సమావేశం అయ్యారట. ఇదంతా కేసిఆర్ కు తెలిసే జరిగిందని టాక్ నడుస్తోంది.




## బీజేపీ పిటిషన్‌పై సుప్రీం కోర్టులో కీలక పరిణామం

న్యూఢిల్లీ : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీం కోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీం ధర్మాసనం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో రాష్ట్ర బీజేపీ సుప్రీం న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. గతంలో పెండింగ్‌లో ఉన్న కేసుతో బీజేపీ పిటిషన్‌ను కూడా జత చేసిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఫిబ్రవరి 6కు వాయిదా వేసింది. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. మూడు నెలల్లోపు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించినప్పటికీ.. ఆ ఆదేశాలను అమలు చేయలేదని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో స్పీకర్?పై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని కోరుతూ తెలంగాణ బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. తాను ఇంకా కాంగ్రెస్‌లోనే ఉన్నానని చెప్పిన కామెంట్లనూ ఈ పిటిషన్‌లో పొందుపరిచారు. గత నవంబర్‌లోనే స్పీకర్‌కు సుప్రీం కోర్టు కంటెంప్ట్ నోటీసు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు బీజేపీ పిటిషన్‌ను జతచేసి మరోసారి నోటీసులు జారీ చేయడంతో ఈ కేసు మరింత హాట్ టాపిక్‌గా మారింది.

## హార్వర్డ్ విద్యార్థిగా సీఎం రేవంత్ రెడ్డి

- హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రత్యేక కోర్సులో చేరిన సీఎం రేవంత్
- 5 రోజుల పాటు కొనసాగనున్న 'లీడర్‌షిప్ ఫర్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ' కోర్సు
- భారతదేశంలో ఇలాంటి కోర్సులో చేరుతున్న తొలి సిట్టింగ్ సీఎంగా గుర్తింపు
- కోర్సు పూర్తయ్యాక హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకోనున్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలో విద్యార్థిగా చేరనున్నారు. ఆయన 5 రోజుల పాటు జరిగే ఎగ్జిక్యూటివ్ లీడర్?షిప్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు తన పేరును నమోదు చేసుకున్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో పదవిలో ఉండగా ఒక ముఖ్యమంత్రి ఇలాంటి ఐవీ లీగ్ యూనివర్సిటీలో నాయకత్వ కోర్సు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. హార్వర్డ్ కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో ఈ నెల 25 నుంచి 30 వరకు ఈ కోర్సు జరగనుంది. 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కేయాస్, కాన్‌ఫ్లిక్ట్, అండ్ కరేజ్' (21వ శతాబ్దపు నాయకత్వం: అరాజకం, సంఘర్షణ, ధైర్యం) పేరుతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులో భాగంగా తరగతులకు హాజరవడం, అసైన్‌మెంట్లు పూర్తి చేయడం, హోంవర్క్ సమర్పించడం, గ్రూప్ ప్రాజెక్టులలో పాల్గొనడం వంటివి ఉంటాయి. వాస్తవ ప్రపంచంలోని సమస్యలను కేస్ స్టడీస్?గా తీసుకుని, వాటికి పరిష్కారాలు కనుగొనడంపై ఈ



కోర్సులో ప్రధానంగా దృష్టి సారిస్తారు. ఐదు ఖండాలకు చెందిన 20కి పైగా దేశాల నుంచి సీనియర్ నాయకులు, నిపుణులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత రేవంత్ రెడ్డికి హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికేషన్ లభిస్తుంది. పదవిలో ఉండగా హార్వర్డ్ సర్టిఫికెట్ అందుకోనున్న తొలి భారత ముఖ్యమంత్రిగా కూడా ఆయన నిలవనున్నారు. ఆధునిక నాయకత్వ విధానాలను అధ్యయనం చేసి, వాటిని తెలంగాణ పాలనలో అమలు చేయాలనే ఉద్దేశంతో రేవంత్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలుస్తోంది.




# మున్సిపల్ పోరులో కాంగ్రెస్ జోరు...!

## ఇంకా ప్రచారం ఊసే లేని బీఆర్ఎస్

## ఎన్నికలు ముంచుకొస్తున్నా ఆన్‌లైన్ రాజకీయమే!

హైదరాబాద్ : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆరచవతీతీచస్ పార్టీల మధ్య క్షేత్రస్థాయి పోరాటం విషయంలో స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇప్పటికే ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టగా, బీఆరచవతీతీచస్ మాత్రం కేవలం ప్రకటనలకే పరిమితమవుతోంది.

**బహిరంగసభలపై కసరత్తు ఏది?....** నెల రోజుల క్రితం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, పదిహేను రోజుల్లో మూడు జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ ప్రకటనతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వస్తుందని అందరూ భావించారు. కానీ, ఆ గడువు ముగిసి నెల రోజులు గడుస్తున్నా, ఆ సభల ఊసే ఎత్తకపోవడం పార్టీ క్యాడర్కు ఇబ్బందికరంగానే మారింది. కేసీఆర్ ప్రకటన తర్వాత క్షేత్రస్థాయిలో ఎలాంటి కదలిక లేకపోవడంతో, ద్వితీయ శ్రేణి నాయకత్వం , కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై రోడ్డెక్కి పోరాడాల్సిన సమయంలో, కేసీఆర్ మౌనం దాల్చడం బీఆర్ఎస్ వ్యూహకర్తలను కూడా ఆలోచనలో పడేస్తోంది.

**తన పని తాను చేసుకెళ్తున్న రేవంత్ రెడ్డి...** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ కార్యాచరణలో అత్యంత చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే జిల్లాల పర్యటనలు ప్రారంభించిన ఆయన, వచ్చే నెలలో తొమ్మిది జిల్లాల్లో భారీ బహిరంగ సభలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పాలమూరులో ట్రిపుల్ ఐటీ శంకుస్థాపన, మేడారంలో కేబినెట్ భేటీ వంటి నిర్ణయాల ద్వారా పాలనను ప్రజల వద్దకు తీసుకెళ్తూనే, రాజకీయంగా కూడా మైలేజ్ పొందే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తుండటంతో కాంగ్రెస్ శ్రేణులు పూర్తిస్థాయి ఎన్నికల మోడ్లోకి వెళ్లిపోయాయి.

**ఆన్ లైన్ రాజకీయాల్లోనే ఇంకా బీఆర్ఎస్...** బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం సోషల్ మీడియా విమర్శలు, ప్రెస్ మీట్లు , ట్విట్టర్ వేదికగా చేసే ఆరోపణలకే పరిమితం అవుతోంది. కేటీఆర్, హరీష్ రావు వంటి నేతలు నిత్యం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నప్పటికీ, అది కేవలం డిజిటల్ వేదికలకే పరిమితం కావడం వల్ల సామాన్య ఓటరుపై దాని ప్రభావం తక్కువగా ఉంటోంది. రాజకీయాల్లో కంటికి కనిపిస్తేనే ఓటు అనే సూత్రం బలంగా ఉంటుంది. రేవంత్ రెడ్డి జనంలోకి వెళ్తుండగా, బీఆరచవతీతీచస్ నేతలు ఇళ్లకే పరిమితమవ్వడం ఆ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో చేటు తెచ్చే ప్రమాదం ఉంది.

**మున్సిపల్ ఓటర్ల ఓటింగ్ ఎజెండా పక్కా లోకలే!...** మున్సిపల్ ఎన్నికలు అనేవి స్థానిక సమస్యలు, నేరుగా ఓటరుతో ముడిపడి ఉన్నవి. ఇక్కడ భావోద్వేగాల కంటే నాయకుల చురుకుదనం ముఖ్యం. రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోవాలంటే బీఆరచవతీతీచస్ కేవలం ఆరోపణలతో సరిపెట్టకుండా, కేసీఆర్ చెప్పినట్లుగా బహిరంగ సభల ద్వారా ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, అధికార యంత్రాంగం , సంక్షేమ పథకాల జోరుతో దూసుకుపోతున్న కాంగ్రెస్ను ఎదుర్కోవడం గులాబీ దళానికి కత్తిమీద సామే అవుతుంది. ప్రకటనలకు.. ఆచరణకు మధ్య ఉన్న ఈ అంతరం బీఆర్ఎస్ ఓటు బ్యాంకును దెబ్బతీసే అవకాశం ఉంది. రాజకీయాల్లో టైమింగ్ చాలా ముఖ్యం. రేవంత్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల వేటను ప్రారంభించిన తరుణంలో, బీఆర్ఎస్ ఇంకా సభల ముహూర్తాల కోసమే ఎదురుచూస్తుండటం ఆ పార్టీ బలహీనతను సూచిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు బీఆర్ఎస్ తన పంథాను మార్చుకోకపోతే, పట్టణ ఓటర్లు అధికార పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.




# కమల దళానికి కొత్త బాస్

## బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ ఏకగ్రీవ ఎన్నిక..

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవి కోసం జరిగిన ఎన్నికలో ఆయనొక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. 2026, జనవరి 20వ తేదీన బీజేపీ 12వ జాతీయ అధ్యక్షుడిగా ఆయన పదవి బాధ్యతలు స్వీకరించారు. 2026, జనవరి 19న బీజేపీ జాతీయ అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగింది. సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నామినేషన్ పత్రాల పరిశీలన జరిగింది. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం కల్పించారు. అధ్యక్ష పదవికి నితిన్ నబిన్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. నితిన్ నబిన్ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్ నితిన్ గడ్కరీ, జి కిషన్ రెడ్డి, మనోహర్ లాల్ ఖట్టర్ సహా సీనియర్ మంత్రులు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపర్చారు.

**నితిన్ నబీన్ బ్యాగ్రౌండ్:** బీహార్ సీనియర్ పొలిటిషియన్, దివంగత నవీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా కొడుకే నితిన్ నబీన్. కాయస్త కమ్యూనిటీకి చెందిన ఆయన.. ఇప్పటివరకూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2006లో ఆయన తండ్రి నవీన్ కిశోర్ మరణంతో పాట్నా వెస్ట్ అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక వచ్చింది. ఈ ఎన్నికకు బీజేపీ అధిష్టానం నితిన్‌ను బరిలోకి దింపగా ఆయన ఘన విజయం సాధించారు. ఆ తరువాత బంకిపూర్ అసెంబ్లీ నుండి పోటీ చేసి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. నాలుగవసారి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నితీష్ కుమార్ మంత్రివర్గంలో రాష్ట్ర రోడ్డు నిర్మాణ శాఖ మంత్రిగా పని చేశారు నితిన్ నబిన్.

ఇటీవలే బీజేపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం బీజేపీ 12వ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2026లో వెస్ట్ బెంగాల్, తమిళనాడు వంటి కీలకమైన రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు ఆయన పనితనానికి సవాల్ విసరనున్నాయి.




## మేడారంలో గద్దెలను పునఃప్రారంభించిన సీఎం రేవంత్


ములుగు: మేడారంలో గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని సీఎం రేవంత్ రెడ్డి పునఃప్రారంభించారు. అనంతరం తన కుటుంబంతో కలిసి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని సీఎం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను రేవంత్ ఆవిష్కరించారు. అంతకుముందు మేడారం గద్దెల ప్రాంగణం వద్దకు కుటుంబ సమేతంగా చేరుకున్న సీఎంకు ఆదివాసీ సంప్రదాయ డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





వెండి ధర పగ్గాల్లేకుండా పరుగులు పెడుతోంది. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో కిలో వెండి ధర తొలిసారి రూ.3 లక్షల మార్క్ దాటింది. మార్చి డెలివరీ కాంట్రాక్ట్ ఒక్క రోజులోనే రూ.13,553 పెరిగి రూ.3,01,315 చేరింది. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు ధర రికార్డు స్థాయిలో 94.35 డాలర్లకు పెరిగింది. గతేడాది డిసెంబర్? 31 నాటికి రూ.2.35 లక్షలుగా ఉంది. ఈ ఏడాదిలో (2026) ఇప్పటివరకు రూ.66 వేల వరకు పెరగడం గమనార్హం. మరోవైపు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,480కు చేరింది.

అంతర్జాతీయంగా నెలకొన్న డిమాండ్, వెండి పథకాల్లోకి ఇటీవల కాలంలో పెద్దఎత్తున పెట్టుబడుల ప్రవాహం పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, బలహీనంగా కదలాడుతోన్న అమెరికా డాలర్.. ఇవన్నీ వెండి గిరాకీకి అనుకూలంగా మారాయి. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టాక ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు, వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాల వడ్డింపు ఫలితంగా అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, ద్రవ్యోల్బణం పెరిగి – వృద్ధి మందగించటం తదితర కారణాల వల్ల సురక్షితమని భావించి బంగారం, వెండి కొనుగోలు చేయడం పెరిగింది. వెండికి ఆభరణాల రంగాన్ని మించి, పారిశ్రామిక గిరాకీ అధికం. సెమీకండక్టర్, సౌర విద్యుత్తు, విద్యుత్తు వాహన విభాగాల నుంచి వెండికి గిరాకీ పెరుగుతోంది. ధర పెరుగుతున్నందున, ఎక్కువమంది వెండి ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)లలో పెట్టుబడి పెడుతున్నారు. ధర బాగా అధికమయ్యేందుకు ఇది దోహదపడుతోంది.




హైదరాబాద్: నైనీ బొగ్గు గనుల టెండర్లపై సీబీఐ విచారణకు ఆదేశించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. భాజపా, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఆరు గ్యారంటీలను పక్కన పెట్టి వాటాల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. ఔట్ సోర్సింగ్ సీఎంకు.. అసలైన కాంగ్రెస్ వాదులకు మధ్య వార్ నడుస్తోందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.




పేదల సంక్షేమాన్ని కాంక్షిస్తూ.. ఓ కలెక్టర్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. పేదల కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలు వారికి అందేవరకు తాను జీతం తీసుకోనని ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు తనతో పాటు అధికారులు అందరూ ఈ విషయంపై పూర్తి శ్రద్ధ పెట్టేలా చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. దీంతో స్థానికంగా ఆయన గురించి చర్చ మొదలయ్యింది. ఆయనే రాజస్థాన్?లోని రాజ్ సమండ్ జిల్లా కలెక్టర్ అరుణ్ కుమార్ హసిజా. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం రూపొందించిన మూడు పథకాలను తన జిల్లాలోని ప్రజలందరికీ అందేలా చర్యలు తీసుకుంటానని రాజ్‌సమండ్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అరుణ్ ప్రతిజ్ఞ చేశారు. ఈ పథకాల నుంచి జిల్లాలోని ప్రతిఒక్కరూ ప్రయోజనం పొందేవరకు తన జీతం వదులుకోవాలని నిర్ణయించుకున్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ.."మా జీతం 10 రోజులు ఆలస్యమైనా చాలా ఇబ్బందులు పడతాము. అదే పేదరికంలో మగ్గేవారు, వారి పిల్లల చదువులు, పనులు చేసుకోలేని వికలాంగులు, వృద్ధుల పరిస్థితి మరింత బాధాకరంగా ఉంటుంది. పథకాల కోసం నమోదు చేసుకోవడానికి కూడా వాళ్లు అనేక ఇబ్బందులు పడుతుంటారు. అందుకే ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలు వారికి ఎలాగైనా చేర్చాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాను" అని తెలిపారు. అధికారిక నివేదికల ప్రకారం.. రాజ్ సమండ్ జిల్లాలో దాదాపు 30వేల మంది పేద ప్రజలు ఉన్నారు. వీరికోసం రాజస్థాన్? ప్రభుత్వం మూడు పథకాలను అందిస్తోంది. అయితే పలు కారణాల వల్ల చాలామంది ప్రజలు వీటిని పొందలేకపోతున్నారు. ఆ పథకాలు ఏంటంటే..

1. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఉచిత రేషన్ లేదా గోధుమలు అందించడం 2. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లల పేర్లను 'పలన్హార్ యోజన' కింద నమోదు చేసి, ప్రయోజనాలు అందించడం 3. ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులకు పింఛన్లు

కలెక్టర్ నిర్ణయంతో వెంటనే కదిలిన జిల్లా యంత్రాంగం పింఛన్ల పథకం కింద జిల్లాలోని 1,90,440 మంది లబ్ధిదారుల పేర్లు నమోదు చేసింది. పెండింగ్‌లో ఉన్న వారి ధ్రువీకరణలు కూడా త్వరలో పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నెలాఖరుకు మూడు పథకాలకు సంబంధించిన పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అయితే అరుణ్ కుమార్ ఇలా ప్రజా సమస్యల పరిష్కారాల కోసం వినూత్న మార్గాలను ఎన్నుకోవడం ఇదే మొదటిసారి కాదని.. గతంలోనూ రైతులు, ప్రజలకు పథకాల కోసం అనేక చర్యలు తీసుకున్నారని తెలిపారు.




నాగర్‌కర్నూల్ : ప్రతి నిరుపేద కుటుంబానికి నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. నాగర్‌కర్నూల్‌లో పర్యటించిన ఆయన రూ.40 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 109 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఆస్పత్రిలో క్యాన్సర్ రోగుల కోసం కీమోథెరపీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సభకు వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. విద్యార్థులు సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. నైపుణ్యంతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యార్థుల చదువు సమాజాభివృద్ధికి దోహదపడాలన్నారు. రాష్ట్రంలో 105 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం మాటలు.. రాజకీయ విద్వేషాలు పెంచేలా ఉన్నాయి: దాసోజు శ్రవణ్



హైదరాబాద్ : ఖమ్మం బహిరంగ సభలో కేసీఆర్, బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉన్నాయని ఆ పార్టీ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. రాజ్యాంగం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సీఎం వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సమాజంలో హింస, రాజకీయ విద్వేషాలు పెంచేలా మాట్లాడారని చెప్పారు. ఆయనపై సుమోటో కేసులు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. వ్యాఖ్యలు ప్రచారం చేసిన సోషల్‌మీడియా, మీడియా సంస్థలపైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు చెప్పారు. మరోవైపు సీఎం వ్యాఖ్యలపై డీజీపీ కార్యాలయంలో బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. పార్టీ ఆదేశాల మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లోని పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు.

## మహిళలు ఎలాంటి డ్రెస్ వేసుకోవాలో చెప్పడానికి మీరు ఎవరు?: రేణుకా చౌదరి



**హైదరాబాద్ : జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి ఆరోపించారు. పేదల హక్కును కాలరాసే అధికారం ప్రధాని మోదీకి లేదని విమర్శించారు. ఇతర అంశాలపైనా రేణుకా చౌదరి మాట్లాడారు. "మహిళలు ఎలాంటి డ్రెస్? వేసుకోవాలో చెప్పడానికి మీరు ఎవరు? సో షల్ మీడియాలో పిచ్చిపిచ్చిగా మాట్లాడితే బాగోదు. మహిళల విషయంలో తప్పుడు వార్తలు రాయడం మంచిది కాదు" అని అన్నారు.**




## 10 రోజుల్లో 1000 మంది బాధితులకు సీ-మిత్ర బృందం ఫోన్

హైదరాబాద్: సైబర్ నేరాల్లో బాధితులకు సత్వర న్యాయం కోసం తీసుకొచ్చిన వినూత్న కార్యక్రమం 'సీ–మిత్ర' మంచి ఫలితాలు ఇస్తోందని హైదరాబాద్ పోలీసులు వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దీన్ని అమలు చేస్తున్నారు. కేవలం 10 రోజుల్లో 1000 మంది బాధితులకు సీ–మిత్ర బృందం స్వయంగా ఫోన్ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో 200 మందికి ఫిర్యాదు డ్రాఫ్టులను పోలీసులు సిద్ధం చేశారు. సంతకం చేసిన ఫిర్యాదులు అందగానే పోలీసులు తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఎలాంటి జాప్యం లేకుండా 100కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. నిమిషాల్లోనే మొబైల్‌కు ఎఫ్ఐఆర్ కాపీలు పంపిస్తున్నారు. 'సీ–మిత్ర'పై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## ఉన్నావ్ బాధితురాలి తండ్రి మృతి కేసు.. కుల్దీప్ సెంగర్‌కు దిల్లీ హైకోర్టులో చుక్కెదురు

దిల్లీ: ఉన్నావ్ అత్యాచార ఘటనకు సంబంధించి బాధితురాలి తండ్రి 'కస్టడీ' మృతి కేసులో భాజపా బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్‌కు దిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో పదేళ్ల శిక్షను నిలిపివేయాలంటూ దాఖలు చేసిన ఆయన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. శిక్ష విషయంలో ఉపశమనం కల్పించేందుకు సరైన కారణాలు లేవని జస్టిస్ రవీందర్ పేర్కొన్నారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 3కి వాయిదా వేశారు. ఉన్నావ్ అత్యాచార కేసులో కుల్దీప్ సెంగర్ దోషిగా తేలి, జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. ఇటీవల ఈ శిక్షను నిలిపివేస్తూ.. దిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు షరతులపై బెయిల్? కూడా మంజూరు చేసింది. అయితే.. ఈ తీర్పుపై సీబీఐ అధికారులు, బాధితురాలి తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో శిక్ష నిలిపివేతపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. కస్టడీ నుంచి విడుదల చేయొద్దని పోలీసుశాఖను ఆదేశించింది. 2017లో కుల్దీప్ సింగ్ సెంగర్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడ్డాడు. 2018 ఏప్రిల్?లో ఆమె తండ్రి పోలీసు కస్టడీలో మృతి చెందాడు. ఆగస్టు 1, 2019న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అత్యాచారం కేసు, సంబంధిత ఇతర కేసులను ఉత్తరప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుంచి దిల్లీకి బదిలీ చేశారు. అత్యాచారం కేసులో జీవిత ఖైదు, బాధితురాలి తండ్రి మృతి కేసులో పదేళ్ల జైలు శిక్ష పడింది.

# జానపద చిత్ర బ్రహ్మ బి.విఠలాచార్య - జనవరి 20... విఠలాచార్య జయంతి



పాతతరం, కొత్తతరం తరం ఎదైనా తెలుగు సినిమా ప్రేక్షకులకు బి.విఠలాచార్య పేరు పరిచయం చేయాల్సిన అవసరం లేదంటే అతిశయోక్తి కాదేమో. నట సార్వభౌముడు నందమూరి, కత్తి వీరుడు కాంతారావు ను సినీ ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే రీతిలో సినిమాలు తీసి, వారికి మాస్ ఫాలోయింగ్ కల్పించింది విఠలాచార్య అనడంలో అతిశయోక్తి కి తావే లేదేమో. మాయలూ, మంత్రాలూ, ఇంద్ర మహేంద్ర జాలాలు, మానవాతీత శక్తులు, టక్కుటమార విద్యలూ, క్షుద్ర శక్తులు, తన చిత్రాలలో చూపించే సాటి రాని మేటి ప్రతిభా శాలి ఆయన. ఒక చిత్రానికి, మరో చిత్రానికి పోలిక లేకుండా, చిత్ర విచిత్ర వినూత్న ఆలోచనలను సాకారం చేసిన అపూర్వ సన్నివేశాల సృష్టికర్త ఆయన. అందుకే విఠలాచార్య జానపద చిత్ర బ్రహ్మ గా సుపరిచితుడు. ఆయన సినిమాల్లో నటీ నటులే కాకుండా జంతువులు, పక్షులు, అపరిచిత రూపాలు పాత్ర దారులై ఉండడం విశేషం. దర్శకత్వ ప్రతిభకు తోడు, నిర్మాతగా ప్రేక్షకులను ఆకర్షించే సెట్టింగులను రూపొందించడం ప్రత్యేకం. బి.విఠల ఆచార్య లేదా బి.విఠలాచార్య (జనవరి 20, 1920 – మే 28, 1999) 'జానపద బ్రహ్మ' అని పేరు పొందిన తెలుగు సినిమా దర్శకులు, నిర్మాత. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో 70 చిత్రాలను రూపొందించిన ఆయన 1920 జనవరి 28 న కర్ణాటకలో ఉడిపిలో జన్మించారు. కొంతకాలం సర్కస్ కంపెనీలో జంతువుల ఆలనా పాలనా చూడడం చేత వాటిని తన చిత్రాలలో ఎలా వినియోగించు కోవాలో తర్ఫీదు పొందాడు. ఆయన ఎన్నో జానపద చిత్రాలకు అద్భుతమైన దర్శకత్వం వహించాడు. అప్పటి పరిమితమైన సాంకేతిక పరిజాచవతీతీచనముతో ఆయన చూపించిన ప్రతిభ అసామాన్య మైనది. చాలా కొద్ది ఖర్చుతో ఆయన కనుల కింపైన జానపద కళా ఖండాలను రూపొందించాడు. 1942 లో చిత్రరంగ ప్రవేశము చేసిన ఆయన నిర్మాతగా డి.శంకర్ సింగ్ తో కలిసి దాదాపు 18 చిత్రాలను తమ మహాత్మా పిక్చర్స్ పతాకముపై నిర్మించారు. వీటిలో సాంఘిక చిత్రాలే అధికం. తొలిసారిగా తెలుగులో 1953లో షావుకారు జానకి ప్రధాన పాత్ర పోషించిన కన్యాదానం చిత్రానికి దర్శకత్వము వహించాడు. క్రమంగా తెలుగులో నిర్మాతగా, దర్శకునిగా కూడా రాణించి అనేక జానపద చిత్రాలను తీశాడు. అయన దర్శకత్వం వహించిన చిత్రాలలో 15 చిత్రాలు నందమూరి తారక రామారావు నటించినవే అందులో 5 చిత్రాలను విఠలాచార్యే స్వయంగా నిర్మించాడు. ఆయన చిత్రాలలో హేతుబద్ధతకు తావే లేదు. 'అదెందుకు, ఎలా జరిగింది?' అన్న ప్రశ్నలు ఉత్పన్నం కావు. ప్రేక్షకులను ఆహ్లాద పరచడమే ముఖ్యం. తెలుగు చందస్సుకు సంబంధించిన "యమాతారాజభానసలగం" అనే సూత్రాన్ని రాజనాల మాంత్రికుని తాంత్రిక మంత్రంగా పెట్టినా, ప్రేక్షకులు ఆనందించారు, ఆదరించారు. అందుకే ప్రజల నాడిని, వారు ఇష్టపడే అంశాలను దొరికి పుచ్చుకుని, ట్రిక్కులు చేయించడంలో అందె వేసిన చేయిగా ఖ్యాతిని గడించాడు. సినిమా నిర్మాణంలో 'పొదుపు'ను ఎలా చేయాలో, అతి తక్కువ ఖర్చుతో ఎలా సినిమా నిర్మించాలో ఆయనకు తెలిసినంత మరెవరికీ తెలియదేమో. అలా వ్యాపారాత్మక చిత్రాలు చేసి విజయం సాధించి, ఆ కళలో తనకు ఎవరూ సాటి రారని రుజువు చేసుకున్నాడు. ఎన్నెన్నో దృశ్యాలు...అన్నీ ఒకే ఒక సెట్లో ఇమిడి పోయేవి. సామాన్య జనానికీ, సినిమా చూట్టంలో లీనమైపోయే ప్రేక్షకులకు ఈ తేడాలు అక్కర్లేదని విఠలాచార్య విశ్వసించేవారు. అలాగే కాస్ట్యూమ్స్?, ఆభరణాలూ, ప్రతి సినిమాకీ మార్చవలసిన అవసరం లేదు ముఖ్యపాత్రకి తప్ప అని నమ్మి చేసి చూపించాడు. 'నటీనటుల కాల్? షీట్లు గల్లంతైతే, వాళ్లని చిలకలుగానో, కోతులుగానో మార్చడం ఆయనకే చెల్లింది' అని ఒక సందర్భంలో కాంతారావు వివరించాడు. కన్యాదానం (1955), పెళ్ళి మీద పెళ్ళి (1959), కనకదుర్గ పూజా మహిమ (1960), బందిపోటు (1963), అగ్గి బరాటా (1966), చిక్కడు దొరకడు (1967), నిన్నే పెళ్ళాడుతా (1968) – ఈ చిత్రానికి కథ, చిత్రానువాదం, బి.విఠలాచార్య, దర్శకత్వం బి.వి.శ్రీనివాస్ భలే మొనగాడు (1968), ఆలీబాబా 40 దొంగలు (1970), లక్ష్మీ కటాక్షం (1970), విజయం మనదే (1970), రాజకోట రహస్యం (1971), జగన్మోహిని (1978), గంధర్వ కన్య (1979), మదన మంజరి (1980) తదితర చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. విఠలాచార్య ఎంతో దక్షతా, బాధ్యతా గల నిర్మాత. నటీ నటులకు, టెక్నీషియన్లకు తాను ఇస్తానన్న మొత్తాన్ని విభజించి ప్రతినెలా ఒకటో తేదీకల్లా – చిన్నా, పెద్దా అందరికీ చెక్కులు అందించడం ఆయనకే చెల్లింది. టైముకి ముందుగానే షూటింగ్ పూర్తిచేసి, అనుకున్న తేదీకి సినిమా విడుదల చెయ్యడం ఆయనకే సాధ్యమైంది. అలాగే నటీనటులకి కాల్ షీట్స్ అడ్జస్ట్ చెయ్యడంలో కూడా ఆయన 'నంబర్‌వన్' అనిపించు కునేవాడు. ముందుగా చెబితే, ఒప్పుకున్న డేట్స్?ని అటూ, ఇటూగా మార్చి చిన్న, పెద్ద నటీనులందిరికీ, సహాయపడేవాడు. వేషాలకోసం ఆఫీసులకి వెళ్తే విఠలాచార్య వచ్చిన ప్రతీ ఒక్కరినీ తన గదిలోకి పిలిచి, కూచోబెట్టి కాఫీ ఇచ్చి మాట్లాడి పంపించే వాడు. ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న జానపద చిత్ర బ్రహ్మ 1999, మే 28 న 80 యేళ్ల వయసులో మద్రాసులోని కన్ను మూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన కృష్ణంరాజు

## - జనవరి 20...రెబల్ స్టార్ కృష్ణంరాజు జయంతి



తెలుగు ప్రేక్షకులకు రిబెల్ స్టార్ గా సుపరి చితమై, తెలుగు సినీ పరిశ్రమలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న మహానటుడు ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు, ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. తన నైజం, నటన, శరీర భాష, గంభీర స్వరంతో 'రెబల్ స్టార్'గా పిలువ బడుతూ, ఆయన తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక యుగాన్ని సృష్టించారు. కృష్ణంరాజు 1940 జనవరి 20న ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లాలోని మొగల్తూరు గ్రామంలో జన్మించారు. చిన్ననాటి నుంచే కళలపై ఆసక్తి కనబరచిన ఆయన, చదువు పూర్తిచేసిన తరువాత కొంతకాలం జర్నలిస్టుగా పనిచేశారు. జర్నలిజం వృత్తిలో ఉండే సమయం లోనే ఆయన సినీ రంగం పట్ల ఆసక్తి కలిగి, నటుడిగా మారాలని నిర్ణయించు కున్నారు. కుటుంబంలో ఆయనకు చాలా ప్రేమతో కూడిన అనుబంధం ఉండేది. ఆయన సోదరుని కుమారుడు ప్రభాస్ కూడా ప్రముఖ నటుడిగా ఎదగడంలో కృష్ణంరాజు ప్రేరణ ప్రధాన కారణం. కృష్ణంరాజు 1970లో "చిలకా గోరింక" సినిమాతో తెరంగేట్రం చేశారు. ఆ చిత్రం ఆయన నటనకు మంచి ఆరంభం ఇచ్చింది. ఆ తరువాత విడుదలైన "భక్త కన్నప్ప", "అమర దీపం", "తాండ్ర పాపారాయుడు" వంటి చిత్రాల్లో ఆయన పాత్రలు, నటన, మాటల ప్రభావం ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేశాయి. ఆయన కెరీర్‌లో పౌరాణిక, చారిత్రక, సాంఘిక, యాక్షన్ చిత్రాలు ప్రత్యేకంగా నిలిచాయి. సానుకూల పాత్రలతోపాటు ప్రతినాయక పాత్రల్లోనూ ఆయన అద్భుతమైన ప్రతిభను చూపారు. కృష్ణంరాజు నటించిన కొన్ని ప్రముఖ చిత్రాలు...అమరదీపం: ప్రేమ, బాధ, త్యాగాలను చూపించిన ఈ చిత్రం ఆయన కెరీర్?లో మైలురాయిగా నిలిచింది. బొబ్బిలి బ్రహ్మన్న: ఆచారాలు, కుటుంబ సంబంధాలు ప్రతిఫలించిన ఈ సినిమా ఆయనకు భారీ గుర్తింపును తీసుకొచ్చింది. తాండ్ర పాపారాయుడు: చారిత్రక నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రంలో ఆయన నటనకు ప్రశంసలు లభించాయి. కటకటాల రుద్రయ్య: యాక్షన్ చిత్రాల్లో ఆయన శక్తివంతమైన పాత్రలకు ఇది ఉదాహరణ. కృష్ణంరాజు 'రెబల్ స్టార్'గా పిలవ బడటానికి ప్రధాన కారణం ఆయన పాత్రలు. సాధారణ పాత్రలకు భిన్నంగా, విప్లవాత్మకమైన, ధైర్యవంతమైన పాత్రలు చేయడంలో ఆయనకి ప్రత్యేక నైపుణ్యం ఉంది. ప్రతి పాత్రలోనూ గంభీర స్వరంతో, శక్తివంతమైన డైలాగ్ డెలివరీతో ప్రేక్షకులను కట్టి పడేశారు. కృష్ణంరాజు 'గోపీకృష్ణ మూవీస్' పతాకంపై అనేక విజయవంతమైన సినిమాలను నిర్మించారు. నిర్మాతగా కూడా ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. కృష్ణంరాజు తన నటనకు అనేక అవార్డులను గెలుచుకున్నారు...నంది అవార్డులు, ఫిలింఫేర్ అవార్డులు, జీవిత సాఫల్య పురస్కారాలు తదితరాలు. కృష్ణంరాజు రాజకీయ రంగంలో కూడా విజయవంతమైన పాత్ర పోషించారు. భారతీయ జనతా పార్టీ (దీజీూ)లో చేరి, లోక్?సభకు ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ తరువాత కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవారు. కృష్ణంరాజు వ్యక్తిగత జీవితంలో సరళత, దయ, ఉదారత కోసం ప్రసిద్ధి చెందారు. ఆయన అందించిన సేవలు, అభిమానుల పట్ల చూపించిన ప్రేమ ఆదర్శప్రాయంగా నిలిచాయి. 2022 సెప్టెంబర్ 11న కృష్ణంరాజు తన చివరి శ్వాస విడిచారు. తెలుగు సినీ రంగం ఆయన మరణంతో ఒక గొప్ప నటుడిని కోల్పోయింది. ఆయన అభిమానుల హృదయాల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి పోతారు. కృష్ణంరాజు తెలుగు చిత్రసీమకు ఒక అద్భుతమైన నటునిగా నిలిచారు. నటుడిగా, నిర్మాతగా, రాజకీయ నాయకుడిగా, ఆయన జీవితం అందరికీ ప్రేరణ. తెలుగు సినిమా ప్రేమికులు ఆయనను ఎప్పటికీ మర్చిపోలేరు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**



# పుష్కరాలకు 359 స్నాన ఘట్టాలు

## రూ. 445.44 కోట్లతో ప్రతిపాదనలు కొత్తగా 125 ఘాట్ల నిర్మాణం

రాజమహేంద్రవరం : గోదావరి పుష్కర పనులపై యంత్రాంగం దృష్టి సారించింది. 2027లో జరగనున్న పుష్కరాలకు సంబంధించి మొత్తం 359 స్నానఘట్టాలు సిద్ధం చేయడానికి రూ.445.44 కోట్లతో ఇప్పటికే ఇరిగేషన్? శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభించనున్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అంబేడ్కర్? కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాల పరిధిలో స్నాన ఘట్టాలు నిర్మించనున్నారు. ఇప్పటికే పాత ఘాట్లు 234 ఉన్నాయి. వాటిలో 69 ఘాట్ల విస్తరణకు నిర్ణయించారు. కొత్తగా రూ.127.46 కోట్లతో 125 స్నాన ఘట్టాలు నిర్మించనున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో కొత్తగా రూ.29.75 కోట్లతో 29 ఘాట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.11.58 కోట్లతో 8 ఘాట్లు, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రూ.68.63 కోట్లతో 70 ఘాట్లు, కాకినాడ జిల్లాలో రూ.1.8 కోట్లతో 2 ఘాట్లు , ఏలూరు జిల్లాలో రూ.16.41 కోట్లతో 16 ఘాట్లు నిర్మించనున్నారు. కాగా, పాతఘాట్లు మొత్తం 234 ఉండగా వాటి మరమ్మతులకు రూ.176.88 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు.

# ఆరాధ్య దేవత కన్యక

## మాఘ శుక్ల విదియ కన్యకా పరమేశ్వరి ప్రాయోపవేశం దినం



వాసవీ దేవి అగ్ని ప్రవేశం చేసి, నేటికి 1000 సంవత్సరాలు గడిచాయి. వాసవీ మాత మాఘ శుక్ల పక్ష విదియ శుక్రవారం శతభిష నక్షత్రం రోజున ప్రాయోపవేశం చేసినట్లు పురాణ కథనం. దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించడమే జగజ్జనని కన్యక అవతారం. బ్రహ్మ, విష్ణు, మహే శ్వర త్రైమూర్య దేవతలకు మూల కారణమైన భువనేశ్వరీదేవిని వాసవీ కన్యకా పరమేశ్వరీ రూపమున పూజించడం సదాచార పరంపరగా కొనసాగుతున్నది. గోదావరీ తీరాన గల 714 గోత్రీకులకు నిలయాలైన 18పట్టణాలకు కేంద్రంగా పెనుగొండ ముఖ్య పట్టణంగా మహా సంపదలతో వైశ్యులలో తలమానిక మైన, వేంగి దేశాన్ని ఏలే వైశ్యులకు రాజైన కుసుమ శ్రేష్ఠి, కుసుంబా దేవి దంపతులకు అనేక జన్మార్జితాలైన పుణ్యాలకు తోడు పుత్ర కామేష్ఠి యాగ ఫలము ఏకమై జగజ్జనని పరమేశ్వరీ దేవి, వైశాఖ శుద్ధ దశమి,శుక్రవారం ఉత్తర నక్షత్రం,కన్య రాశిలో అవతరించింది. అంతకు కొన్ని నిమిషాల ముందే ఒక బాలుడు జన్మించాడు. పరమేశ్వరుని పూజా ఫలమైన కుమారునికి విరూపాక్షుడని, జగజ్జనని అవతారమైనందున పరమేశ్వరి అని నామకరణాలు చేశారు. దేవి సర్వప్రాణులలో శక్తి రూపాన వసిస్తున్నందున "వాసవి" అని, పర పురుషులవైపు చూడక, పర మేశ్వరుని యందే మనసు లగ్నం చేసినందున "కన్యక" అని నామాంకితయైనది. ఇరువురు కుల గురువు భాస్కరాచార్యుని వద్ద వేదోక్త సంస్కారాలు, వేదాంగాలు నేర్చుకోగా, పరమేశ్వరి, పండితుల చెంత సంగీత నాట్య సకల కళలలో అసమాన ప్రతిభురాలై, విదుషీమణి యైనది. యుక్త వయస్కుడైన విరూపాక్షునకు, సంపన్న కుబేరుడైన అరిది శ్రేష్టి కూతురు రత్నావళితో వివాహం జరిపించారు. పరమేశ్వరి యౌవన వతియై, విశ్వమయుడైన మృత్యుంజయుడి యందే మనసు లగ్నం చేసి నిరంతర ధ్యానం చేస్తున్నది. ఇలా ఉండగా రాజమహేంద్రవరాన్ని పాలించే దుష్టుడైన విష్ణువర్ధనుడు, పక్క రాజ్యాలను జయించి, తిరిగి వెళుతూ, పెనుకొండ వద్ద ఉద్యానవనంలో బసచేయగా, కుసుమ శ్రేష్ఠి తమ ప్రభువును దర్శింప కట్న కానుకలు, దాస దాసీ జనంతో వెళ్ళాడు. రాజును చూడడానికి మహేశ్వరి, తన తల్లి కుసుంబా దేవితో వెళ్ళి, ఆమె వెనక నిలుచుంది. అపురూప సౌందర్యవతి యైన మహేశ్వరిని రాజు చూసి, కామవాంఛా పరవశుడై తాను వివాహం చేసుకుంటానని, కాదంటే బలవం తంగా తీసుకు వెళతానని ప్రకటిస్తాడు. 714 గోత్రికులు సమావేశమై, ఇట్టి వివాహం వర్ణ సంకరం, వయో వ్యత్యాసముచే అనుచితమని నిర్ణయించారు. అయితే రాజుకు నచ్చ చెప్పి పంపుతారు. కొద్ది దినాలకు విష్ణువర్ధనుడు తిరిగి వివాహ యత్నం చేయగా, పరమేశ్వరిని ఇవ్వడానికి సిద్ధంగా లేమని సమాధానం పంపుతారు. ఇది విన్నంతనే రాజు సందేశ హరులను ఖైదు చేస్తాడు. వారు తప్పించుకుని, పెనుకొండకు చేరుతారు. కుల గురువగు భాస్కరాచార్యుడు అక్షయ నామ సంవత్సర ఫాల్గుణ శుక్లపక్ష పాడ్యమి నాడు 18 పట్టణాల 714 గోత్రికులతో నగరేశ్వర మండపాన సమావేశ పరచగా, మహేశ్వరితో పాటు అగ్ని ప్రవేశం చేయ నిర్ణ యించారు. కన్యకను అభిప్రాయం కోరగా, పరంజ్యోతి నుండి తనను ఎవరూ వేరు పరచ జాలరని, అగ్ని ప్రవేశం ద్వారా జ్ఞాన మార్గాన పరమేశ్వరుని చేరుకుని, కైలాస వాసిని కాగలనని తేల్చి చెప్పింది. ఇది విన్న కొంత మంది ప్రాణ భయంతో పారి పోగా, 102 గోత్రికులు కన్యకతో ప్రాణ త్యాగానికి సంసిద్ధులౌతారు. అగ్ని ప్రవేశ సమయాన వాసవి తన తల్లిదండ్రులు నలకూబర దంపతులని, వీరనారాయణ పురవాసులగు ధనగుప్త దంపతులు కైలాస నివాసులు, నందీశ్వర దంపతులని, 102 గోత్రికులు ప్రమథ గణాలకు చెందిన వారని వివరించింది. దేవి మానవ రూపంలో ప్రత్యక్షం అయింది. ఆమె తన నిజ స్వరూపాన్ని దేదీప్యమాన మైన వెలుగుతో చూపించి నేను ఆది పరాశక్తి ఆర్యమహాదేవి యొక్క అవతరాన్ని అని చెప్పింది. ధర్మాన్ని నిల్పేందుకు, స్త్రీల గౌరవాన్ని కాపాడేందుకు, విష్ణువర్ధనుడిని అంతం చేసేందుకు, వైశ్యుల ఔదార్యాన్ని ప్రపంచానికి చాటేందుకు కలి యుగంలో జన్మించానని చెప్పింది. సతీదేవి తనకి జరిగిన అవమానానికి ప్రతిగా చితి మంటల్లో దూకినట్టుగానే నేను కూడా అగ్నిలోకి దూకి పుణ్య లోకాలని చేరుకుంటాను అని చెప్పింది. కుశుమ శ్రేష్టి గత జన్మలో సమాధి అనబడే గొప్ప ముని. ఆయన తన 102 గోత్రాలకు చెందిన బంధువులతో సహా మోక్షాన్ని కోరాడు. అందుకే మీ అందరిని కూడా ఆత్మ బలి దానానికి పురి కొల్పాను అని అంది. ఆమె అక్కడ చేరిన వారికి దేశ భక్తి, నిజాయితి, సమాజ సేవ, సహనం మొదలగు వాటి గురించి వివరించింది. వైశ్యులంతా వేద చోదితమైన మార్గమును వీడవలదని, వేదోక్త సంస్కారాలన్ని ఆచరించాలని, గాయత్రి మంత్ర జపమాచరించాలని, శృతి స్మృతి నిర్దేశిత మార్గాన్ని అనుసరించాలని ధర్మమార్గాన్ని వీడ వలదని బోధించింది. అలా అగ్ని గుండాన ప్రవేశించి, ఆత్మార్పణం ద్వారా నిజ స్థానాన్ని పొందింది. 102 గోత్రికులు ఆమెను అనుసరించి పుణ్యలోక ప్రాప్తులైనారు. నాటి నుండి వైశ్యులు త్రిమూర్తులకు మూల కారణమైన భువనేశ్వరిని కన్యకా పరమేశ్వరీ రూపాన పూజించడం సదాచారంగా, సత్సంప్రదాయంగా మారింది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**





# కాంగ్రెస్‌లో -జేడీ- పార్టీ విలీనం ..!

అమరావతి : సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న మాజీఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారా ణ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రెడీ అవుతున్నారా? అంటే.. ఔననే అంటున్నాయి రాజకీయ వర్గాలు. కాపు సామాజిక వర్గానికి చెందిన వీవీ లక్ష్మీనారాయణ.. గత 2019, 2024 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2019 లో జనసేన తరపున, 2024లో సొంత పార్టీ -జైభారత్ నేషనల్ పార్టీ- తరపున ఆయన ఎన్నికల్లోకి దిగారు. కానీ.. రెండు సార్లు కూడా ఆయన పరాజయం పాలయ్యారు.

2019 ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత.. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తిరిగి సినీ రంగ ప్రవేశం చే యడంతో.. దీనిపై కినుక వహించిన జేడీ లక్ష్మీనారాయణ .. ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. అనంత రం.. సొంత కుంపటి పెట్టుకున్నారు. జై భారత్ నేషనల్ పార్టీ పేరుతో పెద్ద ఎత్తున సమావేశాలు కూడా పెట్టారు. కానీ, ఆయన ప్రయత్నం ఫలించలేదు. 2024లో కొన్ని స్థానాలకు పోటీ చేసినా.. పరాజయం పాలయ్యారు. ఆయన కుమార్తెను కూడా బరిలో నిలిపారు. ఆమె కూడాఓడిపోయారు. ఇక, ఆ తర్వాతపెద్దగా ప్రజల మధ్య కనిపించని లక్ష్మీనారాయణ తెరవెనుక.. కాంగ్రెస్ పార్టీలో చేరే విష యంపై ప్రయత్నాలుముమ్మరం చేస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో సొంతగా పార్టీని ముందుకు నడిపించే శక్తి కనిపించడం లేదని.. అందుకే తన పార్టీని కాంగ్రెస్?లో విలీనం చేయాలని.. తద్వారా కాంగ్రెస్ తరఫున వచ్చే ఎన్నికల్లో పుంజుకునేందుకు అవకాశం ఉంటుందని జేడీ భావిస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా కాంగ్రెస్పార్టీ పుంజుకునేందుకు జేడీ ఇమేజ్ కూడా ఉపయోగపడే అవకాశం ఉంటుందని చర్చ సాగుతోంది. తన పార్టీని కాంగ్రెస్?లో విలీనం చేయడం ద్వారా.. రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలను జేడీ కోరుకుంటున్నట్టు సీనియర్ల మధ్య చర్చ సాగుతోంది. సహజంగానే.. పార్టీ విలీనం చేసిన వారికి కాంగ్రెస్ కూడా పదవులు ఇస్తోంది. అంతో ఇంతో ఇమేజ్ ఉన్న జేడీ.. తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం ద్వారా.. ఏపీకాంగ్రెస్ చీఫ్ కావాలని యోచిస్తున్నారు.

కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడు, పారదర్శక వ్యక్తి అనే ఈ రెండు ఇమేజ్?లు సొంతం చేసుకున్న ఆయనకు కాంగ్రెస్పార్టీ ఏమేరకు అవకాశం ఇస్తుందో చూడాలి.

చురకలు

# సంపాదకీయం

## కొత్త పార్టీలు...ఎవరికి దెబ్బ పడుతుందో ?

రాజకీయం అన్నాక పార్టీలు పెట్టడం కామన్. కొత్తగా పార్టీలు ప్రతీ సీజన్ కి వస్తూనే ఉంటాయి. గతంలో కూడా అనేక పార్టీలు ఎన్నికల ముందు పుట్టాయి. చాలా వరకూ జాతకాలు తేలి పక్కకు పోయాయి. అతి కొన్ని మాత్రమే సక్సెస్ అయ్యాయి. ఇక సుదీర్ఘంగా కొనసాగుతున్న పార్టీలు అయితే మరీ స్వల్పం అని చెప్పాలి. మారుతున్న జనాల అభిరుచులు, బలమైన సామాజిక వర్గాల నుంచి వస్తున్న డిమాండ్లు, ఆకాంక్షలు ఇలా చాలా విషయాలు చూసుకుంటే కనుక కొత్త పార్టీలు ఆవిర్భావం అంతకంతకు పెరుగు తోంది. అలా 2029 ఎన్నికల ముందు చాలా పార్టీలు పురుడు పోసుకుని రంగ ప్రవేశం చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు

**ఉత్సాహంలో మాజీ ఐపీఎస్ లు :** ఐపీఎస్ అధికారులుగా సుదీర్ఘ కాలం రాష్ట్రానికి సేవలు చేసి తనకంటూ సొంత ముద్రను బలంగా వేసుకుని పాపులర్ అయిన వారు చాలా మంది ఉన్నారు. వారిలో ఏబీ వెంకటేశ్వరరావు ఒకరు, ఆయన గతంలో కీలక పదవులు నిర్వహించి ఉన్నారు. ఇక ఆయన పదవీ విరమణ చేశాక రాజకీయాల మీద మక్కువ పెంచుకున్నారు. తాజాగా ఆయన పలు యూట్యూబ్ చానళ్ళకు ఇంటర్వ్యూ ఇస్తూ తాము తప్పకుండా కొత్త పార్టీ పెడతాను అన్ అంటున్నారు. రాజకీయాల మీద ఆసక్తితో పాటు సమాజానికి సేవ చేయడానికి ఆ రంగం బెటర్ అని భావించే తాను వస్తున్నాను అని చెప్పారు. సో ఏబీ వెంకటేశ్వరరావు పార్టీ అయితే వచ్చే ఎన్నికల నాటికి ఖాయం అని అంటున్నారు. అదే వరసలో మరో ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ కూడా మీడియాతో బాగా ఇంటరాక్ట్ అవుతున్నారు.

**బడుగుల సమస్యల మీద :** ఆయన బడుగులు అణగారిన వర్గాల సమస్యల మీద తాను మాట్లాడు తుంటానని చెప్పుకొస్తున్నారు. వారికి న్యాయం జరిగేం తవరకూ తాను వార్కి అండగా ఉంటాను అని చెబు తున్నారు. బహుశా ఆయన మదిలో ఏదైనా పార్టీ పెట్టే ఆలోచన ఉందా అన్న చర్చ అయితే సాగుతోం ది. ఆయన ఇటీవల కాలంలో ఇస్తున్న ఇంటర్వ్యూలు చేస్తున్న విమర్శలు చూస్తే ఆయన రాజకీయాల పట్ల ఆసక్తిని కలిగి ఉన్నారనే అంటున్నారు.

**షర్మిల విషయంలో :** కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలిగా ఉన్న వైఎస్ షర్మిల రాయలసీమ పరిధిలో ఒక కొత్త పార్టీ ప్రారంభిస్తారు అని పుకార్లు అయితే షికారు చేస్తున్నాయి. ఆ పార్టీ సబ్ రీజనల్ పార్టీగా ఉంటుందని అంటున్నారు. రాయలసీమ రాష్ట్ర సమితి అన్న పేరుతో కూడా ప్రచారం అయితే సాగుతోంది. మరి ఈ వార్తలలో నిజమెంత అన్నది తెలియదు కానీ షర్మిల మాత్రం పార్టీ పెడతారు అని అంటు న్నారు. అదే జరిగితే ఏపీ రాజకీయాల్లో కొత్త సంచలనంగా ఉంటుందని చెబుతున్నారు.

**ఉత్తరాంధ్ర స్థాయిలో :** ఇక ఇంకో వైపు చూస్తే ఉత్తరాంధ్రా స్థాయిలో ఒక సబ్ రీజనల్ పార్టీ ఒకటి ఆవిర్భవించడం ఖాయమని అంటున్నారు. ప్రత్యేకించి శ్రీకాకుళం జిల్లాలో పార్టీ లేదా ఒక ఫ్రంట్ గా ఏర్పడి కొంతమంది లైక్ మైండెడ్ వ్యక్తులతో పోటీ చేయిస్తారు అని అంటున్నారు వైసీపీ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఈ విషయంలో సీరియస్ గానే ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. బలమైన సామాజిక వర్గం ఆకాంక్షలు ఈ ఫ్రంట్ వెనక ఉన్నాయని చెబుతున్నారు.

**ఎవరికి చేటు :** కొత్త పార్టీలు పుట్టుకుని వస్తే ఎవరికి చేటు ఎవరికి ప్లస్ అన్నది చర్చగా ఉంది. నిజానికి చూస్తే అధికార పక్షం మీద సహజంగా ఎంతో కొంత వ్యతిరేకత ఉంటుంది. విపక్ష పార్టీలు ఆ ఓట్లను అందుకోవాలని చూస్తాయి. ఒకటికి మించి పార్టీలు అపొజిషన్ లో ఉంటే కనుక ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలి పోయి విపక్షం నష్టపోతుందని అదే సమయంలో అధికార పార్టీకే మేలు జరుగుతుంది అన్నది ఒక రాజకీయ విశ్లేషణ. మరో వైపు చూస్తే ఆయా పార్టీలు పెట్టిన వ్యక్తులు వారి నేపథ్యాలు సామాజిక పరిస్థితులు ప్రాంతీయ పరిణామాలు ఇవన్నీ కూడా పరిగణనలోకి తీసుకుంటే ఎవరికి చేటు అన్నది స్పష్టం అవుతుందని కూడా చెబుతున్నారు. ఏది ఏమైనా కొత్త పార్టీలు అయితే 2029 కి ఇపుడు అనుకుంటున్న వాటితో పాటుగా మరిన్ని వచ్చే అవకాశాలు అయితే కచ్చితంగా ఉన్నాయని అంటున్నారు.

## కళాక్షేత్ర వ్యవస్థాపకుడు... తొలితరం సినిమా నటుడు : జనవరి 20... బందా కనక లింగేశ్వరరావు జయంతి

తెలుగు సినిమాల్లో మొట్టమొదటి కృష్ణ పాత్రధారి రఘురామయ్య (పృధ్వీపుత్ర: 1933 కుచేల: 1935). అయితే రెండో కృష్ణుడు బందా కనక లింగేశ్వరరావు (ద్రౌపదీ మానసంరక్షణం: 1936). నాటి నటులకు ముఖ్యమైన అర్హత చక్కని కంఠంతోపాటు పాట, పద్యం పాడడం. బందా రంగస్థలం మీద ఎన్నో పాత్రలు ధరించి పేరు తెచ్చుకొన్నా- 'కృష్ణ పాత్ర ఆయన అభిమాన పాత్ర' అని చెప్పుకొనే వారు. 'చిత్ర నళీయం' నాటకంలో బాహుకుడి పాత్రను అద్భుతంగా నటించేవారని పేరు. పలు రసాల రాగాల్లో పద్యాలు చదివేవారు. బందావారు ధరించిన పాత్రల్లో ముఖ్యంగా చెప్పుకునేవిగా శ్రీక్రష్ణుడు, కాళిదాసు, బిల్వ మంగళుడు, సారంగ ధరుడు, శ్రీరాముడు, కర్ణుడు, నలుడు, బాహుకుడు, ప్రతాప రుద్రుడు, 'కన్యాశుల్కం'లో గిరీశం, సలీమ్?, అల్లూరి సీతా రామరాజు, చంద్రగుప్తుడు, విజయ రామరాజు (బొబ్బిలి యుద్ధం) పానుగంటి వారి 'కంఠాభరణం'లో పిచ్చి రామశాస్త్రి, పేరిగాడు మొదలటైనవి. రంగస్థల నటుల్లో వటైవిధ్యమైన ఇన్ని పాత్రలు ధరించిన వాళ్లు తక్కువ. ఎవరు ఏ పాత్రలో పేరు తెచ్చుకుంటే ఆ పాత్రనే ప్రేక్షకులు ఎక్కువగా కోరుకునేవారు. కాని, బందా విషయంలో వేరుగా వుండేది. ఏ నాటకం వేసినా కనకలింగేశ్వరరావు ఉంటే చాలు- మంచి నటన, పద్యాలూ వుంటాయని జనం విరగ బడేవారు. కురుపాం జమీందారు 'అభినవకృష్ణ' అన్న బిరుదును, జయంపురం మహారాజా 'నటశేఖర' బిరుదునూ బందాకు ప్రదానం చేశారు. తెలుగు టాకీ తొలి తరానికి చెందిన సినిమా నటుడు బందా కనక లింగేశ్వరరావు. సుప్రసిద్ధ రంగస్థల, సినిమా నటుడు, ఆకాశవాణి, నాటక ప్రయోక్త, నాట్యకళా పోషకుడు, కూచిపూడి కళాక్షేత్ర వ్యవస్థాపకుడు అయిన బందా కనకలింగేశ్వరరావు (జనవరి 20, 1907- డిసెంబరు 3, 1968 కృష్ణా జిల్లాలోని ఆటపాక గ్రామంలో జన్మించారు. ఆటపాకలో ప్రాథమిక విద్యాభ్యాసం, అనంతరం బందరు నోబుల్ కళాశాలలో చదివి, మద్రాసు లా కళాశాల నుండి 1932 లో బి.ఎల్. పట్టా పుచ్చుకున్నారు. 1934లో మొదట న్యాయవాదిగా పనిచేసి, తరువాతి కాలంలో తనకు సంతృప్తిని కలిగించే నాటక ప్రదర్శనమే వృత్తిగా చేసుకున్నారు. నాటకరంగంలో ప్రవేశించిన అనంతరం మొదట్లో కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. అయితే అందివచ్చిన ప్రతిఒక్క పాత్రలో ఒదిగిపోతూ తన ప్రతిభను నిరూపించుకుంటూ దూసుకెళ్లారు. దర్శకులు ఏ పాత్ర ఇచ్చినా కాదనకుండా అందులో పూర్తి లీనమైపోయి తన ప్రతిభతో ముగ్ధుల్ని చేసేవారు. నాటకాలలో తనకు అత్యంత ఇష్టమైన బాహుకుడు, బిల్వ మంగళుడుతో పాటు, అనేక పాత్రలు పోషించారు. అయన ఏలూరులో 1938లో నాటక కళాశాలను స్థాపించి పలువురు నటులకు శిక్షణ ఇచ్చారు. ప్రభాత్ థియేటర్ అనే సంస్థను స్థాపించి నాటక ప్రయోక్తగా నూతన ప్రదర్శన రీతులను ప్రవేశపెట్టారు. 1937, ఫిబ్రవరి 5 విడుదలటైన పి.పుల్లయ్య దర్శకత్వం వహించినతెలుగు చలనచిత్రంలో బందా... సారంగధరని పాత్ర పోషించారు. ఈ చిత్రంలో బందా కనకలింగేశ్వరరావు తో పాటు, అద్దంకి శ్రీరామమూర్తి, పులిపాటి వెంకటేశ్వర్లు, కొచ్చర్లకోట సత్యనారాయణ, శ్రీరంజని సీనియర్, కన్నాంబ, పి.శాంతకుమారి , బాలామణి తదితరులు నటించగా, ఆకుల నరసింహారావు సంగీతం అందించారు. తెలుగు సినిమా ప్రపంచంలో మొదటి తరం సినిమాలైనౌబాలనాగమ్మ (1942) లో కార్యవర్ధి రాజూ (బాలనాగమ్మ భర్త )గా, ద్రౌపదీ మాన సంరక్షణ (1936), పాదుకా పట్టభిషేకం (1945), సారంగధర 1937 తదితర సినిమాలలో నటించారు. కూచిపూడి నాట్యకళకు ఎనలేని సేవ చేశారు. ప్రభుత్వ సాయంతో కూచిపూడి గ్రామంలో సిద్ధేంద్ర కళాక్షేత్రం నెలకొల్పి నిర్వహించారు. కూచిపూడి నాట్య కళ గురించి ప్రముఖ పత్రికలలో వ్యాసాలు రాసి దాని ప్రాధాన్యాన్ని అందరికీ తెలియ జేశారు. 1956 లో ఆకాశవాణిలో నాటక ప్రయోక్తగా పనిచేసి వివిధ నాటకాలను, నాటికలను ప్రసారం చేశారు. నాయింట్లో కూడా ప్రవేశించినదే, గుక్కెడు నీళ్లు, పందిలి క్రింద, స్నేహ లతాదేవి తదితర కథలను భారతి, గృహలక్ష్మి, ప్రవాహ వాణి, విశాలాంధ్ర తదితర పత్రికలలో రాశారు. ఆటపాక గ్రామంలో ఒక శివాలయాన్ని, ఒక చెరువును తవ్వించడమే కాకుండా ఒక వేద పాఠశాలను కూడా స్థాపించారు. 1964లో కేంద్ర సంగీత నాటక



అకాడ?మీ పురస్కారం ఆయన 1964 లో "కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు"ను పొందారు. ఉత్తమ నటనకు "రాష్ట్రపతి అవార్డు" లభించింది. ఆయనకు ఏడుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన జన్మ శతాబ్ది ఉత్సవాలను హైదరాబాదులో 2006-07 సంవత్సరాలలో ఘనంగా నిర్వహించారు. బందా కనక లింగేశ్వరరావు 1968 డిసెంబర్ 3 న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## జనవరి 20,1957: భారతదేశపు అణు శక్తి యుగంలో తొలి అడుగు - అప్సర పేరుతో భారతదేశపు తొలి అణు రియాక్టర్ ప్రారంభం



1957 భారతదేశ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం పొందింది. ఆ ఏడాది, భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతి సాధిస్తూ, ప్రపంచ అణుశక్తి రంగంలో తన తొలి అడుగును పెట్టింది. ముంబై సమీపంలోని ట్రాంబేలో, అప్సర పేరుతో భారత దేశపు తొలి అణు రియాక్టర్‌ను ప్రారంభించడం ఈ ప్రయాణంలో అత్యంత కీలక ఘట్టంగా నిలిచింది. అప్సర రూపకల్పన, నిర్మాణంలో ప్రధానంగా భారత శాస్త్రవేత్తల కృషి ఉంది. అయితే, ఈ ప్రయత్నానికి బ్రిటన్ నుంచి కూడా సహకారం అందింది. ఇంధన సరఫరా: బ్రిటన్ నుండి అవసరమైన యురేనియం అందించ బడింది. సాంకేతిక సహాయం: కొన్ని మౌలిక సదుపాయాలకు మార్గదర్శకత అందించారు. అప్సరను ప్రధానంగా అణు శాస్త్రంలో పరిశోధన కోసం ఉపయోగించారు. ఇది భారత శాస్త్రవేత్తలకు న్యూట్రాన్ భౌతిక శాస్త్రం, రేడియేషన్ పై పరిశోధనలు చేయడానికి వేదికగా మారింది. మెడికల్ ఐసోటోప్స్ ఉత్పత్తి కోసం అప్సర ముఖ్యంగా ఉపయోగ పడింది. ఈ ఐసోటోప్స్ క్యాన్సర్ చికిత్స మరియు వైద్య పరీక్షలలో కీలక పాత్ర పోషించాయి. శాస్త్రవేత్తల శిక్షణ కోసం అప్సర ఒక జీవంత ప్రయోగశాలగా పనిచేసింది. అప్సర నిర్మాణం భారత శాస్త్రవేత్తల స్వదేశీ ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. భారత ప్రభుత్వం1954 జనవరి 3 న అణు పరిశోధన కోసం అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్ మెంట్, ట్రాంబే అనే సంస్థను స్థాపించింది. జహంగీర్ భాభా మరణించాక బాభా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ గా పేరు పెట్ట బడింది. డాక్టర్ హోమీ జహంగీర్ భాభా, భారత అణుశక్తి రంగ పితామహుడు, దీనిని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. 1957లో అప్పటి భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అప్సర పేరు పెట్టి, జాతికి అంకితం చేశారు. 1957లో అప్సర ప్రారంభం, భారతదేశాన్ని అణు శక్తి కలిగిన దేశాల జాబితాలో చేర్చింది. దీనిద్వారా, శాంతిమయ వినియోగాల కోసం అణుశక్తిని ఉపయోగించడానికి భారత దేశం ప్రామాణికంగా ఎదిగింది. భారతదేశం ఎప్పుడూ అణుశక్తిని శాంతి ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగిస్తామని ప్రపంచానికి స్పష్టం చేసింది. అప్సర దీనికి ప్రథమ ఉదాహరణ. 2009లో, అప్సర పాత రూపాన్ని నిలిపివేసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అప్సర-యూ పేరిట రియాక్టర్?ను పునర్నిర్మాణం చేశారు. అప్సర-యూ ప్రత్యేకతలు: ఇది మరింత శక్తివంతమైనది, తక్కువ ఇంధన వినియోగంతో ఎక్కువ ప్రయోజనాలను అందించగలదు. 1957లో మొదలైన ఈ ప్రయాణం, భారతదేశం పలు అణు రియాక్టర్ల నిర్మాణం వైపు దారితీసింది. ధ్రువ, కామిని, చంద్ర వంటి రియాక్టర్లు తదుపరి దశల్లో స్థాపించ బడ్డాయి. 1957లో అప్సర రియాక్టర్ ప్రారంభం, భారతదేశ శాస్త్రసాంకేతిక రంగ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టం. ఇది భారత దేశానికి అణు శక్తి స్వయం సమృద్ధి కల్పించి, ప్రపంచ స్థాయి పరిశోధనలో నడుపు పాత్ర పోషించేలా చేసింది. ఈ ప్రాజెక్ట్, శాస్త్రవేత్తల దీక్షకు, భారత అణు శక్తి ప్రయోగాల విజయం, సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## శాంతి కాముకుడు సరిహద్దు గాంధీ - జనవరి 20... భారత రత్న ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ వర్ధంతి



ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్.... ఈ పేరును ఈ తరానికి చెందిన చాలా మంది విని ఉండక పోవచ్చు. కాని సరిహద్దు గాంధీ అంటే కొంతమందికి అయినా గుర్తుకు రావచ్చు. పాకిస్థాన్‌లోని పంఖ్తూన్ రాష్ట్రంలో ఒక పఠాన్‌గా జన్మించి, జాతిపిత గాంధీ అహింసా మార్గంలో అడుగులు వేసి బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన స్వాతంత్ర్య సమరయోధుడు సరిహద్దు గాంధీ. ఆయుధం పట్టుకొని యుద్ధం చేసే పఠాన్ కన్నా అహింసా మార్గమే ఆయుధంగా ధరించిన పఠాన్ ప్రమాదకరమైన వ్యక్తి అని బ్రిటీష్ పాలకులతో అనిపించుకున్న గొప్ప ధీరుడు. 'నేను ఎట్టి పరిస్థితుల్లో అహింసామార్గాన్ని వీడను. పగ, ప్రతీకారం జోలికి వెళ్లను. నన్ను అణచివేసిన, హింసించిన వ్యక్తులను కూడా క్షమిస్తాను' అన్న ప్రతిజ్ఞతతో 'కుదాయ్ కిద్మత్ గర్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతికాముకుడు సరిహద్దు గాంధీ. బాద్షా ఖాన్ గా సరిహద్దు గాంధీ గా పేరుగాంచాడు. స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది. భారతరత్న పురస్కారమును పొందిన తొలి భారతీయేతరుడు. "ఎర్రచొక్కాల ఉద్యమం" ప్రారంభించిన ప్రముఖుడు. ఇతని అనుచరులను "ఖుదాయీ ఖిద్మత్‌గార్" (భగవత్సేవకులు) అని పిలిచేవారు. ఇతను పష్తో లేదా పక్తూనిస్తాన్ కు చెందిన రాజకీయ, ధార్మిక నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ భారతదేశంలో బ్రిటిష్ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన పష్టున్ స్వాతంత్ర్య కార్యకర్త. 'బచా ఖాన్' గా ప్రసిద్ధి చెందిన అతను మహాత్మా గాంధీకి చాలా సన్నిహితుడు మరియు మిత్రుడు, అయన భారతదేశంలో సరిహద్దు గాంధీగా, పాకిస్తాన్లో బచా ఖాన్ గా సుపరిచితులు. జనవరి 30, 1948 న మహాత్మా గాంధీ హత్యకు 40 సంవత్సరాల తరువాత అతను జనవరి 20, 1988 న మరణించాడు. ఇస్లాం యొక్క గొప్ప అహింసా సైనికుడు'. 'వేలాది అహింసా పఠాన్?ల విధేయతను పొందిన గొప్ప జాతీయవాద నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ 1890 ఫిబ్రవరి 6 న నాటి అవిభక్త భారత దేశంలోని, నేటి పాకిస్తాన్లో ఉన్న వాయువ్య సరిహద్దు నగరమైన ఉత్మాన్జైలో జన్మించాడు. 1910 లో, 20 సంవత్సరాల వయస్సులో, బెచే ఉట్మాన్జైలోని ఒక మసీదులో ఒక పాఠశాలను స్థాపించాడు. 1921 లో 'అంజుమాన్-ఇ ఇస్లా-ఇ అఫ్ఘనియా' (ఆఫ్ఘన్ రిఫార్మ్ సొసైటీ), మరియు 1927 లో యువ ఉద్యమమైన 'పాక్తున్ జిర్గా' స్థాపించాడు. మే 1928 లో, బచా ఖాన్ తీర్థయాత్ర నుండి మక్కాకు తిరిగి వచ్చిన తరువాత , అతను పాష్టో భాషలో నెలవారీ రాజకీయ పత్రిక 'పాక్తున్' (పాష్తున్) ను స్థాపించాడు. భారత స్వాతంత్ర్యం కోసం ఖాన్, ఐక్య, లౌకిక, స్వతంత్ర దేశం యొక్క లక్ష్యాన్ని సాధించగల ఏకైక స్థిరమైన మార్గం గాంధీ 'సత్యాగ్రహం' సూత్రాలను గట్టిగా అవలంబించడం ద్వారా మాత్రమే అని నిర్ధారణకు వచ్చాడు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది, అతను 1920 లలో 'ఖుదై ఖిద్మత్గర్' (దేవుని సేవకులు) ను స్థాపించాడు. 1928 లో ఖాన్ మొట్టమొదటి సారిగా మహాత్మా గాంధీని కలుసుకున్నాడు. భారత కాంగ్రెస్ పార్టీతో సంబంధం కలిగి ఉన్నాడు. అతి త్వరలో ఆయన గాంధీకి అత్యంత సన్నిహితుడు అయ్యాడు. వారు స్వతంత్ర, అవిభక్త, లౌకిక... హిందువులు, ముస్లింలు కలిసి శాంతితో జీవించే భారతదేశం గురించి కలలు కన్నారు. 1931 లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి వారించినా, "నేను ఒక సాధారణ సైనికుడిని మరియు ఖుదై ఖిద్మత్గర్, మరియు నేను మాత్రమే సేవ చేయాలనుకుంటున్నాను" అని చెప్పి గౌరవాన్ని తిరస్కరించారు. అతను చాలాకాలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాడు. భారత భూభాగంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాడుతుండగా, అప్పటి వాయువ్య సరిహద్దు ప్రావిన్స్ అని పిలువబడే ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్లో భాగమైన ఆ దేశంలోని వాయువ్య ప్రాంతంలో లక్ష మందిని తుపాకులు వాడమని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అహింసాత్మకంగా పోరాడటానికి ప్రతిజ్ఞ చేయమని ఒప్పించాడు. అతను ఈ సైన్యాన్ని అల్లాహ్ సేవకులు ఖుదై ఖిద్మత్గర్ అని పిలిచాడు. లక్ష మంది ముస్లింలు అతని "ఖుదై ఖిద్మత్గర్" లేదా "అల్లాహ్ యొక్క సర్వర్లు" ఉద్యమంలో చేరారు. మహాత్మా గాంధీ తత్వాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని ఖాన్ వారికి ఒప్పించాడు. బ్రిటీష్ పాలన ముగిసిన తరువాత భారతదేశాన్ని విభజించ కూడదని డిమాండ్ చేయడం ద్వారా, ఖాన్ ముస్లింలలో చాలా మంది శత్రువుగా మారాడు. తన ప్రజల హక్కుల కోసం నిరంతరం ఆయుధాలు ఎత్తకుండా నిరంతరం కష్టపడ్డాడు. గాంధీ మాదిరిగానే, గఫర్ ఖాన్ తన ప్రజల అభ్యున్నతి స్వాతంత్ర్య సాదనే అవసరమైన నిజాయితీగా నమ్మాడు. ఖాన్ ప్రావిన్స్లో పాఠశాలలను తెరిచాడు, మహిళలను సమాజంలో ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చాడు మరియు తన అహింసా సైనికులను రోజుకు కనీసం రెండు గంటల సామాజిక పని చేయమని ప్రతిజ్ఞ చేయమని ప్రోత్సహించాడు. భారత విభజనకు తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన భారత రాజకీయ నాయకులతో కలసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడు. భారతదేశ రాజకీయనాయకులతో మరీ ముఖ్యంగా గాంధీ నెహ్రూ, కాంగ్రెస్ పార్టీతో కలసి పోరాటం సలిపాడు. సరిహద్దు ప్రాంతపు ముస్లింలీడర్లు, ఇతను ముస్లింల ద్రోహి అని 1946 లో హత్యా ప్రయత్నం చేసారు. మొదటి నుంచి దేశ విభజనను వ్యతిరేకిస్తూ వచ్చిన ఖాన్? చివరకు నిర్ణయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకే వదిలేశారు. ఆ సమావేశం అత్యధిక మెజారిటీతో దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. ఆ సమావేశంలో గఫర్ ఖాన్‌తో పాటు మహాత్మాగాంధీ, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్‌లు పాల్గొనలేదు. 'మీకు అండగా నిలబడ్డాం. మీతో పాటు పఠాన్లు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. చివరకు మీరు మమ్మల్ని నక్కల పాలు చేశారు' అని సీడబ్ల్యూసీను ఉద్దేశించి ఖాన్? వ్యాఖ్యానించాడట. సరిహద్దు ప్రాంతవాసులకు ద్వేషి అయ్యాడు, అటు దేశ విభజన ఆగలేదు. అబ్దుల్ గఫార్ ఖాన్ పరిస్థితి అగమ్యగోచరమయ్యింది. బాద్షా ఖాన్, అనుయాయులు, భారత పాకిస్తాన్ లు తీవ్రంగా ద్రోహం చేశాయని భావించారు. కాంగ్రెస్ పార్టీని, భారత రాజకీయ నాయకులను ఉద్దేశించి బాద్షాహ్ ఖాన్ అన్న ఆఖరి మాటలు, "మీరు మమ్మల్ని తోడేళ్ళ ముందు విసిరేసారు" అల్లర్లు, హింసతో ఏమీ సాధించలేమని, శాంతి, సౌభ్రాతృత్వాలతో సంపాదించింది. శాశ్వతంగా మిగిలిపోతుందని పిలుపునిచ్చాడు. ఇటు బ్రిటీష్ ఇండియాలో, అటూ పాకిస్థాన్?లో 27 ఏళ్లపాటు జైలు జీవితాన్ని అనుభవించిన సరిహద్దు గాంధీ అఫ్గానిస్థాన్?లోని కాబూల్? నగరానికి వెళ్లి ప్రవాస జీవితం గడిపాడు. 1969లో మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గఫర్ ఖాన్ భారత్‌కు వచ్చారు. ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీకి వచ్చి అంతర్జాతీయ అవగాహన కింద ఇచ్చే 'జవహర్ లాల్ నెహ్రూ అవార్డు' అందుకున్నాడు. పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ 'మీరు బుద్ధుడిని మరచిపోయినట్లుగానే గాంధీని మరచిపోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. తుది శ్వాస విడిచేంత వరకు నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి జీవించిన గఫర్? ఖాన్? పాకిస్థాన్‌లోని పెషావర్‌లో 1988, జనవరి 20వ తేదీన ఆయన మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

చురకలు



# ఖరారు కాకముందే..తయారు..!

నల్గొండ: ఒకవైపు సంక్రాంతి పర్వదిన సంబరాలు.. మరోవైపు పట్టణాల్లో పుర ఎన్నికల కోసం నాయకుల హడావుడి జోరందుకున్నాయి. వారం రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశాలుండటంతో ఆశావహులు ఖద్దరు చొక్కాలతో, రంగుల కళ్లద్దాలతో ఇంటింటికి వెళ్లి ఇప్పటి నుంచే వార్డుల్లోని ఓటర్లను కలుసుకుని తనకే ఓటేయాలని అడుగుతున్నారు. రిజర్వేషన్లు మారితే తమ పార్టీలో ఏ అభ్యర్థి బరిలో ఉన్నా.. వారిని గెలిపించాలని అభ్యర్థిస్తుండటం గమనార్హం. ఎన్నికల సంఘం పుర, నగరపాలికల్లో ఓటరు తుది జాబితా ప్రకటించడంతో అందరి చూపు కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియ వైపు మళ్లింది. ప్రధాన పార్టీలు, స్వతంత్రులుగా పోటీ చేసే వారు రిజర్వేషన్ల ఖరారుపై ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

**కాంగ్రెస్ కసరత్తు..**

నల్గొండ తొలి మేయర్ పీఠంపై కాంగ్రెస్ కన్నేసింది. గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. డివిజన్ల వారీగా ప్రత్యర్థులకు గట్టిపోటీ ఇచ్చే అభ్యర్థులను ఎంపిక చేసేందుకు సర్వేలు పూర్తి చేశారు. సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, యాదాద్రిలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సైతం సామాజిక వర్గాల వారీగా ప్రాథమికంగా సర్వే చేసి జాబితా సిద్ధం చేశారు. డీసీసీ, పార్టీ సర్వే, నిఘా బృందాలు, పీసీసీ నుంచి వచ్చే ప్రతినిధులతో సమావేశమై అభ్యర్థులు తుది ఎంపిక జరుగనుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన, గతంలో పూర్తి చేసిన నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేస్తున్నారు.

**పదేళ్ల అభివృద్ధి పత్రాలతో భారాస..**

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేలు గత పదేళ్లలో చేసిన అభివృద్ధి కరపత్రాలను ముద్రించి ఇంటింటా పంపిణీ చేస్తున్నారు. డివిజన్, వార్డుబాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి నుంచే కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. పురపాలికల వారీగా ముఖ్య నాయకులు, శ్రేణులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేసి సిట్టింగ్ అభ్యర్థులతోపాటు రిజర్వేషన్ల వారీగా బలమైన అభ్యర్థుల జాబితాను సిద్ధం చేస్తున్నారు.

**ఒంటరి పోరుకు కమలనాథులు..**

నల్గొండ తొలి ఛైర్మన్ పదవి దక్కిందని.. అదే సెంటిమెంటుతో ఈ సారి మేయర్ పీఠం గెలుచుకుంటామని నల్గొండ భాజపా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ప్రతి సమావేశంలో ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట, భువనగిరి జిల్లాల పార్టీ అధ్యక్షులు చల్లా శ్రీలతారెడ్డి, ఊట్కూరి అశోక్ గౌడ్‌లు సైతం బలమైన అభ్యర్థుల కోసం సర్వేలు చేస్తున్నారు. ముఖ్య నాయకులతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపీ రఘునందన్‌రావు మూడు జిల్లాల్లో ఇటీవలే సమావేశాలు ఏర్పాటు చేయడంతో కమలనాథులు ఉత్సాహంగా ఉన్నారు. ఒంటరిగా పోటీ చేసే యోచనలో ఉన్న భాజపా తమ ఓటు బ్యాంకుతో గట్టెక్కేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తుంది.

**ఉనికి చాటుకునేందుకు వామపక్షాలు..**

తమకు పట్టున్న వార్డుల్లో అభ్యర్థులను నిలబెట్టేలా సీనియర్ నాయకులతో చర్చిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న రాజకీయ సమీకరణాలు అంచనా వేసి అభ్యర్థుల పేర్లను సేకరించి జనవరి 20లోగా తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు.

# చురుగ్గా ఎంఎంటీఎస్ పనులు

భువనగిరి : దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న ఎంఎంటీఎస్ కల ఎట్టకేలకు నెరవేరబోతోంది. సికింద్రాబాద్ – కాజీపేట మార్గంలో ఘట్కేసర్ నుంచి వంగపల్లి వరకు ఎంఎంటీఎస్ సేవలను పొడిగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 38.46 కిమీ పొడవునా కొత్త ట్రాక్ వేసే పనులకు ముందడుగు పడింది. యాదగిరిగుట్ట దివ్యక్షేత్రానికి వచ్చే భక్తులు, రోజు వారి వ్యాపార, వాణిజ్య అవసరాలు, విద్యార్థులు, ఉద్యోగులకు రైలు సౌకర్యం మెరుగుపడటంతోపాటు చౌకధరలో ప్రయాణించే అవకాశం కలుగుతుంది.

మారిన కొత్త అంచనాల ప్రకారం రూ.464 కోట్లతో ఘట్కేసర్ – వంగపల్లి రైల్వే స్టేషన్ వరకు విస్తరణ అభివృద్ధికి కేంద్రం పచ్చజెండా ఊపింది. ఇందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఫలితంగా 2025–26 కేంద్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించారు. దీంతో పనులు మూడు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఈ మార్గంలో రెండు ప్రధాన ట్రాక్‌లు ఉన్నాయి. విస్తరణలో భాగంగా కాజీపేట వైపు మార్గంలో అదనంగా మూడో మార్గం వేసే పనులు మొదలయ్యాయి. ఆర్‌వీఎన్‌ఎల్ సంస్థ ఈ పనులు చేపడుతోంది. బీబీనగర్ మండలం కొండమడుగు నుంచి వంగపల్లి వరకు రైల్వే శాఖ ఆధీనంలో ఉన్న స్థలంలో వంతెనలు, కల్వర్టులు, ట్రాక్ వేయడానికి భూమిని లెవలింగ్ పనులు కొనసాగుతున్నాయి. మొదటి ఫేజ్‌లో వంగపల్లి –రాయగిరి(యాదాద్రి)– భువనగిరి– పగిడిపల్లి రైల్వేస్టేషన్ వరకు 2026–27లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో పగిడిపల్లి–బీబీనగర్–ఘట్కేసర్ 2027–28 వరకు పూర్తి చేయాలని ప్రతిపాదించారు.

భూసేకరణ జరగాల్సి ఉంది. ఈ మేరకు రైల్వే అధికారులు కలెక్టర్‌కు పలు వివరాలు అందజేశారు. సర్వే పూర్తయితే పనులు ఇంకా వేగంగా జరిగే అవకాశం ఉంది.

# ఎక్కడ ప్రమాదం జరిగినా.. ఇట్టే తెలుస్తుంది!

భానుపురి : జాతీయ రహదారిపై ఇక నిఘా పెంచనున్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా..అతివేగంతో వాహనాలు నడిపినా క్షణాల్లో కంట్రోల్ రూంకు సమాచారం అందేలా ఎన్‌హెచ్ఏఐ దేశవ్యాప్తంగా ఈ వ్యవస్థకు ఏర్పాట్లు చేస్తోంది. తొలుత ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి 44వ జాతీయ రహదారిపై నిఘా కెమెరాలు, ఆర్చిలను ఏర్పాటు చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇక్కడ పూర్తయిన తర్వాత హైదరాబాద్–విజయవాడ సహా తెలంగాణలోని అన్ని జాతీయ రహదారులపై నిఘా నేత్రాలు ఏర్పాటు కానున్నాయి.

కి.మీ.కి కెమెరా: కిలోమీటరుకు ఒకటి చొప్పున కెమెరా ఏర్పాటు చేసి, చోదకుల సౌలభ్యం కోసం ఓవర్‌హెడ్ ఆర్చిలను నిర్మించి ఆయా గ్రామాలు, పట్టణాల పేర్లు, ఎంత దూరంలో ఉన్నాయనే వివరాలను ప్రదర్శించనున్నారు. ఆరేడు నెలల్లో ఈ వ్యవస్థ ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారులపై అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

నిర్వహణ ఇలా..: ఈ సీసీ కెమెరాల సహాయంతో కంట్రోల్ రూంలో నిరంతర నిఘా కొనసాగిస్తారు. ప్రతి టోల్‌ప్లాజా వద్ద ఒక రూం అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రమాదాలు జరిగితే క్షణాల్లో కంట్రోల్ రూంకు సమాచారం అందుతుంది. సుదూరంగా ప్రయాణించే చోదకులకు ఓవర్ హెడ్ ఆర్చిలు సౌకర్యంగా ఉంటాయి. వీటితో అత్యధిక ఎత్తు లోడ్‌తో వెళ్లే వాహనాలను నిలువరించవచ్చు. ఎక్కడైనా వాహనం ప్రమాదానికి గురైతే తక్షణమే నిఘా కెమెరాల ద్వారా తెలిసిపోతుంది. జాతీయ రహదారుల పెట్రోలింగ్, అంబులెన్స్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని సత్వర న్యాయం అందించేందుకు వీలవుతుందని సంబంధిత అధికారులు భావిస్తున్నారు.

# చెరువు.. స్వచ్ఛత బరువు!



పెద్దపల్లి : పెద్దపల్లి పట్టణవాసులకు ఆహ్లాదం అందించేందుకు ఏర్పాటు చేసిన మినీట్యాంక్‌బండ్ లక్ష్యం నీరుగారిపోతోంది. పట్టణంలోని గుండమ్మ, ఎల్లమ్మ చెరువులను అభివృద్ధి చేసి పలు రకాల సౌకర్యాలు కల్పించారు. పురపాలిక అధికారులు పట్టించుకోకపోవటం, సందర్శకుల బాధ్యతారహిత చర్యలతో వాటి పరిసరాలు దుర్గంధంగా మారాయి. గుర్రపుడెక్క, వ్యర్థాలు చెరువుల్లో పేరుకుపోయాయి. స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించే సమయంలో మినహా మినీట్యాంక్‌బండ్ నిర్వహణ బాగోగులు పట్టించుకోవటం లేదు.

**మొక్కుబడిగా బోటింగ్ సౌకర్యం**

చెరువులో గుర్రపుడెక్క విపరీతంగా పెరగటంతో బోటు తిరగటానికి అవకాశం లేకుండా పోయింది. మున్సిపల్ అధికారులు కూడా కేవలం బోటు తిరిగేందుకు అనువుగా ఉండాలని ఎల్లమ్మ చెరువులో కొంత భాగమే ఆకులు, తీగలు తొలగించటంతో పరిమిత మార్గంలోనే మర బోటు సౌకర్యం కల్పించారు. గుండమ్మ చెరువు వరకు బోటింగ్ పొడిగించటంలో వైఫల్యం కనిపిస్తోంది. పైడల్ బోటు తిరిగే పరిస్థితి లేకపోవడంతో మూలన పడేశారు.

**తీర్మానంలోనే డంపింగ్ పిట్**

గణేష్ విగ్రహాలు, బతుకమ్మలు నిమజ్జనం చేసిన తర్వాత వాటిని తొలగించటం ఏటా పురపాలికకు శ్రమతో కూడినపనవుతోంది. దీంతో చెరువులోనే నిర్దేశిత ప్రాంతంలో డంపింగ్ పిట్ నిర్మించాలని ఆరేళ్ల క్రితం పాలకమండలి తీర్మానం చేసింది. కార్యరూపం దాల్చకపోవడంతో చెరువులోనే నిమజ్జనం చేస్తున్నారు. దీనికితోడు పట్టణ ప్రజలు సైతం పూజసామగ్రి వ్యర్థాలను చెరువులో వేస్తుండటంతో సమస్య పెరుగుతోంది. ఓపెన్ జిమ్ పరికరాలు, పిల్లల ఆట వస్తువుల మరమ్మతులకు ప్రతిపాదనలు చేశామని కమిషనర్ వెంకటేష్ తెలిపారు. చెరువులో వ్యర్థాలు వేయకుండా కట్టపై జాలితో భారీ పరిమాణంలో చెత్త డబ్బా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**కరవైన పచ్చదనం**

చెరువు కట్టపై ఏర్పాటు చేసిన పచ్చగడ్డి నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో అందవిహీనంగా మారింది.

నీరు పట్టకపోవటంతో ఎక్కువశాతం మొక్కలు ఎండిపోయాయి.

పాదచారులు రోడ్డుపై కాకుండా.. గడ్డిపై వాకింగ్ చేయటంతో పిల్లలు ఆడుకునే కార్పెట్‌గ్రాస్ పూర్తిగా ఎండిపోయింది.

పిల్లల పార్కులో నిర్మాణాలు, ఓపెన్ జిమ్ పరికరాలు చెడిపోయాయి.

# గంగారాం తండా.. ఉద్యోగుల అడ్డా



కొడిమ్యాల : కొడిమ్యాల మండలంలో పూర్తిగా అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న గ్రామం గంగారాం తండా.. స్థానిక గిరిజనులు వ్యవసాయాన్ని, అడవిని నమ్ముకొని కుటుంబాలను పోషించేవారు.. అనంతర కాలంలో చదువుతోనే జీవితాలు బాగుపడతాయని నమ్మి పిల్లలకు ఉన్నత విద్య ఇప్పించారు.. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామం నుంచి చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.. వారి స్ఫూర్తితో మరికొందరు కొలువుల కోసం సన్నద్ధమవుతున్నారు.. గంగారాం తండా గ్రామ జనాభా 780. గతంలో సాగునీటి వసతి అంతంతే. దీంతో ఊరి నుంచి చాలా మంది ఏళ్ల పాటు గల్ఫ్ బాట పట్టారు. ఆ తర్వాత యువతలో మార్పు వచ్చింది. చదువులో రాణిస్తూ ఉద్యోగాలు సాధిస్తూ వచ్చారు. ఇప్పటివరకు దాదాపు 28 మంది ప్రభుత్వ, ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగాలు సాధించారు. ఇందులో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఆరుగురు, పోలీసు శాఖలో అయిదుగురు, బీఎస్ఎఫ్‌లో ఒకరు, విద్యుత్తు శాఖ లైన్‌మెన్‌గా ముగ్గురు, జూనియర్ లైన్‌మెన్‌గా ఒకరు, జూనియర్ అసిస్టెంట్లుగా ఇద్దరు, పోస్టుమెన్‌గా ఇద్దరు, అబ్కారీ శాఖలో ఒకరు, కోర్టులో సబార్డినేట్‌గా ఒకరు, అంగన్‌వాడీ ఉపాధ్యాయిని, ఆయాలుగా ఇద్దరు, అటవీ శాఖ బేస్‌క్యాంపులో ఇద్దరు, ఉపాధిహామీ క్షేత్ర సహాయకులుగా ఒకరు చొప్పున ఉన్నారు. ప్రస్తుతం దాదాపు 20 మంది ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నారు. మొత్తం 60 మంది పట్టభద్రులుండగా, మరో 12 మంది బీటెక్ చదువుతున్నారు.

**నాలుగు కొలువులు సాధించా ..**

అమ్మానాన్న చిన్నతనంలోనే చనిపోవడంతోనే చిన్న చిన్న పనులు చేస్తూ చదువుకున్నా. వాలీబాల్‌లో జాతీయ స్థాయిలో రాణించాను. 2008లో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. అనంతరం ఎంఏ హిందీ, ఎంఏ పొలిటికల్ సైన్స్, బీఈడీ పూర్తి చేశాను. 2012లో ఎస్జీటీగా ఎంపికై తిర్మలాపూర్‌లో పని చేశాను. 2013లో టీజీటీ ఉద్యోగం సాధించి గంగాధర ఆదర్శ పాఠశాలలో చేరా. 2017లో స్కూల్ అసిస్టెంట్‌కు ఎంపికైనా ఉద్యోగంలో చేరలేదు. ప్రస్తుతం మానకొండూర్ మండలం పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో పని చేస్తున్నా.

లావుడ్య జైల్‌సింగ్

**ఊరిలో మొదటి ఉపాధ్యాయుడిని..**

2000 సంవత్సరంలో గ్రామం నుంచి మొదటి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించా. 2010లో పీడీ(వ్యాయామ ఉపాధ్యాయుడి)గా పదోన్నతి పొంది రామగుండంలో పని చేశా. 2014లో నేను చదువుకున్న కొడిమ్యాల ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చా. ప్రస్తుతం ఎల్ఎండీ కాలనీలో పని చేస్తున్నాను.

లావుడ్య బన్సీలాల్

# వంద పడకలు.. అత్యవసర వైద్యం అందదు!



చొప్పదండి : గ్రామీణులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో నియోజకవర్గ కేంద్రమైన చొప్పదండికి రెండేళ్ల కిందట వంద పడకల ఆసుపత్రి మంజూరైంది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందుకు రూ.35.70 కోట్లు మంజూరుకావడంతో భవన నిర్మాణ పనులు చకచకా పూర్తి చేశారు. ఆ పనులు పూర్తయినప్పటికీ ప్రారంభానికి ఆలస్యం అవుతోంది. దీంతో ప్రస్తుతం చొప్పదండిలోని 30 పడకల సామాజిక ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం అందుతుండగా అత్యవసర వైద్యం కోసం కరీంనగర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**సిబ్బందిని నియమిస్తేనే..**

మూడున్నర ఎకరాల విస్తీర్ణంతో 120 గదులతోపాటు ఆపరేషన్ థియేటర్, క్యాజువాలిటీ వార్డు, ఎక్స్‌రే, స్కానింగ్ తదితర గదులు నిర్మించారు. దీంతోపాటు చుట్టూ ప్రహరీ పూర్తయింది. ఆసుపత్రికి కావాల్సిన కొన్ని పరికరాలు ఇప్పటికే సమకూరగా మరికొన్ని రావాల్సి ఉంది. ప్రాథమిక వైద్యంతోపాటు జనరల్ ఫిజీషియన్, సర్జన్, గైనకాలజిస్టు, రేడియాలజిస్టు, అనస్తీషియా, ఆర్థో, పీడియాట్రిక్, కంటి, దంత, ట్రామా తదితర వైద్య సేవల నిమిత్తం వైద్యులతోపాటు ఇతర సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఐసీయూ, సెంట్రల్ ఆక్సిజన్, ఇతర ఖరీదైన పరీక్షలకు సంబంధిత పరికరాలు అందుబాటులోకి తెస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయి. పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకం జరిగితే కార్పొరేట్ స్థాయిలో ఈ ప్రాంతవాసులకు అధునాతన వైద్య సేవలు అందే అవకాశం ఉంది.

**ప్రతిపాదనలు పంపించాం** ఆసుపత్రిలో సిబ్బంది నియామకానికి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. కొన్ని పరికరాలు రావాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. తొందర్లో సిబ్బందిని నియమించే ప్రక్రియ పూర్తవుతుంది. సిబ్బంది నియామకం అయిన వెంటనే ఆసుపత్రిని ప్రారంభించే అవకాశాలున్నాయి. డాక్టర్ కృష్ణప్రసాద్, ఆసుపత్రి పర్యవేక్షకులు

# బల్దియాలో విలీనం..

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ మున్సిపాలిటీలో చుట్టుపక్కల గ్రామ పంచాయతీలు బల్దియాలో విలీనమై ఏడేళ్లు గడిచాయి. అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపులో పాత 36 వార్డులతో విలీన కాలనీలు పోటీపడలేకపోయాయి. కొన్ని వార్డుల్లో అధ్వాన పరిస్థితులు మారుమూల గ్రామాలను తలపిస్తున్నాయి. కేఆర్కే కాలనీకి, 170 కాలనీకి వెళ్లే ప్రధాన రహదారుల నిర్మాణం మినహా ఇతరత్రా సదుపాయాలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. ఏడేళ్లుగా విలీన కాలనీల్లో సమస్యల పరిష్కారానికి అరకొరగానే నిధులు కేటాయించడంతో పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు. బల్దియా ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో విలీన కాలనీల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



**సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవు**

మావల, బట్టిసావర్గాం గ్రామాలు మినహా వాటి పరిధిలోని కాలనీలు, అనుకుంట, బంగారుగూడ, బెల్లూరి, రాంపూర్ గ్రామాలు పూర్తిగా బల్దియాలో విలీనమయ్యాయి.

అంతకుముందు ఆయా పంచాయతీలకు ఏటా ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించుకునేందుకు అవకాశం ఉండేది. బల్దియాలో విలీనమయ్యాక ఉపాధిహామీ పథకం దూరమైంది. గుంతలమయమైన దారులు, మురుగునీరు రోడ్లపైనే ప్రవహించడం పరిపాటిగా మారింది.

కాలనీలివే..బంగారుగూడ, అనుకుంట, కేఆర్కే కాలనీ, 170 కాలనీ, పిట్టలవాడ, శ్రీనగర్, పద్మావతీనగర్, అగ్రజా టౌన్‌షిప్, సుభాష్‌నగర్, టీచర్స్ కాలనీ, సాయినగర్, ఉద్యోగుల కాలనీ, దుర్గానగర్, అంబికానగర్, మణిపూర్ కాలనీ, శంకర్‌గుట్ట, టైలర్స్ కాలనీ, పోలీస్ కాలనీ, గ్రీన్‌సిటీ, ఆదర్శనగర్, భగత్‌సింగ్‌నగర్..

జనాభా : 70 వేలు

ఓటర్లు : 40 వేలు

వర్షాకాలమైతే మట్టిరోడ్లు బురదమయమై జనం జారిపడ్డ ఘటనలున్నాయి. బల్దియా బడ్జెట్‌లో మూడింట ఒకవంతు విలీన కాలనీల అభివృద్ధికి కేటాయించాల్సి ఉండగా అరకొర నిధులతోనే సరిపెడుతున్నారు. గతంలో పట్టణ ప్రగతి కింద పలు అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచినా నిధులు రావడం లేదని గుత్తేదారులు ప్రారంభించకపోవడంతో ఆ టెండర్లన్నీ రద్దయ్యాయి. కల్వర్టుల నిర్మాణం, మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం, ఇంటింటా చెత్త సేకరణ ఇతరత్రా సేవలు అందించడంలో బల్దియా యంత్రాంగంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# పదవీకాలం ముగిసే.. పనులు ఆగే

మంచిర్యాల: మంచిర్యాల జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం ముగిసిపోవడంతో వారి పాలనలో నిధులు కేటాయించిన అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఆయా గ్రామాల్లో ప్రజలు రహదారులు, మురుగుకాలువలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2019 నుంచి 2024 వరకు జిల్లా పరిషత్‌లో వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా అభివృద్ధి పనులు చేయడానికి రూ.13.66 కోట్లతో 393 పనులకు నిధులు కేటాయించారు. అప్పుడు 323 పనులు పూర్తి చేశారు. దాదాపు రూ.2.63 కోట్లతో చేయాల్సిన 70 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 2024 జులై 4న జిల్లా పరిషత్ సభ్యుల పదవీ కాలం ముగిసింది. తర్వాత జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా, కలెక్టర్ కుమార్ దీపక్ బాధ్యతలు చేపట్టారు. ఆగిన పనులను పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ప్రశ్నార్థకంగా మారాయి. భీమిని మండలంలో ఎస్సీ కాలనీ నుంచి వెంకటపూర్ వరకు రహదారి పక్కన కాలువ నిర్మించడానికి గతంలో రూ.5 లక్షలు కేటాయించారు. ఇప్పటికీ అక్కడ కాలువ నిర్మించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. తాండూరు మండలం సుభద్ర కాలనీలో నివాసగృహాల ముందు కాలువలు లేక ఇళ్ల ముందు మురుగు నిలిచి దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో అక్కడ కాలువ నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికీ అక్కడ కాలువ నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కోటపల్లిలో నివాసగృహాల మధ్యలో సీసీ రహదారి నిర్మాణం కోసం గతంలో రూ.5 లక్షలు కేటాయించారు. ఇంకా అక్కడ సిమెంట్ రహదారి నిర్మించడం లేదు. అక్కడ మట్టి రోడ్డు పైనుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

# మాంజా.. గుట్టుగా పంజా!

ఆదిలాబాద్ : పర్యావరణంతోపాటు పశుపక్ష్యాదులు, మనుషుల ప్రాణాలకు హాని కలిగించే చైనా మాంజాను ప్రభుత్వం నిషేధించినా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.. కొందరు వ్యాపారులు స్వలాభం కోసం గుట్టుగా తరలించి రహస్యంగా విక్రయిస్తున్నట్లు సమాచారం.. గత పక్షం రోజుల్లో ఆదిలాబాద్ పట్టణంలోనే ఇద్దరు యువకులు చైనా మాంజా దారంతో గొంతు కోసుకుపోయి ప్రాణాపాయం బారిన పడ్డ ఘటనలు చోటుచేసుకున్నాయి. తనిఖీలు చేస్తున్నా వ్యాపారులు ఎక్కడి నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారో పోలీసులకే అంతుచిక్కడం లేదు. **రిమ్స్ ఉద్యోగికి..**

రిమ్స్‌లో ఉద్యోగిగా పనిచేస్తూ సంజయ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న పిప్పరి సంతోష్ దస్నాపూర్ సమీపంలోని పెట్రోలు బంకు వద్ద నుంచి రోడ్డుపై ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. మాంజా మెడకు తగిలి తీవ్ర గాయమైంది. రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. సింథటిక్ నైలాన్ దారానికి గాజు పొడి, మెటల్ పౌడర్, జిగురు ఇతర రసాయనాలు కలిపి తయారు చేయటంతో అది కత్తి కంటే పదునుగా మారి శరీరానికి ఏ మాత్రం రాసుకుపోయినా ఆ భాగం పూర్తిగా కోసుకుపోతుంది. చైనా మాంజా దారంతో గాలి పటాలు ఎగరేసేటప్పుడు అవి తెగి చెట్లపై, విద్యుత్తు తీగలపై పడి ఇరుక్కుంటాయి. వాటినలాగే వదిలేస్తారు. ఆ గాలి పటాలకు వేలాడే చైనా మాంజా దారం ద్విచక్రవాహనదారులకు తగిలి ప్రాణాపాయం ఏర్పడుతోంది. నిర్లిప్తతలో అటవీ శాఖచైనా మాంజాను విక్రయించే వారిపై పోలీసులు మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు. అటవీ శాఖ సైతం తనిఖీలు చేసి విక్రయాలను కట్టడి చేయాల్సి ఉన్నా.. నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పోలీసులు ఈ ఏడాది పది కేసులు నమోదు చేయగా, అటవీ శాఖ మాత్రం కేవలం ఒక కేసు మాత్రమే నమోదు చేసి చేతులు దులుపుకొంది. విక్రయిస్తే కఠిన చర్యలు నిషేధిత చైనా మాంజాను విక్రయించటం నేరం.. పర్యావరణానికి హాని కలగడంతోపాటు మనుషులు, పశు పక్ష్యాదుల ప్రాణాలకు ముప్పు ఉంది. ఇప్పటికే ఒక వ్యాపారిపై రెండు కేసులు నమోదు చేసి జైలుకు పంపించాం.

చురకలు



# 'యాప్'రే.. దోమలు పరారే

హైదరాబాద్: ఆధునిక సాంకేతికతతో జీహెచ్ఎంసీ దోమల సమస్యకు సరికొత్త పరిష్కారం కనుగొంది. ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించి.. జియో ఫెన్సింగ్, జీపీఎస్‌తో సత్ఫలితాలు సాధించింది. యాప్ ద్వారా దోమల నియంత్రణకు తీసుకున్న చర్యల వల్ల 2024తో పోలిస్తే 2025లో డెంగీ కేసులు 30 శాతం తగ్గాయి. కోటి జనాభా గల నగరంలో ఈ ఘనత సాధించడంపై బల్దియాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కొవిడ్ వంటి విపత్తులను ముందే గుర్తించేందుకు కేంద్రం అన్ని నగరాల్లో 'మెట్రోపాలిటన్ సర్వే లెన్స్ యూనిట్ (ఎంఎస్‌యూ)'లను ఏర్పాటు చేస్తోంది. దీనిపై ఇటీవల నాగ్‌పూర్‌లో జాతీయ సదస్సు జరిగింది. ఆధునిక సాంకేతికతతో కీటక జనిత వ్యాధుల కట్టడికి తీసుకున్న చర్యలు స్ఫూర్తిదాయకమంటూ సదస్సులో బల్దియా కమిషనర్ ఆర్వీ.కర్ణన్‌ను ఎంఎస్‌యూ యంత్రాంగం ప్రత్యేకంగా అభినందించింది.

**సీజన్ ఇదే..**

సహజంగా దోమలు వర్షాకాలం మొదలైనప్పట్నుంచి విజృంభిస్తాయి. చలికాలంలో సమస్య కొంత తగ్గుతుంది. జనవరి నుంచి వేసవి వరకు స్వైర విహారం చేస్తాయి. డెంగీని గుర్తించకపోతే ప్రాణాలు పోవచ్చు. జీహెచ్ఎంసీ పరిధిలో ఏటా 3 వేల వరకు కేసులు నమోదవుతాయి.



2025లో సంఖ్య 2 వేలకు దిగువనే నిలిచిపోయింది.

**నిఘా.. అమలు ఇలా..** కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నాక దోమల నియంత్రణ విభాగాన్ని కమిషనర్ ఆర్వీ.కర్ణన్ పునర్ వ్యవస్థీకరించారు. చీఫ్ ఎంటమాలజిస్టు లేకపోయినా అరకొర సీనియర్ ఎంటమాలజిస్టులు, సహాయ వైద్యాధికారులతో సత్ఫలితాలు సాధించారు. సహాయ వైద్యాధికారులను పారిశుద్ధ్య బాధ్యతల నుంచి తప్పించారు. ఆస్పత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాల్లో నమోదయ్యే డెంగీ కేసులను సర్కిళ్ల వారీగా మొబైల్‌యాప్‌లో నమోదు చేయగానే ఆ వివరాల ఆధారంగా సహాయ వైద్యాధికారులు డెంగీ బాధితుల ఇళ్లను తనిఖీ చేసి ఆ ఇంటితోపాటు చుట్టూ వంద ఇళ్లల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలి. ఆ వివరాలను ఫొటోలు, వీడియోలతో యాప్‌లో అక్కడికక్కడే నమోదు చేయాలి. 'ఇలాంటి నియంత్రణ చర్యలు ఎక్కువ ఫలితాన్ని ఇచ్చాయి. కేసులు ఎక్కువ నమోదైన ప్రాంతాలను హైరిస్క్ జోన్లుగా గుర్తించాం. 24 గంటల్లెనే ఫాగింగ్, ఇళ్లలోని నీటి నిల్వలను తొలగించి దోమల మందు ను పిచికారీ చేయడం చర్యలు చేపట్టా కమిషనర్ తెలిపారు.

# ఇప్పటికే లోటు.. విస్తరణతో మరింత భారం

హైదరాబాద్: హైదరాబాద్ మహానగర విస్తరణ జలమండలికి కొత్తగా ఆర్థిక కష్టాలు తెచ్చిపెడుతోంది. ఇప్పటికే ప్రతి నెలా రూ.130కోట్ల లోటుతో నడుస్తున్న జలమండలికి కొత్త ప్రాంతాల చేరిక ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటి వరకు జలమండలి పరిధి అధికారికంగా 1450 చదరపు కిలోమీటర్లు. తాజా విస్తరణతో 2080 చదరపు కిలోమీటర్లు కానుంది. ఓఆర్ఆర్ వెలుపల ఉన్న ప్రాంతాలు కూడా బృహత్ హైదరాబాద్‌లో భాగమయ్యాయి. దీంతో అన్ని ప్రాంతాల్లో తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను ఏర్పాటుచేసేందుకు జలమండలికి భారీగా నిధులు అవసరం కానున్నాయి. ప్రభుత్వ పరంగా ప్రత్యేక తోడ్పాటు అందిస్తే తప్ప ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

మురుగునీరు మూసీలో, చెరువుల్లో కలవకుండా.. శుద్ధికేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది. దీనికి భారీగా నిధులు అవసరం.

జలమండలి ప్రతినెలా రూ.130 కోట్ల లోటుతో నడుస్తోంది. జలమండలికి వస్తున్న రాబడి వేతనాలు, నిర్వహణకే సరిపోతోంది. కొత్తగా విలీనమవుతున్న ప్రాంతాల్లో పటిష్ఠమైన తాగునీరు, మురుగునీటి వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వమే ప్రత్యేకంగా నిధులు అందించాలి. పరిధి పెరగనుండటంతో నీటి డిమాండ్ పెరుగుతుంది. గోదావరి జలాలు అందుబాటులోకి వచ్చే వరకు ప్రస్తుతం సరఫరా అవుతున్న 550 ఎంజీడీల నీరు సర్దుబాటు తప్పదు.



విలీనమైన ప్రాంతాల్లో భారీ సంఖ్యలో కొత్త నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు పైపులైన్ల ఏర్పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. మిషన్ భగీరథ ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసేలా మిషన్ భగీరథ నెట్‌వర్క్‌ను జలమండలి నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయాల్సి ఉంటుంది.

విలీనమైన 20 మున్సిపాలిటీలు, ఏడు నగర పాలక సంస్థల్లో మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కొత్తగా సీవరేజీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి అమలు చేయాల్సి ఉంటుంది. అందుకు భారీగా నిధులు అవసరమవుతాయి.

నిర్వహణ పరిధి పెరగనుండటంతో క్షేత్రస్థాయి, పర్యవేక్షక సిబ్బందిని అదనంగా నియమించుకోవాల్సి ఉంటుంది.

# గాలి.. నేల.. విషతుల్యం



హైదరాబాద్: ఈ-వ్యర్థాలు నగరానికి శాపంగా మారుతున్నాయి. ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం ఎంత పెరుగుతుందో.. అదే స్థాయిలో వ్యర్థాలూ ఉంటున్నాయి. నిర్వహణ సరిగా లేక.. చాలా పరికరాలు సాధారణ చెత్తలో కలిసిపోయి డంపింగ్‌యార్డులోని విద్యుదుత్పత్తి కేంద్రంలో బూడిదవుతున్నాయనే విమర్శలున్నాయి. ఇటీవల డంపింగ్ యార్డులోని విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి సేకరించిన బూడిదలో సీసం, పలు ఇతర భార లోహాలను పీసీబీ గుర్తించడమే అందు కు నిదర్శనం. ఆ బూడిద నేలలో కలిస్తే భూమితోపాటు భూగర్భ జలాలు పాడవుతాయి. గాల్లో కలిస్తే ప్రాణవాయువు ప్రాణాంతకమవుతుంది.

**బల్దియా పిలుపునకు స్పందన కరవు..**

బల్దియా ఈ-వ్యర్థాల సేకరణ చేపట్టినా అవగాహన కల్పించక స్పందన రాలేదు. 3 రోజుల్లో 88 టన్నులే సేకరించగలిగింది.

**2017లో ఈ-వేస్ట్ విధానం..**

పెరుగుతోన్న ఈ-వ్యర్థాలను దృష్టిలో ఉంచుకుని.. గత సర్కారు 2017లో ఈ-వ్యర్థాల విధానాన్ని తీసుకొచ్చింది. దుండిగల్, పటాన్‌చెరు ప్రాంతాల్లో పలు ప్రైవేటు సంస్థలు నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయి. మొత్తం వ్యర్థాల్లో 75శాతం ఇళ్లలోని వస్తువులని అంచనా. విదేశాల్లో మాదిరి ఈ-వేస్ట్‌కు ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

**పెరుగుతోన్న వ్యర్థాలు..**

అంచనాల ప్రకారం.. 2009లో 3,500 టన్నులు ఉత్పత్తవగా, 2017లో 33,000 టన్నులు, 2022లో 51,000 టన్నులు ఉత్పత్తయ్యాయి. ఎక్కువ చెత్త ఉత్పత్తిలో నగరం దేశంలో ఏడో స్థానంలో ఉంది. **లేదంటే సమస్య తప్పదు..**

రీసైక్లింగ్ చేయకపోతే టీవీల్లో క్యాథోడ్ రే ట్యూబ్‌ల్లోని లెడ్, బేరియం, ఇతర భార లోహాలు, నీటిని విషంగా మార్చే సల్ఫర్ భూమిలో కలిసి నేలను, భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి.

ఫోన్లు, రిమోట్లు, కంప్యూటర్ల మదర్ బోర్డులు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, ఈ-చిప్స్‌లలోని బ్రోమిన్, బెరీలియం, కాడ్మియం, మెర్క్యూరీ వంటి భార లోహాలు భూమిలోకి చేరినా ప్రమాదమే. మండించినా వాటి నుంచి వచ్చే బూడిదలో భారలోహాలు అలాగే ఉండి నేలను, గాలిని విషతుల్యం చేస్తాయని నిపుణులంటున్నారు.

# ఎన్నికల 'మూడు' ఎప్పుడంటే





హైదరాబాద్: రాష్ట్రంలో పురపోరుకు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరిలో పురపాలక సంఘాలకు, నగర పాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. రాష్ట్రంలో మొత్తం 123 స్థానిక సంస్థల (పురాలు, నగరాలు) పరిధిలో ఓటర్ల జాబితాలను సర్కారు విడుదల చేసింది. దీనిలో గ్రేటర్ హైదరాబాద్ జాబితా లేదు. మున్సిపల్ ఎన్నికలతోపాటు గ్రేటర్ హైదరాబాద్‌కు ఎన్నికలు నిర్వహించడం లేదని తేటతెల్లమైంది. పురపోరు ముగిసిన తర్వాత జీహెచ్ఎంసీకి ప్రత్యేకంగా ఎన్నికలను నిర్వహించాలనుకుంటోంది.

**విలీనంపై అభ్యంతరాలు..**

శివారులోని 20 పురపాలక సంఘాలను, 7 నగరపాలక సంస్థలను బల్దియాలో విలీనం చేస్తూ ఇటీవల బృహత్ నగరాన్ని ఏర్పాటు చేయగా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. విలీనం చేయడం వల్ల తమకు ఎన్నికలు లేకుండా పోయాయని ఆయా పార్టీల నేతలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు పదవులు తగ్గిపోవడం, ప్రతి పనికి జీహెచ్ఎంసీకి వెళ్లాలంటే దూరాభారమంటున్నారు.

**మార్చి లేదా ఏప్రిల్..**

జీహెచ్ఎంసీని హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లుగా ఏర్పాటు చేయనున్నారు. అధికారులు ఈ ప్రక్రియపై కసరత్తు చేస్తున్నారు. అనంతరం వచ్చే మార్చి లేదా ఏప్రిల్ నెలలో మూడు కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.

**రాజకీయంగా..!**

జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతిపక్షానికే పట్టు ఉంది. 2020లో బల్దియా ఎన్నికల్లో 55 స్థానాలను భారాస, ఎంఐఎం 44 డివిజన్లు గెలుచుకున్నాయి. భాజపా 48 డివిజన్లు, కాంగ్రెస్ 2 మాత్రమే గెలుచుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పలువురు కార్పొరేటర్లు పార్టీలో చేరడంతో కాస్త బలం పెరిగింది. నగరంలో ఎమ్మెల్యేల విషయానికొస్తే భారాసకే బలమెక్కువ. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఆరు మున్సిపాలిటీలకు, మేడ్చల్‌లో మూడు మున్సిపాలిటీలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించనున్నారు.

# పిల్లలూ వెళ్లొద్దాం పల్లెలు



హైదరాబాద్: సంక్రాంతికి పట్నం పల్లెకేగింది. నిత్యం రణగొణ ధ్వనులు.. ఉరుకుల పరుగుల జీవితానికి విరామమిచ్చి గ్రామానికి పయనమైంది. కొందరు సొంతూళ్లకు.. పిల్లలకు పల్లెలను, తమ మూలాలను పరిచయం చేసేందుకు వెళ్లారు. పుట్టి, పెరిగిన ఊరు.. అక్కడి వాతావరణం.. బంధువులను పరిచయం చేయడంతో పాటు కొత్త విషయాలు నేర్చుకునేందుకు ఉపయోగపడతాయని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. మరికొందరు ప్రకృతి, పర్యాటక ప్రాంతాల్లో గడిపేందుకు కుటుంబాలతో వెళ్లారు.

**ఇలా చేస్తే... మానవ సంబంధాలు బలోపేతం**

అపార్ట్‌మెంట్‌లో పక్కపక్కనే ఫ్లాట్లలో ఏళ్ల నుంచి ఉంటున్నా ఎవరి బతుకు వారిదే. ఒకరికొకరు పలకరించుకోరు. పిల్లలూ అలాగే తయారవుతారు. పల్లెల్లో అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలతో వీడియో కాల్‌లో మాట్లాడటం తప్ప ఎక్కువ వెళ్లేది లేదు. ఈ నేపథ్యంలో పిల్లలకు మానవ సంబంధాలు గురించి తెలియజెప్పడం ముఖ్యమే. తమకు అందరూ ఉన్నారని తెలుస్తుంది. మానవ సంబంధాలు బలపడతాయి.

**కాసింత చేయూత...** నలుగురు అన్నదమ్ములుంటే ఒకరిద్దరూ ఉన్నతస్థాయిలో ఉంటారు. కొందరికి అవకాశాలు లేక మరికొందరికి వీలుకాక పల్లెకే పరిమితమవుతారు. ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతుంటారు. అన్నదమ్ములుగా ఆదుకోవాల్సిన బాధ్యత మీదే. వారికి చేయూతనందించాలి. అప్పుడే బంధుత్వాలు మరింత బలపడతాయి. పిల్లల్లో స్ఫూర్తి నింపుతుంది.

**ఊరికి ఉపకారం...**

చాలామంది నగరానికి వచ్చి ఊళ్లను మరచిపోతుంటారు. ఏదో చేయాలనే తపన ఉన్నా వీలు చిక్కదు. తాము చదువుకున్న బడి.. తిరిగిన బాట.. నీళ్లు తాగిన బావి.. శిథిలావస్థకు చేరుకొని సాయానికి చూస్తుంటాయి. వాటిని తిరిగి నిలబెట్టాల్సిన బాధ్యత మీదే. పిల్లలకు తెలిసేలా చేస్తే భవిష్యత్తులో వారూ మీ అడుగుజాడల్లో నడుస్తారు.

**ప్రకృతి.. పరిచయం**

నగరమంటే కాంక్రీట్ జంగిల్. పచ్చదనం కనిపించదు. అన్ని రోడ్లు రద్దీ.. ఇరుకు వీధుల్లో అంతా ఉక్కిరిబిక్కిరి. గ్రామాల్లో ప్రకృతి మధ్య కొన్ని రోజుల గడపటం పిల్లలకు, పెద్దలకు అవసరమే. అక్కడ పండే పంటలు.. రైతుల కష్టాలు.. కొండలు.. చెరువులు.. సెలయేర్లు.. పాడి.. ఇలా ప్రతీది పిల్లలకు వింతగా అనిపిస్తుంది. వారిలో సృజన, తపన, జిజ్ఞాస మరింత పెరుగుతుంది.

# ఆ కాలనీలు.. పల్లెల మధ్య పట్టణాలు

జగిత్యాల : జగిత్యాల పురపాలిక పరిధి అస్తవ్యస్తంగా మారింది. ఏది పంచాయతీనో, ఏది పురపాలికనో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకే మార్గంలో ఒకచోట పురపాలిక, ఆ వెంటనే పంచాయతీ, మళ్లీ పురపాలిక, తర్వాత పంచాయతీ.. ఇలా స్థానిక సంస్థల పరిధి మారడంతో గందరగోళం నెలకొంది. పట్టణానికి సమీపంలో ఉన్న టీఆర్‌నగర్ ప్రాంతం గతంలో పంచాయతీగా ఉండేది. గత మున్సిపల్ ఎన్నికలకు ముందు పురపాలికలో కలిపి 47, 48 వార్డులుగా విభజించి ఎన్నికలు నిర్వహించారు. జిల్లాకేంద్రం నుంచి టీఆర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో పద్మనాయక కల్యాణ మంటపం దాటిన తర్వాత ధరూర్ పంచాయతీ వస్తుంది. కొత్తవారెవరైనా ఇక్కడితో పట్టణ పరిధి ముగిసిందని భావిస్తారు. ధరూర్ కాలువ దాటగానే టీఆర్‌నగర్ వస్తుంది. ఇది మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామంగా చెప్పవచ్చు. ఇక్కడితో పట్టణం ముగియలేదు. టీఆర్‌నగర్ తర్వాత మల్యాల మండలం రాజారం పంచాయతీ వస్తుంది. దీని తర్వాత నూకపల్లి



పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన అర్బన్‌కాలనీ వస్తుంది.

ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో 4,250 రెండు పడక గదుల గృహాలు నిర్మించారు. అంతకుముందు జీవన్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఇందిరమ్మ పథకం కింద 4 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అందులో కొన్ని మాత్రమే పూర్తి కాగా కాలనీలో దాదాపు 5 వేల ఇళ్లు అందుబాటులోకి వచ్చాయి. 5 వేల ఇళ్లున్న కాలనీలో దాదాపు 20 వేల జనాభా నివసించాలి. కాగా ప్రస్తుతం ఉంటోంది 1,250 మంది మాత్రమే. ప్రస్తుత ఎన్నికల్లో ఇక్కడ ఉంటున్న వారిలో కొందరికి మాత్రమే స్థానికంగా ఓటుహక్కు ఉంది. కొత్తగా ఏర్పాటు చేసిన 49, 50 వార్డుల్లో అర్బన్‌కాలనీ వాసులను చేర్చి టీఆర్‌నగర్‌లో కలిపారు.

**వసతులు లేక గృహాలు ఖాళీ**

అర్బన్ కాలనీలో దాదాపు 20 వేల జనాభా నివసిస్తే ఓటర్ల సంఖ్య 15 వేలకు చేరే అవకాశం ఉంది. అంటే వార్డుకు 2 వేల చొప్పున కొత్తగా 7 వార్డులు ఏర్పాటు చేయొచ్చు. అర్బన్ కాలనీలో వసతులు లేక స్థానికంగా ఇళ్లు మంజూరైన వారిలో చాలా మంది పట్టణంలోనే ఉంటున్నారు. దీంతో ఓట్లు పట్టణంలో, నివాసాలు అర్బన్‌కాలనీలో అన్న విమర్శ నెలకొంది. వాస్తవానికి ఇక్కడ ఇళ్లున్న వారందరూ స్థానికంగా నివాసం ఉంటే 7 వార్డులు ఏర్పాటవుతాయి. తద్వారా పాలకులు వసతులు మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అర్బన్ కాలనీలో నివాసం ఉండాలని సూచిస్తున్నా లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని, అందుకే ఇక్కడి ఓటర్లను టీఆర్‌నగర్‌లో కలిపి రెండు వార్డులు కొత్తగా ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ స్పందన తెలిపారు. మొత్తానికి జగిత్యాల పట్టణ పరిధిలోని టీఆర్‌నగర్, అర్బన్‌కాలనీలు 'పట్టణంలో పల్లెలు.. పల్లెల్లో పట్టణం' అన్న మాదిరిగా మారాయి. అర్బన్ కాలనీని ప్రత్యేక వార్డుల కింద విభజిస్తేనే అభివృద్ధి సాధ్యమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# 'పది'కి సన్నద్ధం

రాజపేట : పదో తరగతి ఫలితాల్లో గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా యంత్రాంగం ఉపాధ్యాయ వర్గాలను అప్రమత్తం చేసింది. ఈ విషయమై జిల్లా పాలనాధికారి హనుమంతరావు, డీఈవో సత్యనారాయణ ఎంఈవోలతో నిర్వహించిన సమీక్షలో పలు విషయాలను సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగుతుంది. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు వార్షిక పరీక్షలకు ముందు ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహిస్తారు. ఈ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రీఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 17 నుంచి 24 వరకు జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ తాజాగా ప్రణాళిక విడుదల చేసింది. ఈ పరీక్షలతో విద్యార్థులు వార్షిక పరీక్షలకు మరింతగా ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావడానికి అవకాశం ఉంటుంది. ఫలితంగా ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించడానికి అధ్యయనం చేసేలా సమాయత్తం చేయవచ్చు. జిల్లాలో ఉన్నత పాఠశాలలు 147 ఉండగా పదోతరగతి విద్యార్థులు 3,600 మంది ఉన్నారు.

**ప్రగతిని సమీక్షిస్తూ ముందుకు**

ప్రీఫైనల్ పరీక్షలు పూర్తికాగానే సమాధాన పత్రాలను వెంటనే మూల్యాంకనం చేయించేలా చూడాలని ఎంఈవోలకు, ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందాయి. మూల్యాంకనం



తర్వాత విద్యార్థుల ప్రగతిని సమీక్షించాల్సి ఉంటుంది. ఈ సమీక్ష సమయంలో వందశాతం విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చూడాలి. వారి ప్రగతి ఆధారంగా వార్షిక పరీక్షల వరకు సన్నద్ధం చేసే చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

**ప్రీఫైనల్ పరీక్షల షెడ్యూల్ ఇలా..**

ఫిబ్రవరి 17న ప్రథమ భాష, 18న ద్వితీయ భాష, 19న తృతీయ భాష, 20న గణితం, 21న భౌతికశాస్త్రం, 23న జీవశాస్త్రం, 24న సాంఘికశాస్త్రం పరీక్షలు జరగనున్నాయి. భౌతిక, జీవశాస్త్ర పరీక్షలు ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు మిగతా పరీక్షలు 9.30 గంటల నుంచి 11 గంటల వరకు మిగతా పరీక్షలు 9.30 నుంచి 12.30 గంటల వరకు జరగనున్నాయి.

## అతివల చేతికి ఆహారశుద్ధి పరిశ్రమ

పెద్దపల్లి : చిన్నచిన్న వ్యాపారాలతో లాభాలు గడిస్తున్న మహిళా సహకార సంఘ సభ్యులు త్వరలో ఓ పరిశ్రమను నడిపించనున్నారు. అతివలు రైతులు పండించిన పంటలకు మార్కెట్ వసతి కల్పించి, ఆహార పదార్థాలు తయారీ చేసేలా అడుగులు పడుతున్నాయి. జిల్లాలోని ముత్తారంలో ప్రయోగాత్మకంగా మిర్చి పొడి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, నెప్టమ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మహిళలు సంఘంగా ఏర్పాటై మార్కెట్ నైపుణ్య మెలకువలపై శిక్షణ పొందారు. పరిశ్రమ నిర్వహణకు సంబంధించి యంత్రాలు ముత్తారానికి చేరుకొన్నాయి. త్వరలో వీటిని బిగించనున్నారు.

**సంఘాల సమావేశాల్లో అవగాహన**

మిర్చి పొడి, సాస్, చిల్లి ఫ్లేక్స్ తయారీపై బహిరంగ మార్కెట్‌లో కార్పొరేట్ కంపెనీలను తట్టుకునేలా నాణ్యత ప్రమాణాలు పాటించనున్నారు. జిల్లాలో సుమారు పది వేల సంఘాల్లో లక్ష పైనే సభ్యులు ఉన్నారు. ఆయా సంఘాల్లోని సమావేశాల్లో నూతన పరిశ్రమ మిర్చి ఉత్పత్తులపై అవగాహన కల్పించనున్నారు. ఉత్పత్తులు కొనుగోలు చేసేలా ప్రోత్సహించనున్నారు. ప్రతి సభ్యురాలు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవడంతో గిరాకీ పెరగనుంది. మహిళలకు లాభాలు రానున్నాయి.



**700 మందితో ఉత్పాదక సంఘం**

జిల్లాలో ముత్తారం మండలంలో మిర్చి పంట అధికంగా సాగవుతోంది. పంట సాగులో అత్యధికంగా మహిళలే కీలకంగా వ్యవహరిస్తారు. అయితే మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించటం ప్రశ్నార్థకమైంది. ఈ ప్రాంతంలో మార్కెట్ వసతి లేకపోవడంతో విక్రయానికి వరంగల్, హైదరాబాద్ వెళ్లి నష్టాలపాలవుతున్నారు. ఇక్కడ పండించిన మిర్చి పంట నుంచి పొడి తయారు చేస్తే లాభాలు రానున్నాయని మహిళలు ముందుకొచ్చారు. 700 మందితో మహిళా రైతు ఉత్పాదక సంఘం ఏర్పాటైంది. పరిశ్రమ ఏర్పాటుకు సభ్యులు రూ. 6 లక్షలు.. మరో రూ. 7 లక్షలు కలెక్టర్ కేటాయించారు. మిర్చి పౌడర్, సాస్, చిల్లి ఫ్లేక్స్ తదితర పదార్థాల తయారీపై మహిళలకు అధికారులు, సంస్థ వారు అవగాహన కల్పించారు. మార్కెట్ ఎలా చేయాలనే అంశాలపై మెలకువలు నేర్పించారు.

## మూడో విడత.. ముమ్మరం

ధర్మపురి : వీధి వ్యాపారులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా రుణాలను మంజూరు చేస్తున్నారు. మొదటి విడతలో రూ. 10 వేల రుణం అందించగా రెండో దశలో రూ. 20 వేలు, మూడో దశలో రూ. 50 వేల రుణం మంజూరవుతోంది. క్రమంగా రుణ పరిమితి పెరుగుతుండగా వ్యాపారులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. మూడో దశ రుణాల కేటాయింపు ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది.

జిల్లాలోని అయిదు పురపాలికల్లో 16,234 మంది వీధి వ్యాపారులు లబ్ధి పొందారు. కూరగాయలు, పళ్లు, పూలు విక్రయించేవారు, చిన్నపాటి దుకాణాలు నడిపేవారు, టీ కొట్టు నిర్వహించేవారు ఇలా అనేక మంది ఉపాధి అవకాశాలు విస్తరించుకున్నారు. దీని ద్వారా పట్టణ ప్రాంతంలో స్వయం ఉపాధి పెరిగింది. చిరు వ్యాపారుల పిల్లల విద్య, వైద్య ఖర్చులకు ఉపయోగించుకున్నారు. మహిళలు పెద్ద



సంఖ్యలో లబ్ధి పొందడంతో కుటుంబ ఆర్థిక స్థితి మెరుగవుతోంది. వీధి వ్యాపారులకు సామాజిక గౌరవం పెరిగింది.

**ధర్మపురికి అగ్రస్థానం**

చిరు వ్యాపారులకు రుణాల కేటాయింపు, ఆన్‌లైన్ ప్రక్రియలో ధర్మపురి పురపాలిక జిల్లాలో మొదటి స్థానంలో నిలుస్తోంది. ధర్మపురి పట్టణంలో 735 మంది వీధి వ్యాపారులకు మొదటి దశలో రూ. 73.50 లక్షలు, రెండో దశలో రూ. 91.0 లక్షలు, మూడో దశ ప్రారంభంలో రూ. 2.37 కోట్లు కేటాయించారు. 735 మంది వీధి విక్రయదారులకు 721 మంది వివరాలు ఆన్‌లైన్ చేయగా జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది.

**ఆదాయం పెరిగింది** కూరగాయలను విక్రయించి లబ్ధి పొందుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన రూ. 10 వేల రుణంతో సరకుల నిల్వలు పెంచుకున్నాం. తర్వాత రూ. 20 వేలు, ప్రస్తుతం రూ. 50 వేలకు అర్హత సాధించాం. వీటి ద్వారా రోజువారీ ఆదాయం పెరిగి ఇంటి అవసరాలు తీరుతున్నాయి. లక్ష్మి, ధర్మపురి

## ఏఐ.. ప్రత్యేకావసరాలకూ సై!

మంచిర్యాల : అన్నీ సవ్యంగా ఉన్న పిల్లలకు పాఠాలు చెప్పడమే ఉపాధ్యాయులకు కష్టమైన పని.. అలాంటిది బుద్ధిమాంద్యం, అంధ, మూగ, చెవిటి వంటి ప్రత్యేకావసరాల పిల్లలకు బోధన చేయడమంటే ఎంతో ఓపిక ఉండాలి.. విషయం గమనించిన కలెక్టర్ రాజర్షిషా తన నిధులను వెచ్చించి గొప్ప మనసు చాటుకున్నారు. కృత్రిమ మేధ(ఏఐ) బోధన కోసం రూ. 4.90 లక్షల విలువైన పరికరాలు ఇప్పించారు. ఆదిలాబాద్ డైట్ కళాశాల ప్రాంగణంలోని భవిత కేంద్రంలో 25 మంది చెవిటి, మూగ, సెరిబ్రల్ పాల్సి, సికిల్‌సెల్, ఎంఆర్, మల్టీ డిజెబిలిటీ(ఎండీ) వంటి ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. వారి కోసం ఇద్దరు విలీన విద్య రిసోర్సుపర్సన్లు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో భవిత కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి పరిస్థితులను కళ్లారా వీక్షించారు. ఏఐ బోధన ఉపయుక్తంగా ఉంటుందని ఈ నెల 12వ తేదీన ఆయా పరికరాలను సమకూర్చారు. ఒకేసారి అందరూ వింటున్నారు..!

ఏఐ పరికరాలు అందుబాటులోకి రావడంతో ఒకేసారి గ్రూప్ హియరింగ్ హెడ్స్‌తో పాఠాలు వింటున్న పిల్లలు..

**బోధన సులువు..** ట్రెస్టిల్, కోబో టాబ్లెట్, ఆర్‌బిట్ రీడర్ 2.0 సెల్, డిజిటల్ స్పీచ్‌ట్రైనర్, గ్రూప్ హియరింగ్ కిట్స్, ఏఏసీ కిట్స్, డిజిటల్ స్పీచ్ థెరపీ పరికరాలు, ల్యాప్‌టాప్, స్కానర్ వంటివి ఏఐ ల్యాబ్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యసన, కమ్యూనికేషన్ సామర్థ్యాల పెంపునకు ఏఐ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతోందని రిసోర్స్‌పర్సన్ పుష్పవేణి చెబుతున్నారు. స్కానర్, ల్యాప్‌టాప్ సాయంతో అంధ విద్యార్థులు తమంతట తామే పాఠాలు వినగల్గుతున్నారని పేర్కొన్నారు.

మార్పు కనిపిస్తోంది.. విజయ, పోషకురాలు, తాటిగూడ

## ఘాటు గాయం.. మటుమాయం కావాలని!



ఖమ్మం : కొన్నేళ్లుగా లాభాలను మిగిల్చిన మిరప పంట.. రెండు మూడేళ్లుగా నష్టాలను మోసుకొస్తోంది. మిరపను వదిలి పత్తి సాగుచేసిన రైతులపై ఈ ఏడాది వరుణుడు కన్నెర్ర చేశాడు. వానాకాలంలో అధిక వర్షాలు, మొంథా తుపాను ముంచెత్తటంతో కాసిన పత్తి నేలపాలైంది. కొద్దిమంది మాత్రమే గట్టెక్కారు. ఈ రెండు పంటలూ కన్నీళ్లు మిగిల్చటంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కర్షకులు యాసంగిలో మొక్కజొన్న వైపు మళ్లారు.

**మక్కలకు పెరిగిన ఆదరణ**

ఖమ్మం జిల్లాలో గతేడాది 60వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మిరప సాగవగా, ఈసంవత్సరం 31,713 ఎకరాలకు పడిపోయింది. వానాకాలంలో 2,415 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగుచేశారు. పత్తి పండించిన రైతులకు నష్టాలు రావడంతో నవంబర్‌లో చెట్లను తొలగించారు. మిరప రైతులూ ఆ పంటను వదిలేసి మొక్కజొన్న పంటపై దృష్టిసారించారు. ప్రస్తుత యాసంగిలో 1,59,462 ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 1.25 లక్షల ఎకరాల్లో రైతులు పంట వేశారని సమాచారం. గతేడాది 1,22,827 ఎకరాల్లో మక్కలు పండించారు. ప్రస్తుతం పత్తి, మిరప రైతులు ఇటువైపు మళ్లటంతో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలో యాసంగిలో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 22,229 ఎకరాలు. ఈసంవత్సరం 32,300 ఎకరాల్లో పంట సాగవుతుందని అంచనా. ఇప్పటికే 26,450 ఎకరాల్లో పంట సాగవటం విశేషం. గతేడాది నాలుగెకరాలు కౌలు తీసుకొని మిరప పంట సాగుచేశాను. తెగులు సోకటంతో పంట దెబ్బతింది. చేతికందిన మిరపకు మద్దతు ధర లభించకపోవటంతో రూ. 5లక్షల నష్టం వచ్చింది. ఈసారి మొక్కజొన్న పంట వేశాను. మిరపలో దిగుబడి బాగుంటే ధర ఉండదు.. మంచి ధర పలికినప్పుడు పంటను వైరస్ చుట్టిముట్టి నాశనం చేస్తోంది. మొక్కజొన్న పంట సాగు ఆశాజనంగా ఉంటుంది. గుమ్మడి నాగార్జున, సిరిపురం (వైరా)

## ఇంతింతై.. ఉపాధి పథమై..



ఖమ్మం : ఖమ్మం మహిళా మార్ట్.. ఈ ఆలోచన అతివలను వ్యాపారులుగా తయారుచేసింది. 300 కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించి వారి నమ్మకాన్ని చూరగొంటోంది. స్థాపించిన ఏడు నెలల్లోపే మహిళా మార్ట్‌లో రూ. 55.94 లక్షల అమ్మకాలు జరిగాయి. మగువలకు ఉపాధి చూపటంలో ఆదర్శంగా నిలవటంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

**10 శాతం నికర లాభం**

జిల్లా పరిషత్తు మహిళా సమాఖ్య, గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్డీఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో ఈఏడాది మే 28న మహిళా మార్ట్ ఏర్పాటుచేశారు. తినుబండారాలు, ఆహారపదార్థాలు, అలంకరణ, పరిశుభ్రత, కొయ్యబొమ్మలు, హెర్బల్ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఇందులో అమ్మేవన్నీ స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు సేకరించినవి, తయారుచేసినవి కావటం విశేషం. వినియోగదారుల అభిరుచి మేరకు అవసరమైన సామగ్రి కోసం మండల సమాఖ్య(ఎంఎస్)లకు ఆర్డర్ ఇస్తారు. అక్కడి ఏపీఎంలు డ్వాక్రా రుణంతో స్వయం ఉపాధి యూనిట్లు తయారుచేసుకున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సమాచారం చేరవేస్తారు. జిల్లావ్యాప్తంగా 101 మంది పొదుపు సంఘం మగువలు పప్పుదినుసులు, చిరుధాన్యాలు, కొయ్యబొమ్మలు, సేంద్రియ ఉత్పత్తులను మహిళా మార్ట్‌కు సరఫరా చేస్తున్నారు. నాణ్యమైన ఉత్పత్తులను మార్ట్‌లోని ఉద్యోగులు, డీఆర్డీఏ సిబ్బంది ఎంపిక చేసుకొని 12శాతం లాభంతో వినియోగదారులకు అమ్ముతున్నారు. ఇప్పటివరకు రూ. 55,94,962 విలువైన ఉత్పత్తులు విక్రయించగా.. అందులో 2శాతం వేతనాలు, ఇతర ఖర్చులు పోనూ పదిశాతం వరకు నికర లాభాలు గడించారు. దీనిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 300 కుటుంబాలు జీవనోపాధి పొందుతుండటం అధికారుల దూరదృష్టికి నిదర్శనం.


**రాష్ట్రానికి ఆదర్శం**

అత్యధికంగా బొలిశెట్టి మృణాళిని రూ. 4.56లక్షలు, చాగంటి లావణ్య రూ. 4.05లక్షలు, మలిశెట్టి రమాదేవి రూ. 3.90లక్షల ఉత్పత్తులను మహిళా మార్ట్‌లో విక్రయించారు. మహిళా మార్ట్ సాధించిన విజయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే వివిధ వేదికలపై ప్రస్తుతించారు. రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందంటూ కొనియాడారు. జిల్లాకు ఒకటి చొప్పున వీటిని ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రస్థాయి బృందంతో సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, హనుమకొండ డీఆర్డీఏ ప్రతినిధులు మహిళా మార్ట్‌ను పరిశీలించారు. దీని స్ఫూర్తితో భద్రాద్రి జిల్లాలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిబజార్ ఏర్పాటుకు పీఓ రాహుల్ చర్యలు తీసుకుంటున్నారు.

మహిళా మార్ట్ సత్ఫలితాలు ఇస్తుండటంతో విస్తరించాలని యోచిస్తున్నాం. స్వయం ఉపాధి యూనిట్లు కలిగిన గ్రామీణ ప్రాంతాలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తాం. నాణ్యమైన సరకులను వినియోగదారులకు అందిస్తాం. అతివల కోసం ఫిమేల్ జోన్ ఏర్పాటుచేస్తాం. సన్యాసయ్య, డీఆర్డీఓ, ఖమ్మం

ఇప్పటివరకు రూ. 4.56లక్షల విలువైన బెల్లం మిఠాయిలు, స్నాక్స్‌ను మార్ట్‌లో విక్రయించాం. వినియోగదారులు మళ్లీ కొనాలనే ఉద్దేశంతో పరిశుభ్రత, నాణ్యతపై దృష్టిసారించాం. మార్ట్‌లో 15 రోజులకోసారి బిల్లులు ఇస్తున్నారు. మా కుటుంబంతోపాటు మరో నలుగురికి ఉపాధి దొరుకుతోంది. బొలిశెట్టి మృణాళిని, శ్రీవారాహి హెూంఫుడ్స్, ఖమ్మం

## వసతులు భ్రాంతి.. రైతుకేదీ విశ్రాంతి?



హైదరాబాద్:నగరంలో పెద్దదైన బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గతంలో ఏర్పాటు చేసిన రైతుల విశ్రాంతి భవనం నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు తీసుకొచ్చే రైతులు సేదదీరేందుకు పరిపాలన భవనం పక్కనే ఉన్న క్యాంటీన్ పైఅంతస్తులో దీనిని ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు కూరగాయలు, ఇతర పంటల విక్రయాలు పూర్తి చేసుకుని తిరిగి వెళ్లేందుకు కొన్ని రోజులు ఇక్కడ ఉండాల్సి ఉంటుంది. దీంతో వారు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన భవనంలో తొలుత అన్ని వసతులు కల్పించారు. అనంతరం దీని నిర్వహణను మార్కెట్ కమిటీ అధికారులు, ప్రతినిధులు పట్టించుకోక పోవడంతో అధ్వానంగా తయారైంది.

**నిత్యం వేలాది మంది రైతుల రాక**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2002లో 174 దుకాణాలు, మార్కెట్ కమిటీ కార్యాలయం, క్యాంటీన్, రైతులు, హమాలీల విశ్రాంతి భవనాలతో ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది రైతులు నిత్యం ఈ మార్కెట్‌కు 30 వేల నుంచి 35 వేల క్వింటాళ్ల కూరగాయలు తీసుకొస్తుంటారు. వీరు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన భవనంలోని ఫ్యాన్లు దెబ్బతిన్నాయి. మంచాలు శిథిలావస్థకు చేరాయి. భవనంలో అపరిశుభ్రత నెలకొంది. తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా మారింది.

**వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నా**

పల్లీల విక్రయం కోసం వారం కిందట మార్కెట్‌కు వచ్చా. అప్పటి నుంచి దుకాణం వద్దే ఉంటున్నా. గతంలో ఇక్కడి రైతు విశ్రాంతి భవనం ఎంతో బాగుండేది. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం.

నారాయణప్ప, అనంతపురం జిల్లా శింగనమల

**రూ. 10 లక్షలతో ప్రతిపాదనలు**

శిథిలావస్థకు చేరిన రైతు విశ్రాంతి భవనాన్ని అభివృద్ధి చేసేందుకు రూ. 10 లక్షలతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపాం. అప్పటి వరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు సేదదీరేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. రాగిరి ఆనంద్‌బాబుగౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్

## ఇదేం 'చెత్త' పని

ఆదిలాబాద్ : రెండు ప్రైవేటు సంస్థలకు పట్టణం నుంచి 8 కి.మీ దూరంలోని బంగారుగూడ దగ్గర గల మున్సిపల్ డంపింగ్ యార్డులో స్థలాన్ని కేటాయించారు. అన్ని సదుపాయాలు పురపాలిక తరపునే కల్పిస్తున్నారు. బయోమైనింగ్ ప్లాంటుకు చెత్త ఇస్తున్నా అక్కడినుంచి రూపాయి లాభం బల్దియాకు లేదు. దాదాపు 1.16 లక్షల టన్నుల చెత్త ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకొని.. ఎలాంటి ప్రయోజనం ఆశించికపోవడం విడ్డూరం.

**విద్యుత్తు బిల్లు విచిత్రం :** ప్రత్యేకంగా పుర నిధులతోనే రూ. లక్షలు ఖర్చుచేసి అక్కడ హైటెన్షన్ విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడంతోపాటు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. రెండు యంత్రాలకు కలిపి నెలకు రూ. 3.50 లక్షల నుంచి రూ. 4.30 లక్షల వరకు విద్యుత్తు బిల్లు వస్తోంది. రెండేళ్లుగా రూ. 66 లక్షలకు బకాయి పెరిగింది. ఇది ఎవరు చెల్లించాలనేది తెలియడం లేదు. అంతకుముందు బల్దియా తరఫునే చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది. పుర కమిషనర్ పేరిట బిల్లు వస్తోంది. డంపింగ్ యార్డులో వ్యర్థాలను వేరుచేసే బయోమైనింగ్ ప్లాంటు ఇది.. సాగర్ మోటార్ అనే సంస్థకు టెండర్ ద్వారా అప్పగించారు. పురపాలక పరిధిలో నిత్యం సేకరించిన చెత్తను ఇక్కడికి తీసుకొస్తారు. రాళ్లను, వ్యర్థాలను వేరు చేస్తారు. మిగతాది ఎరువుగా ఉపయోగపడకపోవడంతో ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.



ప్లాస్టిక్ కవర్లు, వస్త్రాలు ఇతర వ్యర్థాలను కాల్చేందుకు సిమెంటు పరిశ్రమలకు ఆ సంస్థనే అమ్ముతూ ఆదాయం సంపాదించుకుంటోంది. డంపింగ్ యార్డుకు ఆనుకొనే ఏర్పాటు చేసిన ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎఫ్‌ఎస్‌టీపీ) ఇది.. నివాస గృహాల్లోని సెప్టిక్ ట్యాంకుల్లోంచి సేకరించిన మానవ విసర్జిత వ్యర్థాలను శుద్ధిచేసే యంత్రమిది. మలాన్ని ఎరువుగా తయారుచేసి పొలాలకు సరఫరా చేయాల్సి ఉండగా ఎక్కడా పంపిణీ చేయలేదు. కేవలం నీటిని శుద్ధిచేసి చెట్లకు వినియోగిస్తున్నారు. వచ్చిన కొంత ఎరువును హరితహారం చెట్లకు వాడుతున్నట్లు చెబుతున్నారు. భారత్ ప్రిస్టియన్ ఇన్‌ఫ్రా ప్రై. లిమిటెడ్ అనే సంస్థ ఆధ్వర్యంలో ప్లాంటు నడుస్తోంది.

**బిల్లు చెలింపుపై స్పష్టతలేదు**

సీవీఎన్ రాజు, పుర కమిషనర్

విద్యుత్తు బిల్లు వాస్తవానికి ఆ సంస్థలే చెల్లించాలి.. ఇక్కడ మాత్రం స్పష్టత లేదు. బకాయిలు పెరగక ముందు బిల్లు ఎవరు చెల్లించారనే దానిపై సమాచారం లేదు. హైదరాబాద్ స్థాయిలోనే టెండర్లు జరిగినందున ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

## కొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు

మంచిర్యాల : జిల్లాలో యాసంగి పనులు ప్రారంభమవుతున్న వేళ రైతన్నలు వానాకాలంలో కోసిన వరి, పత్తి పంట పొలాల్లో కొయ్యలను కాల్చివేస్తున్నారు. ఫలితంగా భూసారం తగ్గడంతోపాటు, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని శాస్త్రవేత్తలు, అధికారులు చెప్పినా ఫలితం లేకుండా పోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యంత్రాలతో కోతలు చేయడం వల్ల వరి కొయ్యలు భూమి స్థాయికి కోయడంలేదు. ఆర్థిక భారమని వాటిని కాల్చివేస్తున్నారు.

**దిగుబడులపై ప్రభావం..**

జిల్లావ్యాప్తంగా సాగు భూముల్లో ప్రతీసారి రైతులు కొయ్యలను కాల్చివేయడం వల్ల భూమిలోని పంటలకు ఉపయోగపడే మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు నశించిపోతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. తద్వారా క్రమంగా దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. దీనిపై అధికారులు ప్రతి సీజన్‌లో ప్రత్యేకంగా రైతులతో మాట్లాడి మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఓ వైపు మితిమీరిన రసాయన ఎరువులు, గడ్డి మందులను వినియోగించడంతో పాటు నిప్పు పెట్టడంతో భూమిలో సారం తగ్గుతుందని అధికారులు తెలియజేస్తున్నారు.

**సేంద్రియం వైపు సాగాలి**

ఏటా వానాకాలంలో పంటలు సాగుచేసే క్రమంలో ముందస్తుగా పచ్చిరొట్టను ఎలాగైతే సాగుచేసి భూమిలోనే దున్నుతారో అదే మాదిరిగా వరి కొయ్యలను కలియదున్ని కొంతకాలం పాటు పొలంలోని నీటిలోనే



మురిగేలా చేస్తే పంటలకు ఎలాంటి నష్టం కలిగించే అవకాశం ఉండదని శాస్త్రవేత్తలు అంటున్నారు. రసాయన ఎరువులు కాకుండా పశువుల పేడ, పశువుల ఎరువుల వంటివి వినియోగిస్తే భూమి ఆరోగ్యంగా ఉంటుందని తెలియజేస్తున్నారు. ఇదే క్రమంలో ప్రతి సీజన్‌లో పంటలను మార్పిడి చేస్తూ సాగు చేసుకుంటే మరింత లాభదాయకంగా దిగుబడులు పొందుతారని అధికారులు వివరిస్తున్నారు.

జిల్లాలో సాగు భూముల వివరాలివే.. (లక్షల ఎకరాల్లో)

మండలాలు : 18

మొత్తం సాగు భూములు : 3.40

రైతులు : 1.20 లక్షలు

వానాకాలంలో సాగైన వరి పంట : 1.52

సాగైన పత్తి పంట : 1.80

యాసంగిలో సాగయ్యే భూములు : 2.80

సాగుచేసే పంటలు : వరి, మొక్కజొన్న, పత్తి, కంది, కూరగాయలు

# భూములు మిం'కేసీ'

కర్నూలు: వైకాపా ప్రభుత్వ హయాంలో నాటి ప్రజాప్రతినిధి.. తాను పరోక్షంగా భాగస్వామిగా ఉన్న ఓ స్థిరాస్తి సంస్థకు అవసరమంటూ రూ.40 కోట్లకు పైగా విలువైన కేసీ కాలువ భూములను అడ్డగోలుగా ఆక్రమించేశారు. ఆ భూముల మధ్యలో ఉన్న కాలువను నామరూపాల్లేకుండా పూడ్చేశారు. ప్రభుత్వ భూముల్లోనూ లేఅవుట్ వేసి ప్లాట్లుగా విభజించి అమ్మేశారు. అప్పట్లో అధికారంలో ఉండడంతో ఏదోలా అనుమతులు తెచ్చుకోవచ్చని భావించారు. అనుమతులు రాకపోవడంతో అందులో ప్లాట్లు కొనుగోలుచేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**ఎమ్మెల్యే ఫిర్యాదుతో విచారణ**

కేసీ కాలువ మార్గాన్ని మార్చేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయకుండానే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని.. కాలువను పూడ్చేశారంటూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముఖ్యమంత్రికి నేరుగా ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆ స్థిరాస్తి సంస్థ లేఅవుట్‌ను ఆళ్లగడ్డ పురపాలక సంఘం పూర్వ కమిషనర్ కూడా ఆమోదించారని, తాకట్టులో ఉన్న 97 ప్లాట్లను కూడా విక్రయించుకోవడానికి అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. వీటిపై విచారణ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**వాస్తవమేనంటూ..**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కుడా పూర్వ వైస్ ఛైర్‌పర్సన్ నవ్య గతేడాది ప్రాథమిక విచారణ జరిపారు. జలవనరులశాఖ భూమిలో 55 ప్లాట్లు వేశారని, కొన్నింటిలో నిర్మాణాలు కూడా జరుగుతున్నాయని నిర్ధారించారు. నవ్య బదిలీ కావడంతో కుడా



అధికారులు సమగ్ర విచారణ చేసి మరో నివేదిక ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

**ఖాళీ చేయాలని ఆదేశాలు**

ఈ ప్రాంతంలో స్థలాలు కొనుగోలు చేసినవారు ఇబ్బందులు పడుతున్నారు. జలవనరుల శాఖకు చెందిన 5.39 ఎకరాల పరిధిలో ఉన్నవారు ఖాళీ చేయాలని అధికారులు తాఖీదులు పంపారు. దీంతో బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతానికి న్యాయస్థానం ఆదేశాలతో ఖాళీ చేయించే ప్రక్రియ తాత్కాలికంగా నిలిచింది.

**కాలువ మార్గాన్ని మార్చేసి..**

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ శివారులోని సర్వే నంబర్లు 19/పి, 21, 46/పి, 510, 51, 52, 54/పి, 55/పి, 381/పి, 382/పి, 384/పి, 392/పిలలో 'అహోబిల ప్రైమ్ వెంచర్స్' అనే సంస్థ 2019లో 59.605 ఎకరాల్లో లేఅవుట్ వేసేందుకు శ్రీకారం చుట్టింది. వాస్తవానికి అందులో కర్నూలు-కడప కాలువ (కేసీ కాలువ) పాలసాగరం ఛానెల్ ప్రవహిస్తోంది. దీని విస్తీర్ణం సుమారు 5.39 ఎకరాలు ఉంటుంది. ఆయా ప్రభుత్వ భూములు తమకు కావాలని ఆ సంస్థ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఆ భూమి ఇస్తే దానికి ప్రత్యామ్నాయంగా భూమి, అందులో కాలువను కూడా పక్కాగా నిర్మించి ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. కొత్త కాలువ నిర్మించి అందులో నీరు పారేవరకు పాతదానిని మూసేయకూడదన్న నిబంధన విధించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాకనే కాలువ మార్గాన్ని మార్చేశారు. ప్రభుత్వ భూమిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రత్యామ్నాయ కాలువను వెంచర్‌కు వెలుపల నిర్మించారు. 'డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్' అధికారులను తప్పుదోవ పట్టించి ఆయా అనుమతులు తెచ్చుకున్నారన్నది తాజా ఆరోపణ.

# మార్పు మంచికే.. గాడిన పడాల్సిందే!

నెల్లూరు : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం- తాజాగా వాటి పేర్లను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా మార్చింది. ఇందుకు రాష్ట్ర మంత్రి మండలి ఇటీవల ఆమోదం తెలపగా.. అదే రీతిలో పాలనలోనూ మార్పులకు అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వంలో ఒక్కో సచివాలయం పరిధిలో సగటున 13 మంది ఉద్యోగులను నియమించగా.. వారిలో చాలా మంది సమయపాలన పాటించడం లేదని.. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటున్నారనే విమర్శలపైనా దృష్టిసారించింది.

**ముఖ హాజరు తప్పనిసరి**

సచివాలయ సిబ్బంది కార్యాలయ పనివేళల్లో(ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు) ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ముఖ ఆధారిత హాజరును తప్పనిసరి చేసింది. ఆన్‌లైన్ ద్వారా వేసేలా చూడటంతో పాటు హాజరు వేయకున్నా.. గైర్హాజరైనట్లు భావించినా.. వేతనం నిలిపివేసేలా విధివిధానాలు రూపొందించింది. ఈ చర్యలు సత్ఫలితాలు ఇస్తాయన్న




ఆశాభావం ఇటు అధికారులు, అటు ప్రజల్లోనూ వ్యక్తమవుతోంది.

**ప్రత్యేక అధికారుల నియామకం**

పాలనను, ఉద్యోగులను గాడిన పడేలా సచివాలయ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రతి మండలానికి ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలను నియమించింది. వీరితో పాటు డివిజన్, జిల్లా స్థాయిలోనూ అధికారులకు బాధ్యతలు అప్పగించింది.

వార్డు సచివాలయాలు: 218

గ్రామ సచివాలయాలు: 551

మొత్తం ఉద్యోగులు: 6,593

# స్వచ్ఛత అటకెక్కి.. చెత్త రోడ్డెక్కి



ఆదోని : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పురపాలక సంఘాల పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ అధ్వానంగా సాగుతోంది. వ్యర్థాలు లేని.. శుభ్రమైన ప్రాంతాలుగా మార్చాలని కూటమి ప్రభుత్వం యోచిస్తుంటే.. పట్టణాల్లో మాత్రం చెత్త సమస్యలు వేధిస్తున్నాయి.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..**

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 52 వార్డులు ఉన్నాయి. 8 లక్షల వరకు జనాభా ఉంది. 1,070 మంది కార్మికులు, 200 మంది డీసిల్టింగ్ సిబ్బంది ఉన్నారు. ఇంటింటి చెత్త సేకరణ అధ్వానంగా ఉంది. నంద్యాల పట్టణ పరిధిలో 42 వార్డుల్లో రెండు లక్షలకుపైగా జనాభా ఉంది. శాశ్వత సిబ్బంది 95, ఒప్పంద పద్ధతిన 33 మంది ఉన్నారు. మరికొంత మంది అవసరం ఉంది. చాలాచోట్ల రెండు రోజులకోసారి చెత్త సేకరిస్తున్నారు. రోజువారీలో 20 శాతం వ్యర్థాలు రహదారులపైనే ఉంటున్నాయని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు.

ఆదోని పట్టణంలో 42 వార్డులు ఉండగా 2 లక్షల మందికిపైగా నివసిస్తున్నారు. 96 శాశ్వత, 180 మంది ఒప్పంద, 100 మంది అదనపు కార్మికులున్నారు. తోపుడు బండ్లు 92 ఉన్నట్లు యంత్రాంగం చెబుతున్నా చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి.

ఎమ్మిగనూరు పురపాలక పరిధిలో 179 మంది కార్మికులున్నారు. ఇక్కడ మరో 40 మంది కార్మికుల అవసరముంది. తోపుడు బండ్లు సరిగా లేవు.

డోన్‌లో 80 వేల మంది నివసిస్తున్నారు. 16 శాశ్వత, 72 ఒప్పంద పద్ధతిన, మరో 20 మంది కార్మికులు ఉన్నారు. ఇంకనూ 40 మంది అవసరం ఉంది. మూడు కంప్యాక్టర్లకుగాను రెండు పనిచేస్తున్నాయి, తోపుడు బండ్ల అవసరం ఉంది.

**పర్యవేక్షణ లోపం..**గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉన్న చెత్త సేకరణ పన్ను విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసి జనానికి ఉపశమనం కలిగించింది. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు తొమ్మిది పురపాలక సంఘాలున్నాయి. వీటి పరిధిలో తోపుడు బండ్ల ద్వారా చెత్త సేకరించేలా చర్యలు చేపట్టారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఇంటింటి చెత్త సేకరణ సవ్యంగా సాగకపోవడంతో చాలామంది రహదారులు, కాలువల్లో వ్యర్థాలు పారబోస్తున్నారు. ఉన్నతాధికారుల తనిఖీ సమయంలో సిబ్బంది హడావుడి చేయడం.. బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రంగా ఉంచుతున్నారు. ఆ తర్వాత సేవలను గాలికి వదిలేస్తున్నారు.

# ప్రమాదాలు అడ్డుకోలేరు



బేతంచెర్ల : జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఘాట్ రోడ్లలో భద్రతా చర్యలు కానరావడం లేదు. దీనికితోడు మలుపులు ఉండటంతో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి. రక్షణ గోడలు దెబ్బతిన్నా మరమ్మతులు కానరావడం లేదు.

**రూ.22 కోట్లతో పనులు**

పాణ్యం మండలం తమ్మరాజుపల్లె నుంచి బేతంచెర్ల మధ్య 16 కి.మీ. దూరం ఉంది. 2022లో రూ.22 కోట్ల నిధులతో రెండు వరుసల రహదారిగా దీనిని మార్చారు. నిర్మించిన కొద్ది కాలానికే రహదారి మొత్తం గుంతలమయమైంది. ఇటీవలే దీనికి మరమ్మతులు చేపట్టారు. తమ్మరాజుపల్లె నుంచి సిమెంట్‌నగర్ వరకు 6.50 కి.మీ. మార్గాన్ని రూ.10 కోట్లతో, సిమెంట్‌నగర్ నుంచి బేతంచెర్లకు 8.50 కి.మీ. రోడ్డును రూ.12 కోట్లతో నిర్మించారు. ఘాట్ రోడ్డులో రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి.

**అదుపు తప్పితే లోయలోకే..**

తమ్మరాజుపల్లె నుంచి సిమెంట్‌నగర్ వరకు 7 కి.మీ. రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఘాట్ మార్గం కావడంతో అదుపు తప్పితే వాహనాలు లోయలో పడే ప్రమాదముంది. సుమారు 2 కి.మీ. ఘాట్ రోడ్డులో పలు మలుపులున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. మలుపుల వద్ద ప్రమాద సూచికలున్నప్పటికీ అవి సరిగా లేకపోవడంతో వాహన చోదకులకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల సిమెంట్‌నగర్ ఘాట్ రోడ్డులో వెళ్తున్న లారీ అదుపు తప్పి కొండపై నుంచి కిందకు దూసుకెళ్లింది. తమ్మరాజుపల్లె నుంచి సిమెంట్‌నగర్ మార్గంలో రహదారి ప్రమాదాలతోపాటు దొంగల భయం వెంటాడుతోంది. రక్షణ గోడలు శిథిలమవడంతో వాహనదారులు నిదానంగా వెళుతుంటారు. ఈ నేపథ్యంలో దుండగులు దాడి చేసి చోరీలకు పాల్పడుతున్నారు. ఏదైనా వాహనం రహదారిలో ఆగితే దొంగలు చుట్టుముట్టి దోపిడీకి యత్నించిన ఘటనలు జరిగాయి. ఈ నేపథ్యంలో రక్షణ గోడలకు మరమ్మతులు చేయించడంతోపాటు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



నాగులుప్పలపాడు : ఉప్పుగుండూరు కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా సాగుతున్నాయి. నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు కోలాహలంగా జరిగాయి. రెండు పళ్ల విభాగంలో 8 క్వింటాళ్ల బరువు కలిగిన బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పందెంలో మొత్తం 7 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. వీటిలో 5వ జత యజమానులు తీసిన డ్రాలో ఉండగా.. మిగిలిన రెండు జతలకు ఎగ్జిబిషన్ నిర్వహించారు. 5 జతల ఎడ్ల మధ్య పోటీ హోరాహోరిగా సాగింది. ఈ పోటీల్లో నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామానికి చెందిన కటారి వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మునగాల గ్రామానికి చెందిన పొన్నెబోయిన విష్ణు భరత్ యాదవ్‌కు చెందిన కంబైన్డ్ ఎద్లు మొదటి స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతిగా రూ.30 వేలు నగదు అందుకొన్నాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి మోపర్తి వెంకటేశ్వర్లు, పిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన రామకృష్ణామాచారికి చెందిన కంబైన్డ్ ఎడ్లజత రెండవ స్థానం సాధించి రూ.25 వేల నగదు బహుమతి కైవసం చేసుకుంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట కావూరి లింగంగుంట్ల గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డికి చెందిన ఎడ్లజత మూడో స్థానంలో నిలిచి రూ.20 వేల నగదు బహుమతి దక్కించుకుంది. నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బెల్లం రోశయ్య పున్నయ్య మెమోరియల్‌కు చెందిన ఎడ్లజత నాలుగో స్థానంలో నిలిచి రూ.15 వేలు నగదు బహుమతి సాధించింది. మార్కాపురం జిల్లా బేస్తవారపేట మండలం వంగపాడుకు చెందిన వెంకట రమణారెడ్డికు చెందిన ఎడ్లజత అయిదో స్థానంలో నిలిచి రూ.12 వేల బహుమతి దక్కించుకుంది. ఎగ్జిబిషన్ కింద నిర్వహించిన నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం గ్రామానికి చెందిన బీమవరపు బ్రహ్మయ్య ఎడ్లజత మొదటి స్థానం సాధించింది. బాపట్ల జిల్లా చినగంజాంకు చెందిన లింగయ్య జత రెండో స్థానం దక్కించుకొంది. విజయం సాధించిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలకు, పురుషులకు తాడులాగే పోటీలు నిర్వహించారు. ఎడ్ల పందేలు తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాకతీయ సేవాసమితి కమిటీ సభ్యులు కనగాల రామకృష్ణ, బెల్లం శేషయ్య, ఉన్నం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# నాడు రోగుల దైన్యం.. నేడు మెరుగైన వైద్యం

పొదలకూరు : దశాబ్దాలుగా డయాలసిస్ కేంద్రం లేక మెట్ట ప్రాంతంలో బాధితులు ఉదయం లేచి కుటుంబ సభ్యులతో జిల్లా కేంద్రం వెళుతూ ఇబ్బందులు పడ్డారు.. గత వైకాపా పాలనలో నిర్మిస్తామంటూ హడావుడి చేసి పట్టించుకోలేదు.. కూటమి ప్రభుత్వం వచ్చాక పొదలకూరు సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం రోగులకు ఎంతో ఉపయోగకరంగా మారింది.

ఇప్పటి వరకు వచ్చిన వారు : 2637

ప్రతి రోజూ చికిత్స పొందుతున్న వారు : 15 మంది

ఎన్ని మండలాల వారికి ఉపయోగం : పొదలకూరు, రాపూరు, చేజర్ల, మనుబోలు, కలువాయి, సైదాపురం

సర్వేపల్లి, వెంకటగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల వారు డయాలసిస్ బాధితులు చికిత్సకు నెల్లూరుకు వెళ్లేవారు. ఉదయాన్నే ఇంటి నుంచి బయల్దేరి 40 నుంచి 70 కిలోమీటర్లు ప్రయాణించి చికిత్స పొందేవారు. వారంలో ఇలా రెండు నుంచి మూడుసార్లు వెళ్లాల్సి రావడంతో రవాణా ఛార్జీలతో పాటు ఇతర



ఖర్చులు అధికమయ్యేవి. సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సమీప మండలాల వారు సైతం చికిత్స పొందేందుకు వీలుగా పొదలకూరులో రూ.1.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసి ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో కలసి ప్రారంభించారు. ఎనిమిది బెడ్లు ఏర్పాటు చేయడంతో.. అయిదు యంత్రాలు, అయిదు బెడ్లతో ప్రారంభమైన డయాలసిస్ కేంద్రం ప్రస్తుతం ఆ సంఖ్య ఎనిమిదికి చేరింది. సీఎస్సార్ నిధుల ద్వారా మరో మూడు యంత్రాలు, బెడ్లు సమకూరాయి. ఒక రోజు షిఫ్టుల వారీగా ఏక కాలంలో 8 మందికి చికిత్స అందించేందుకు యంత్రాలు, సిబ్బంది ఉన్నారు. ప్రతి రోజూ 15 నుంచి 18 మంది ఇక్కడ డయాలసిస్ చికిత్స తీసుకుంటున్నారని నిర్వాహకులు తెలిపారు. నిరుపేదలు, నిరార్శయులకు ఇది వరంగా మారిందని రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆరు మండలాల వారికి ఉపయోగం.. డయాలసిస్ కేంద్రంలో పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి, మనుబోలు, సైదాపురం మండలాల రోగులు 35 నుంచి 40 మంది చికిత్స తీసుకుంటున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మధ్యాహ్నం 2 నుంచి 6 వరకు సేవలందిస్తున్నారు. రాత్రి సమయంలో సైతం చికిత్స అందించేందుకు సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్నారు.

# 100కే ఆపసోపాలు.. 125 పనిదినాలెలా?

దుత్తలూరు : కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుతో పలు నిబంధనలు విధించింది. పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడంతో పాటు పని చేసిన తరువాత 15 రోజులకే వేతనాలు చెల్లించేలా చట్టబద్ధమైన విధానాన్ని తీసుకొచ్చింది. వ్యవసాయ పనుల సమయంలో 60 రోజుల విరామాన్ని చట్టంలో పొందుపరిచింది. ఇంతవరకు బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో కూలీలకు 125 రోజులు పని కల్పించడం సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. లక్షల సంఖ్యలో కూలీలు ఉన్నా.. అందరికీ పనులు చూపించలేకపోతున్నారు. అదికూడా ఇప్పటివరకు 100 రోజులు చేసిన కుటుంబాలు చాలా తక్కువే.

**క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం**

కుటుంబాలకు 100 రోజుల పని దినాలు కల్పించడంలో క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 రోజుల పని చూపడంతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన వేతనం దక్కేలా క్షేత్రస్థాయిలోని అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. జిల్లాలోని చాలా పంచాయతీల్లో చూపించలేకపోతున్నారు. దీంతో పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. ఈనేపథ్యంలో 125 రోజులు పని కల్పించడం సాధ్యమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో యాక్టివ్ జాబ్‌కార్డులు 2.6 లక్షలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 3,016 కుటుంబాలకు మాత్రమే 100 రోజులు పని కల్పించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు

**లక్ష్యం పూర్తి చేసేలా చర్యలు**

పథకంలో పనిచేస్తున్న ప్రతి కుటుంబానికి 125 రోజుల పని కల్పించేలా కేంద్ర ప్రభుత్వం నూతన చట్టం అమల్లోకి తీసుకొచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి మార్గదర్శకాలు అమలు కానున్నాయి. సాధ్యమైనంత మేరకు ప్రతి కుటుంబానికి పని కల్పిస్తాం. క్షేత్రస్థాయిలో సిబ్బందితో కూలీలకు అవగాహన కల్పిస్తాం.గంగాభవాని, పీడీ, డ్వామా

# వీధుల్లో రయ్ రయ్.. చెవులు గుయ్ గుయ్

నెల్లూరు : వింత.. విపరీత శబ్దాలు చేసే సైలెన్సర్లు నగర జీవులను హడలెత్తిస్తున్నాయి. వారి ప్రశాంతతకు విఘాతం కలిగిస్తూనే ఉన్నాయి. పోలీసులు ఏడాది కిందట ప్రత్యేక డ్రైవ్ చేపట్టి.. వేయికిపైగా, రెండో విడతలో 700కుపైగా, తాజాగా మూడో విడతలో 200కుపైగా శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని.. రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ తరహా చర్యలను ఉపేక్షించబోమని.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినప్పటికీ కొందరు యువత మీ హెచ్చరిక మీదే.. మా తీరుమాదే అన్నట్లు వ్యవహరిస్తుండటం ఇబ్బందికరంగా పరిణమించింది.

నగరంలో నిత్యం 1.50 లక్షలకుపైగా వివిధ రకాల వాహనాలు తిరుగుతుండగా- తరచూ జరిగే సభలు, సమావేశాల్లో వినియోగించే లౌడ్ స్పీకర్లు అదనం. ఈ క్రమంలో ప్రధాన రహదారులు, చౌరస్తాలు శబ్ద కాలుష్యంతో మోతెక్కుతున్నాయి. చిన్నబజారు, పెద్ద బజారు, కాపు వీధి, వేదాయపాళెం, అయ్యప్పగుడి తదితర ప్రాంతాల్లో పగలు 80, రాత్రి 60 నుంచి 70 డెసిబుల్స్ వరకు నమోదవుతోంది. ఆత్మకూరు బస్టాండ్, వీఆర్సీ కూడలి, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో ఈ తీవ్రత 90 నుంచి వంద వరకు ఉంటోంది. ఇంతా చాలదన్నట్లు కొందరు డుగ్గు డుగ్గు సైరన్లతో ఇబ్బంది పెడుతున్నారు. ఇటీవల కాలంలో పోలీసులు వీటిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టినా.. అది ప్రధాన రహదారులు, కూడళ్లకే పరిమితమవడంతో.. పెద్దగా ప్రభావం ఉండటం లేదు. ఆకతాయిలు భారీ, వింతైన శబ్దాల సైలెన్సర్లతో వీధుల్లోనూ హల్ చేస్తున్నారు. మరింత దృష్టిసారిస్తేనే ఈ చర్యలకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు కోరుతున్నారు.

చురకలు


## క్యాజువాలిటీలో అందుబాటులోకి అదనపు పడకలు

అనంతపురం : అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల అత్యవసర విభాగంలో ఎట్టకేలకు 12 అదనపు ఆక్సిజన్ సౌకర్యం ఉన్న పడకలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. అత్యవసర విభాగంలో పడకల కొరత తీవ్రంగా ఉందని.. దీంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరిస్తూలో గత ఏడాది అక్టోబరు 26న 'రూ.8 లక్షలకు ఎనిమిది పడకలా?' అలాగే గత ఏడాది డిసెంబరు 30న 'పేరుకే అత్యవసర విభాగం!' కథనంతోపాటు గతంలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై స్పందించిన రాష్ట్రస్థాయి అధికారులు అత్యవసర విభాగం విస్తరణకు రూ.8 లక్షల నిధులను విడుదల చేశారు.



ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు విస్తరణ పనులు చేపట్టి 12 ఆక్సిజన్ పడకలను అదనంగా ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన పడకలను బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి ఆదేశాల మేరకు ఆర్ఎంవో హేమలత, అత్యవసర విభాగం హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాసులు పూజా కార్యక్రమాలు నిర్వహించి రోగులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పడకల సామర్థ్యం పెరగటంతో ప్రస్తుతం అత్యవసర విభాగంలో 24 ఆక్సిజన్, మూడు వెంటిలేటర్, మూడు సాధారణ పడకలు ఉన్నాయి. మరికొన్ని పడకలు ఏర్పాటు చేసే వీలున్నప్పటికీ గతంలో పనిచేసిన ఒక అధికారి ఆదేశాలతో వైద్యులు, ఉద్యోగులకు ప్రత్యేక క్యాబిన్లను ఏర్పాటు చేయటంతో పడకల సామర్థ్యం తగ్గించారన్న విమర్శలున్నాయి.

## కోళ్లు కొట్లాట.. బరిలో రూ.కోట్లాట

ఐ.పోలవరం : కోనసీమలో పందెం కోడి చెలరేగిపోయింది. మురమళ్లలో మినీస్టేడియం నమూనా మాదిరిగా ఏర్పాట్లు చేశారు. ప్రధాన బరి వద్ద రూ.10 లక్షల నుంచి పందేలు సాగాయి. మరో మూడు చోట్ల రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు పందేలు జరిగాయి. ఇదే ప్రాంతంలో 15 బోర్డులు ఏర్పాటు చేసి కాయా.. రాజా.. కాయ్ అంటూ లక్షల్లో గుండాటలు నిర్వహించారు. ఖరీదైన కార్లు తరలిరావడంతో మురమళ్లలోని జాతీయ రహదారి నుంచి పందేలు జరిగే



ప్రాంతం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అక్కడ మద్యం ఏరులై పారింది..బిర్యానీల స్టాళ్లూ వెలిసాయి.
ఐ.పోలవరం మండలం కేశనకుర్రు, టి.కొత్తపల్లి, గుత్తెనదీవి, ఎదుర్లంక, కాట్రేనికోన మండలం చెయ్యేరు, గెద్దనపల్లి, పల్లంకుర్రు, ముమ్మిడివరం మండలం రాజుపాలెం, కొత్తలంక, అన్నంపల్లి, గేదెల్లంక, పి.గన్నవరం, రాజోలు, అమలాపురం, రామచంద్రపురం, మండపేట, కొత్తపేట నియోజకవర్గాలోని గ్రామాల్లో పెద్దఎత్తున కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. ఎక్కువ పందేలు నెగ్గిన వారికి సొమ్ముతో పాటు అదనంగా బుల్లెట్‌లు బహుకరించారు.

## మృత్యుపాశాలుగా కూడళ్లు..

గండేపల్లి : జాతీయ రహదారిపై కూడళ్లు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. పండగ వేళ, వారాంతాల్లో వేగంగా దూసుకెళ్లే వాహనాలు, కూడళ్ల వద్ద వేగాన్ని తగ్గించకుండా వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వరుస ప్రమాదాలు సంభవిస్తున్నప్పటికి ఎన్‌హెచ్ అధికారులు, పోలీసులు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

**ఇటీవల జరిగిన ఘటనలు..**

కిర్లంపూడి మండలం బూరుగుపూడి కూడలి వద్ద గత ఆదివారం కూడలి దాటుతున్న ఇద్దరు వ్యక్తులను లారీ ఢీ కొట్టింది. వారి మృతితో ఆ కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. మల్లేపల్లి సంతమార్కెట్ కూడలి వద్ద సైకిల్‌తో కూడలి దాటుతున్న శివరామకృష్ణను లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడంతో కుటుంబం



పెద్ద దిక్కును కోల్పోయింది. గండేపల్లి కూడలి వద్ద గత నెలలో జరిగిన ప్రమాదంలో లారీ, వ్యాన్ ముందు భాగాలు నుజ్జునుజ్జు అయ్యి, డ్రైవర్లతో పాటుగా, వాహనాలు ధ్వంసమయ్యాయి.

**బ్లాక్‌స్పాట్లు 60 కు పైగా..**

దివాన్‌చెరువు నుంచి తుని వరకు 16 వ నంబరు హైవే 90కి.మీ. మేర ఉంది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెడ్‌కోన్స్‌ను రాత్రి సమయాల్లో హైవే అధికారులు రోడ్లపైనే వదిలేస్తున్నారు. రాజానగరం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నాలుగు నియోజకవర్గాల పరిదిలో 60కిపైగా బ్లాక్‌స్పాట్లు ఉన్నప్పటికి ఎక్కడా కనీస చర్యలు లేవనే ఆరోపణలు ఉన్నాయి.

**సైన్ బోర్డులను అనుసరించి వెళ్లాలి**

కూడలి వద్ద వాహనం నెమ్మదిగా వెళ్లాలి. సైన్ బోర్డును అనుసరించి వెళ్లాలి. భారీ వాహనదారులు మద్యం తాగి వెళ్లకూడదు. రెస్ట్ పాయింట్ల వద్దే వాహనాలు నిలుపుదల చేయాలి. పెద్ద వాహనాల డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలి. –కె.ప్రసాద్ మోటర్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్, పెద్దాపురం

## రాప్తాడు మీదుగా హైదరాబాద్, బెంగళూరు.. హాయిగా సాఫీగా!



రాప్తాడు : రాప్తాడు మీదుగా అనంతపురం, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లాలంటే ఒకప్పుడు అందరిలోనూ ఒకింత అసహనం ఉండేది. రాప్తాడు రైల్వేగేటు పడితే అరగంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయేది. డబుల్ ట్రైన్ వచ్చినప్పుడు ఈ మార్గమంటేనే వాహనదారులకు చికాకు కల్గించేది. జాతీయ ఉపరితల రోడ్డు రవాణా సంస్థ మంజూరు చేసిన ఆర్వోబీ పూర్తికావడంతో ప్రస్తుతం ప్రయాణం సాఫీగా సాగిపోనుంది.

**అనుసంధానం**

హైదరాబాద్–బెంగళూరు 44వ జాతీయ రహదారి నుంచి అనంతపురం–చెన్నై వెళ్లే 42వ జాతీయ రహదారికి రాప్తాడు ఆర్వోబీ ఎంతో కీలకంగా మారింది. రూ.54.78 కోట్లతో 2018లో ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారుడిని వైకాపా నాయకులు కమీషన్లు డిమాండ్ చేయడంతో గుత్తేదారుడు పనులు నిలిపివేసి వెళ్లిపోయాడు. దీనితో పిల్లర్ల దశలోనే నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో మూడేళ్లపాటు రీ టెండర్ నిర్వహించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవ తీసుకొని రీ టెండరు నిర్వహించారు. రూ.24 కోట్లకు పనులు దక్కించుకున్న శ్రీకృష్ణదేవరాయ సంస్థ గుత్తేదారు 2025 ఆగస్టులో పనులు ప్రారంభించారు. తొమ్మిది నెలల వ్యవధిలోపు పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికే పనులు చివరి దశకు చేరుకున్నాయి. సర్వీసు రోడ్లు, రైల్వే అండర్ బ్రిడ్జి, కందుకూరు రోడ్డులో జంక్షన్ నిర్మాణ పనులు మిగిలాయి. ఇది పూర్తయితే రెండు జాతీయ రహదారులకు ఈ మార్గం ఎంతో ఉపయోగపడనుంది. జనవరి నెలాఖరున ఆర్వోబీపై రాకపోకలు సాగించేలా పనులు పూర్తి చేశామని జాతీయ రహదారుల విభాగం ఏఈ లక్ష్మీనరసయ్య తెలిపారు.

## సంబరం.. సంప్రదాయ వంటలతోనే



అనంతపురం : సంక్రాంతి పండుగ వేళ పల్లెల్లోనే కాదు పట్టణాల్లో కూడా సంప్రదాయ వంటకాల హవా నడుస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఒక్కో ప్రాంతంలో స్థానిక తీపి పదార్థానికి ప్రాచుర్యం ఉన్నప్పటికీ.. సంక్రాంతి పండుగకు బంధువులు ఒకరినొకరు కలుసుకున్నపుడు ప్రేమ అనురాగాల కలబోత లాగే.. మా ప్రాంతంలో ఈ స్వీటు ఫేమస్ అంటూ పరస్పరం కొసరి కొసరి తీపి రుచులను పంచుకొని ఆస్వాదించడం ఆనవాయితీ. అందుకే తొలి పండగ వేళ స్వీటు దుకాణదారులకు విభిన్న రుచులతో స్వీట్లను చేసి, ఆకర్షణీయ ప్యాకింగ్‌లతో ఆకట్టుకుంటారు. కొందరు దుకాణదారులు తమ ఉత్పత్తులను తయారు చేసే విధానం, నోరూరించే వంటకాలను సామాజిక మాధ్యమాల్లో ప్రదర్శిస్తున్నారు.

**గుంతకల్లు కాజా.. గిరాకీ**

గుంతకల్లు అనగానే ముందు గుర్చొచ్చేది కాజా. పెద్దకాజాలు, చిట్టికాజాలు అని రెండు రకాలుగా లభిస్తాయి. చిట్టికాజాలు నెయ్యితో తయారు చేస్తారు. ఏ కాలంలోనైనా పట్టణంలో కాజా లభిస్తుంది. పండగల సమయంలో వీటి కొనుగోళ్లు ఎక్కువగా ఉంటాయి.

**ఓళిగ ఉందిగా..**

ఓళిగ అనగానే అనంతపురం నగరం కమలానగర్, పాతూరు సున్నంగేరి గుర్తుకొస్తుంది. ఈసారి హైదరాబాద్, విజయవాడతోపాటు అమెరికాకు కూడా అనంత రుచులు ప్యాకింగ్ చేసి పంపడం గమనార్హం. సాధారణ ఓళిగలు రూ.15 నుంచి రూ.20లు ఉండగా పండగ రోజుల్లో రూ.30 నుంచి రూ.40లు పలుకుతున్నాయి. కమలానగర్‌లోనే మద్దూర్ వడకూ మరింత ప్రాధాన్యం ఉంది. అనంతపురం నగరం కోవూరు నగర్‌లో నెయ్యి అత్రాసాలు, బెల్లం గవ్వలు, చక్కెర గవ్వలు.. ప్రత్యేకత సాధారణ రోజుల్లో కన్నా పండగ రోజుల్లో కొనుగోళ్లు పెరగడం గమనార్హం. బుక్కరాయసముద్రంలో తయారు చేసే మిక్చర్‌కూ ఈ తరహా అమ్మకాలుంటాయి.

**దుర్గం చిరుతిండ్లు**

కళ్యాణదుర్గం పలు చిరుతిండ్లకు ప్రాచుర్యం ఉంది. ప్రత్యేకంగా పార్వతీనగర్‌లో చేసే మిఠాయిలు, బెల్లం గవ్వలు, బెల్లం కజ్జికాయలు, బెల్లం సున్నుండలు, ఆనియన్ నిప్పట్లు, జొన్న మురుకలను ఎక్కువగా ఇష్టపడతారు.

## తుడాలో ఉద్యోగ విరమణ వయసుపై రగడ



తిరుపతి : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడా) వైకాపా పాలనలో ఆ పార్టీ జేబులో సంస్థగా పనిచేసింది. ప్రభుత్వ చట్టాలు, నిబంధనలు పక్కనపెట్టి ఇష్టానుసారంగా తీసుకున్న నిర్ణయాలతో పాలన పూర్తిగా గాడి తప్పింది. చట్టాలు, నిబంధనల ఉల్లంఘనకు ప్రత్యక్ష కారణం నాయకులైతే... వారిని ఆదిశగా నడిపింది మాత్రం అధికారులే అనేది జగమెరిగిన సత్యం. వైకాపా అవినీతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారం అందించిన కొందరు అధికారులు, ఉద్యోగులకు కమిషన్లు, అనధికారిక ఇళ్ల స్థలాలు వంటి ఎన్నో నజరానాలు అందుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో ఒకటే తుడా ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంపు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పట్టణాభివృద్ధి సంస్థల్లో పదవీ విరమణ వయసు 60 సంవత్సరాలు కాగా.. తుడాలో మాత్రం 62 ఏళ్లు చేస్తూ అప్పటి వైకాపా నాయకులు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. అప్పటి ప్రభుత్వమే వారి కొనసాగింపును తిరస్కరించింది. తుడా పాలకమండలి తీర్మానాన్ని సాకుగా చూపి 23 మంది ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులతో ఉద్యోగాల్లో కొనసాగారు. వైకాపా పాలనలో వారికి సంపూర్ణ సహకారం ఉండడంతో ఎటువంటి అడ్డంకులు లేకుండా పదవులు అనుభవించారు. అందులో న్యాయస్థానం తీర్పు రాకుండానే వారిలో 13 మంది 62 ఏళ్లు పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ పొందారు.

**కొందరి తోడ్పాటుతోనేనా?**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తుడా నిబంధనలు న్యాయస్థానానికి నివేదించి ఉద్యోగ విరమణ వయసు 60 సంవత్సరాలుగా నిర్ధారించారు. అందుకు అనుగుణంగా హైకోర్టు గతనెల 8న తుది తీర్పు ఇస్తూ 60 సంవత్సరాలు నిండిన ఉద్యోగులందరూ విరమణ పొందాలని తీర్పునిచ్చింది. హైకోర్టు ఉత్తర్వులపై గతనెల 19న సుప్రీంకోర్టును ఆశ్రయించగా హైకోర్టు తీర్పునే సమర్థించింది. అయితే తుడా అధికారులు న్యాయస్థానాల ఉత్తర్వులు ధిక్కరించి జీతాలు కూడా చెల్లిస్తున్నారు. తుడాలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు నిబంధనల ప్రకారం 60 సంవత్సరాలకే ఉద్యోగ విరమణ చేస్తున్నారు. న్యాయస్థానం ఉత్తర్వులను ఖాతరు చేయకుండా అడ్డదారుల్లో తప్పించుకుంటున్న ఉద్యోగుల వెనుక సూత్రధారులు ఎవరనే అంశం తేలాల్సి ఉంది. తుడా అధికారులు వారిని ఇంకా ఉద్యోగాల్లో కొనసాగిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ఉక్కు సంకల్పం

అనకాపల్లి : దిగ్గజ ఉక్కు సంస్థ ఆర్సెలార్ మిత్తల్ నిప్పన్ పరిశ్రమ పనులకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. నక్కపల్లి మండలంలో రెండు దశల్లో దాదాపు రూ. 1.35 లక్షల కోట్లతో పరిశ్రమ నిర్మించనున్నారు. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా ఆర్థిక ప్రగతితోపాటు వేలాదిగా ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఇటీవలే దాదాపు అన్ని అనుమతులు పొందిన ఈ పరిశ్రమకు సంబంధించి కంపెనీపరంగా పలు పనులు మొదలయ్యాయి.

**ప్రధానితో శంకుస్థాపనకు ఏర్పాట్లు ...** మిత్తల్ ఉక్కుకు పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలంలోని డి.ఎల్.పురం, అమలాపురం, చందనాడ, బుచ్చిరాజుపేట తదితర ప్రాంతాల్లో 2,020 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఏడాది కాలంలోనే దీనికి అవసరమైన అన్ని రకాల అనుమతులు లభించాయి. అతి త్వరలోనే ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా శంకుస్థాపన చేయించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ లోగా తమ అవసరాల నిమిత్తం చేయాల్సిన పనులు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఐఐసీ) పర్యవేక్షణలో కంపెనీ ప్రతినిధులు చేపట్టారు.

**ముమ్మరంగా భూసార పరీక్షలు**

ఉక్కు పరిశ్రమకు కేటాయించిన భూముల మొత్తంలో అధికారులు సరిహద్దు గుర్తిస్తున్నారు. భారీగా స్తంభాల నిర్మాణం చేస్తున్నారు. మరోవైపు ప్లాంటు నిర్మాణానికి సంబంధించి మట్టి నాణ్యతకు సంబంధించిన పరీక్షలు పలు ప్రాంతాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన యంత్ర సామగ్రి భారీగా చేరుకుంది. ప్రస్తుతం చందనాడ, తమ్మయ్యపేట, మూలపర్ర, డి.ఎల్.పురం మట్టి సేకరించి నాణ్యత పరీక్షిస్తున్నారు. తద్వారా ఇక్కడి భూసామర్థ్యంపై ఓ నివేదిక తయారు చేయనున్నారు. మిత్తల్‌కు సంబంధించి



ఎగుమతులు, దిగుమతులు చేసుకునేందుకు డి.ఎల్.పురం క్యాప్టివ్ పోర్టు నిర్మాణం చేయనున్నారు.
తాజాగా ఉక్కు పరిశ్రమకు భూములిచ్చిన గ్రామాల నుంచి పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులను తీసుకుని అధికారులు గుజరాత్‌లో ఉన్న ఇదే కంపెనీ స్టీల్‌ప్లాంట్ సందర్శనకు వెళ్లారు. ఉక్కు పరిశ్రమ జిల్లాలో ప్రారంభమైతే.. దీనికి సంబంధించిన అనుబంధ పరిశ్రమలు రానున్నాయి. దీంతో సుమారు 80 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. 500 ఎకరాల్లో టౌన్‌షిప్... కంపెనీలో పనిచేసే ఉద్యోగుల అవసరాల నిమిత్తం సుమారు 500 ఎకరాల్లో టౌన్‌షిప్ ప్లాన్ చేస్తున్నారు. కంపెనీ రెండు దశల నిర్మాణం, టౌన్‌షిప్‌తో సహా కలిపి దాదాపు అయిదు వేల ఎకరాల అవసరమని ప్రతిపాదించారు. దీంతో మిగిలిన మూడు వేల ఎకరాల భూమికోసం నెల్లిపూడి, వేంపాడు, ఉద్దండపురం తదితర ప్రాంతాల్లో సేకరణకు కార్యాచరణ సిద్ధం చేశారు. రెండో విడత సేకరణపై మాత్రం ఆయా గ్రామాల ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి.

## కాసులు కురిపిస్తున్న కోణెం చేపలు

కాకినాడ : సముద్రం తీరంలో వేటకు వెళ్తున్న కాకినాడ మత్స్యకారులకు గత కొన్ని రోజులుగా లభ్యమవుతున్న కొమ్ముకోణెం, నెమలికోణెం, టూనా చేపలు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. గత వారం రోజులుగా భారీ కొమ్ముకోణెం చేపలు చిక్కుతున్నాయి. ఒక్కోటి సుమారు 6 నుంచి 8 అడుగుల పొడవుతోపాటు 150 నుంచి 250 కేజీల వరకు బరువు తూగడంతో మంచి ఆదాయాన్ని తెచ్చి పెడుతోంది. ఇక టూనా చేపలు కూడా పెద్దఎత్తున వలలకు చిక్కుతుండటంతో



వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. బుధవారం ఒక్కరోజే ఈ రకం చేపలు 60కుపైగా విక్రయింది. అందులో 240 కిలోల కొమ్ముకోణెం రూ.34 వేలు ధర పలికింది.

**ఇతర ప్రాంతాలకు ఎగుమతి**

మత్స్యకారులు తమ వలలకు చిక్కిన మత్స్యసంపదను బోట్ల ద్వారా కుంభాభిషేకం చేపల రేవుకు తరలించి నిత్యం అమ్మకాలు సాగిస్తుంటారు. వీటిని వ్యాపారులు వేలం పాటలో పాడుకుని వ్యాన్ల ద్వారా కోల్‌కతా, ఒడిశా వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.

## రూ.లక్షల్లో నిధులు.. ఒకేచోట పనులు

యర్రగొండపాలెం: మార్కాపురం జిల్లా, వై.పాలెం పట్టణంలోని ఎన్జీవో కాలనీపై అధికారులు, నాయకులకు ఎనలేని ప్రేమ కురిపిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా లేనివిధంగా ఒకే ప్రాంతంలో రూ.కోట్లు కుమ్మరిస్తున్నారు. పోనీ.. అక్కడ వందల ఇళ్లు ఏమైనా ఉన్నాయా అంటే అదీ లేదు. పదుల సంఖ్యలోనే ఉన్నాయి. కాకపోతే అందరూ బడా బాబులే.. వివరాల్లోకి వెళ్తే..

**ఎలాంటి అంచనాలు లేకుండానే..**

తాజాగా ఇక్కడో వింత చోటు చేసుకుంది. ఎలాంటి పని అంచనాలు, నిధుల మంజూరు లేకుండానే అత్యవసరమైన పనిలా దాదాపు రూ.25లక్షలలో 7 మీటర్ల వెడల్పుతో భారీ సీమ్సీ రోడ్డు వేశారు. వైకాపా ప్రభుత్వంలో మార్కాపురం రోడ్డునుంచి సాయిబాబా గుడి రోడ్డుకిరువైపులా రూ.20లక్షలతో డ్రైనేజీ నిర్మించగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.40లక్షల ఉపాధిహామీ నిధులతో ప్రత్యేక అనుమతులు తీసుకుని 7మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు వేసింది.
ఇటీవలే సాయిబాబా గుడి సమీపం నుంచి కొలుకుల రోడ్డుదాకా రూ.20లక్షల ఉపాధి నిధులతో డ్రైనేజీ నిర్మించారు. డ్రైనేజీతోపాటు అత్యవసరంగా సీసీ రోడ్డు వేశారు. దీనికి పంచాయతీరాజ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు, అంచనాలు, నిధుల మంజూరు లేదు.
15వ ఆర్థిక సంఘం కోసం చక్రం తిప్పుతున్నారు: ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ రోడ్డుకు నిధులు మంజూరయ్యేలా నాయకులు చక్రం తిప్పుతున్నారు. బడా బాబులుండే ఈ రెండు వీధుల్లోనే రెండేళ్ల వ్యవధిలో రూ.కోటికి పైగా ఖర్చు పెట్టారు. పట్టణంలోని చాలా ప్రాంతాల్లో వర్షమొచ్చిందంటే నడిచేందుకూ వీల్లేని పరిస్థితులున్నాయి. వీటిపై దృష్టిపెట్టని అధికారులు, నాయకులు ఒకే ప్రాంతంలో నిధులన్నీ ఎత్తిపోస్తుండడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై పీఆర్ ఏఈ రవీంద్రారెడ్డిని వివరణ కోరగా.. కొలుకుల రోడ్డు నుంచి సాయిబాబా గుడికి వేసిన రోడ్డుకు తమ శాఖ నుంచి అంచనాలుగానీ, నిధులుగానీ మంజూరు కాలేదన్నారు. రోడ్డు నిర్మాణానికి ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని పేర్కొన్నారు.

చురకలు



# సైకిల్‌పై చలో.. చలో..!

నర్సీపట్నం : విశాఖలో కాలుష్య కారకాలు పెరిగి, ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని నివేదికలు అందడంతో.. పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రజల ఆరోగ్యంతో పాటు, కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు వీలుగా సైక్లింగ్ ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురానున్నారు.

**సరైన నిర్వహణతోనే..**

గతంలో జీవీఎంసీ అధికారులు ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులతో ప్రతి వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్కు చుట్టూ ఉన్న సర్వీసు రహదారిలో 1.25 కిలోమీటర్ల మేర సైక్లింగ్ చేయించేవారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ప్రతి ఆదివారం నగరవాసులు ఆర్కేబీచ్ నుంచి పార్క్ హోటల్ వరకు 2.5 కిలోమీటర్లు సైక్లింగ్ చేసుకోవడానికి



ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత సరైన నిర్వహణ లేకపోవడంతో...అవి ముందుకు సాగలేదు.

ఇప్పుడు కొత్తగా ప్రతిపాదించే ప్రాజెక్టుకు మెరుగైన నిర్వహణ ఉంటేనే.. ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.ఎక్కడెక్కడ..: నగరంలో బీచ్‌రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్ నుంచి సాగర్‌నగర్ వరకు దాదాపుగా 1.9 కిలోమీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడానికి జీవీఎంసీ ప్రతిపాదించింది. అలాగే ముడసర్లోవ బీఆర్టీఎస్ రహదారి చుట్టు పక్కల 5 కిలోమీటర్లలో సైక్లింగ్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

# రేషన్ కార్డుదారులకు కొత్త కానుక

అనంతపురం : కూటమి ప్రభుత్వం కొత్త ఏడాది నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. జనవరి నుంచి కార్డుదారులకు అదనంగా సరకులు పంపిణీ చేయనుంది. అందుకు సంబంధించి అనంత జిల్లాకు కేటాయింపులు చేశారు. సరకులను ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌక దుకాణాలకు రవాణా చేస్తున్నారు. బియ్యం, చక్కెరతో పాటు రాగులు, జొన్నలు, గోధుమపిండిని లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. ఒకటో తేదీ నుంచి అందజేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

జిల్లాకు బియ్యం 9,783 టన్నులు, చక్కెర 334 టన్నులు, రాగులు 634 టన్నులు, జొన్నలు 559 టన్నులు వచ్చాయి. వాటితో పాటు గోధుమపిండి 43.57 టన్నులు వచ్చింది. ఒక కుటుంబం 25 కిలోల చొప్పున బియ్యం తీసుకుంటే అందులో మూడు కిలోలు చొప్పున బియ్యం తగ్గించి.. రాగులు లేదంట జొన్నలు కాని తీసుకోవచ్చు.

**గోధుమపిండి కిలో రూ.20**




బహిరంగ మార్కెట్‌లో గోధుమపిండి కిలో రూ.60 నుంచి 65 వరకు విక్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చౌకదుకాణాల్లో కిలో రూ.20కే ప్యాకెట్ రూపంలో అందించనుంది. కాగా తొలుత అనంత నగరంలో మాత్రమే గోధుమపిండి అందుబాటులో ఉంటుంది. జనవరి 2న జిల్లా కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గోధుమపిండి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు.

అనంత జిల్లాలో..

చౌక దుకాణాలు: 1,645

కార్డులు: 6,74,120

# మల్లప్ప నిబద్ధత.. ఆంగ్లేయుల కృతజ్ఞత

గుంతకల్లు: విధుల్లో చేరినప్పటి నుంచి విరమణ వరకు ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా చేయడం ఎవరికైనా సాధ్యమయ్యే పనేనా? కానీ సుసాధ్యమని నిరుపించారు మల్లప్ప. ఇది 208 ఏళ్ల కిందటి మాట. ఆంగ్లేయుల కాలంలో.. 1887 సంవత్సరంలో గుంతకల్లుకు 6 కి.మీ దూరంలో ఉన్న నంచర్ల రైల్వేగేట్ వద్ద పని చేయడానికి మల్లప్ప గేట్‌మెన్‌గా నియమితులయ్యారు. 1921 వరకు పని చేశారు. అదీ ఒక్కరోజు కూడా సెలవుపెట్టకుండా.. ఆయన సేవలను



గుర్తించి ఆంగ్లేయులు ఘనంగా సత్కరించారు. నీవేదైనా కోరుకుంటే దాన్ని నెరవేరుస్తామని పదవీ విరమణ రోజు అతన్ని అడగ్గా.. నంచర్లలో రైల్వేస్టేషన్ నిర్మించి.. రైలు ఆగేలా చూడాలని కోరారు. ఆ విన్నపం మేరకు స్టేషన్‌ను నిర్మించి దానికి ఆయన పేరే పెట్టారు. అంతేకాదు ఆయన మరణాంతరం సమాధి కట్టించి కృతజ్ఞతను చాటుకున్నారు ఆంగ్లేయులు. మల్లప్ప దయ వల్లే తమకు రైళ్లలో ప్రయాణించే భాగ్యం దక్కిందని ఇప్పటికీ ఆ గ్రామస్థులు తలుచుకుంటున్నారు.

# హాస్టళ్లు బాగానే ఉన్నాయా?



నర్సీపట్నం : హాస్టళ్ల పనితీరుపై ఆరా ప్రారంభమైంది. వీటిలోని సదుపాయాలు, వార్డెన్ల విధుల తీరు తదితర వాటిపై పరిశీలన కొనసాగుతోంది. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్‌ఎస్) ద్వారా ఈ గృహాల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. వీటి ఆధారంగా సేవలు సంతృప్తికరంగా లేని చోట అవి మెరుగుపడేలా చూడటంతోపాటు అధికారులు మరింత బాధ్యతగా పనిచేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ విధానంతో వార్డెన్లు ఇప్పుడు మరింత జాగ్రత్తలతో అన్నీ సరిచూస్తున్నారు.

గతంలో వసతి గృహాల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. దీంతో ఇవి అవకతవకలకు నిలయాలుగా మారాయి. శిథిల భవనాలు, సదుపాయాల లోపంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. కూటమి సర్కారు వీటి ప్రక్షాళనకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఇప్పటికే అభివృద్ధి దిశగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఇవి ఇప్పుడు పక్కాగా అమలవుతోంది లేనిది నిగ్గు తేల్చేందుకు ఐవీఆర్‌ఎస్‌ను వినియోగిస్తున్నారు. దీని పుణ్యమా అంటూ హాస్టళ్లో అన్నీ పక్కాగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఐవీఆర్‌ఎస్‌లో తమకు వ్యతిరేకంగా సమాచారం వెళ్లే పరిస్థితి రాకుండా ముందస్తుగా అప్రమత్తం అవుతున్నారు. జిల్లాలో 65 శాతం నిర్వహణ మెరుగ్గా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు వార్డెనులు గృహాల్లో అన్నీ పక్కాగా చూసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులతోనూ ఎంతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తున్నారు. నర్సీపట్నంలోని ఒక వార్డెను తన హాస్టల్ పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులతో వాట్సాప్‌లో ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసుకుని అన్ని కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ఫొటోలు తీసి వారికి పంపుతున్నారు. హాస్టల్‌లోని సేవలు మరింత మెరుగుపడడానికి ఈ విధానం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి రామానందం తెలిపారు.

జిల్లాలోని మొత్తం 135 సంక్షేమ వసతి గృహాల్లోని వేలాది మంది విద్యార్థులకు ఈ విధానం వల్ల ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం అమలవుతున్న... ఫీడింగ్ శాతాన్ని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఏ జిల్లా ఏ స్థానంలో ఉన్నది గమనిస్తున్నారు. ఇందులో హాస్టళ్లలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, స్వచ్ఛమైన తాగు నీరు సమకూర్చారా.. భవనాల పరిస్థితి ఎలా ఉంది. వార్డెన్ సక్రమంగా విధులు నిర్వహిసున్నారా, పారిశుద్ధ్యం ఎలా ఉంది వంటి ప్రశ్నలకు తల్లిదండ్రుల నుంచి సమాధానాలు తెలుసుకుంటున్నారు.

# టిఫా.. సొమ్ములు సఫా



ఆదోని : ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో టిఫా స్కానింగ్ సేవలు అందుబాటులో లేక గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. గర్భంలో బిడ్డ ఎదుగుదల.. అవయవాల పనితీరు తెలుసుకొనేందుకు టిఫా (టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ ఫీటల్ అనామలైస్) స్కానింగ్ కీలకం. టిఫా స్కానింగ్‌తో బిడ్డ అవయవాల కదలికలు, ఎదుగుదల తెలుసుకోవచ్చు. జిల్లా కేంద్రం తప్ప.. మిగిలిన చోట్ల వీటి సేవలు అందుబాటులో లేవు. ఇదే అదనుగా ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు దోచుకొంటున్నారు.

**నిత్యం రూ.6 లక్షల వ్యాపారం**

కర్నూలులో వంద, నంద్యాలలో 20, ఆదోనిలో మూడు స్కానింగ్ కేంద్రాలున్నాయి. ఒక్కో స్కానింగ్ పరీక్ష ధర రూ.1500- రూ.2 వేలు ఉంది. కర్నూలులో 20-25 మంది, నంద్యాల 15-20, ఆదోనిలో 10-15 మంది రోజూ స్కానింగ్ సేవల నిమిత్తం వెళుంటారు. ఈ లెక్కన సుమారు 300 మందికి రోజుకు రూ.6 లక్షల చొప్పున నెలలో 25 రోజులకు రూ.1.50 కోట్లు, ఏడాదికి లెక్కిస్తే రూ.18 కోట్లు జనం స్కానింగ్ సేవల కోసం ఖర్చు చేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా.. ప్రభుత్వం మాత్రం సేవలు విస్తరించడం లేదు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోని యంత్రాలతో టిఫా స్కానింగ్ పరీక్షలు చేసే వీలుంది. సరైన నిపుణులు లేకపోవడంతో ఈ సేవలు అందుబాటులోకి రావడం లేదు. కర్నూలు, నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రుల్లో తప్ప మరెక్కడా రేడియాలజిస్టులు లేరు.

నంద్యాల ఆస్పత్రిలో ఒక్కటే స్కానింగ్ యంత్రం అందుబాటులో ఉంది. ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, బనగానపల్లి, కోవెలకుంట్ల వంటి పెద్ద పట్టణాల్లో ఈ సేవల ఆచూకే లేదు.

మిగిలిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులున్నా.. వారికి స్కానింగ్ మెలకువలు తెలుసుకోవడంలో సరైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం లేదు. కొందరిని ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తే.. అన్ని రకాల పరీక్షలు స్థానిక పట్టణాలు, మండల కేంద్రాల్లోనే అందించవచ్చనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి.

**ఏటా 65 వేల ప్రసవాలు**

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కలిపి ఏటా 60-65 వేల ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రతి నెలా సీహెచ్‌సీలలో సాధారణ స్కానింగ్ సేవలు అందిస్తున్నారు. స్థానికంగా టిఫా సేవలు అందుబాటులో లేకపోవడం, కర్నూలు, నంద్యాల కేంద్రాలు దూరాభారం కావడం, అందులోనూ గర్భిణులు ప్రయాణ సమయంలో ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉంటుందనే ఉద్దేశంతో స్థానికంగానే ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒక్కో పరీక్షకు సుమారు 15-25 నిమిషాల సమయం పడుతుంది.

ప్రతి నెలా సాధారణ వైద్య పరీక్షల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తారు. ఇక్కడే వైద్యులు టిఫా స్కానింగ్ సేవల కోసం ఫలనా కేంద్రాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. ఇలా సూచించినందుకు కమీషన్లు, నజరానాలు పొందుతున్నారు. దీంతో జనమంతా ప్రైవేటు బాట పట్టాల్సి వస్తోంది.

# ఖనిజ నేలల్ని 'గుట్ట'గా రాసిచ్చేశారు

నంద్యాల : బేతంచెర్ల మండలంలో గత వైకాపా సర్కారు హయాంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ అడ్డూఅదుపు లేకుండా కొనసాగింది. ఎర్రమల కొండలను ఇష్టానుసారం పంచేసుకున్నారు. అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పడకుండానే వందల ఎకరాల భూములను తమ వర్గీయులకు కట్టబెట్టారు. ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా 2022 నుంచి 2024 ఫిబ్రవరి వరకు అడ్డగోలుగా డీకేటీ పట్టాలు పంపిణీ చేశారు. సేద్యానికి పనికిరాని కొండలు, గుట్టల్లోనూ పట్టాలు ఇచ్చారు. గత ప్రభుత్వంలో 'రాజా'గా పేరుగాంచిన అప్పటి ప్రజాప్రతినిధి సొంత మండలంలోనే కొనసాగిన ఈ భూ పందేరం ఆయన ఆదేశాలతోనే జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి.

అసైన్‌మెంట్ కమిటీ లేకుండానే భూములను పంపిణీ చేయడానికి అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు తప్పనిసరి. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సిఫార్సు చేసిన వారికే భూములను పంపిణీ చేయాలి.

బేతంచెర్ల మండలంలో పంపిణీ చేసిన 832.24 ఎకరాలకు సంబంధించి అసైన్‌మెంట్ కమిటీ సిఫార్సు చేయలేదు. అసలు ఇక్కడ అసైన్‌మెంట్ కమిటీనే ఏర్పాటు కాలేదు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనగా.. 10 గ్రామాల పరిధిలో 502 మందికి 832.24 ఎకరాల భూమిని హడావుడిగా పంపిణీ చేశారు. అప్పటి డిప్యూటీ తహసీల్దారు (తహసీల్దారు ఎఫ్‌ఏసీ) పి.సత్యదీప్ అసైన్‌మెంట్ పట్టాలను పంపిణీ చేశారు. అసైన్‌మెంట్ కమిటీ సిఫార్సు లేకుండా పెండేకల్లు, గొర్లగుట్ల, యంబాయి, ఆర్ఎస్ రంగాపురం తదితర గ్రామాల్లో పంపిణీ చేశారు. లబ్ధిదారుల పేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కించారు. ఈ విషయం రెవెన్యూ శాఖలో సంచలనంగా మారింది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో స్పందించిన అధికారులు సత్యదీప్‌తో పాటు బేతంచెర్ల తహసీల్దారు, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలకు కూడా తాఖీదులు



జారీ చేశారు. దీనిపై సత్యదీప్ ఇటీవలే నంద్యాల కలెక్టరేట్‌కు వచ్చి వివరణ ఇచ్చారు.

**వైకాపా నేతల ముందస్తు వ్యూహం**


గత వైకాపా ప్రభుత్వంలో డోన్ నియోజకవర్గంలోని ఒక్క బేతంచెర్ల మండలంలోనే 3,766 మంది లబ్ధిదారులకు 7687.21 ఎకరాలు పంపిణీ చేశారు. ఇందులో వ్యవసాయ యోగ్యం కాని భూమినే ఎక్కువగా ఇచ్చారు. ఎన్నికల్లో లబ్ధి పొందే ఉద్దేశంతోనే ఇలా చేశారన్న విమర్శలున్నాయి. లబ్ధిదారుల్లో నిరుపేదల కన్నా వైకాపా సానుభూతి పరులు, కార్యకర్తలు.. ఒకవర్గం నాయకులు సూచించిన వారే ఎక్కువగా ఉన్నారు. గూటుపల్లె, ముద్దవరం, బుగ్గానపల్లె, పెండేకల్లు గ్రామాల్లో వైకాపా సానుభూతిపరులకు పంపిణీ చేసిన భూమి సాగు యోగ్యమైంది కాదు. దీనికి సమీపంలోనే ఇనుప ఖనిజం తవ్వకాలు సాగుతుండటంతో వ్యూహం ప్రకారమే ఈ భూములను తమవారికి పంపిణీ చేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు పెండెకల్లు, రంగాపురం తదితర గ్రామాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. వాటి సమీపంలోనే పట్టాలు ఇవ్వడం గమనార్హం.

# పురోగమన సూత్ర.. పురమిత్ర

అనంతపురం : చరవాణిలో పురమిత్ర యాప్ ఉంటే చాలు నగర, పురపాలకల్లో ఉన్న 8 విభాగాలకు సంబంధించి 119 సమస్యలను పరిష్కరించే వీలుంది. ప్రజాసమస్య, వ్యక్తిగత సమస్య ఇలా ఏ తరహా అయినా ఫొటో తీసి పంపగానే సంబంధిత విభాగాల అధికారులకు వెళుతుంది. వెంటనే వారు వచ్చి పరిష్కరిస్తారు. మీరు చేయాల్సిందల్లా 'పురమిత్ర' యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకొని ఫొటో సంధించడమే..

ఉదాహరణకు అనంతపురం నగరం, ఉమ్మడి జిల్లాలోని ఏ పురపాలకలో అయినా ఏ ప్రాంతంలో అయినా రోడ్ల మీద గుంత ఉంటే పురమిత్ర యాప్ ద్వారా ఫొటో పంపొచ్చు. దోమలు, కుక్కల బెడద, పైపులైను లీకేజీ, పారిశుద్ధ్యం ఇలా ఒకే తరహా సమస్య ఒకే ప్రాంతానికి సంబంధించి ఐదు కంటే ఎక్కువగా యాప్‌లో ఫిర్యాదులు అందితే అది అత్యవసరం (హాట్ స్పాట్)గా చూపుతుంది. ఆరెంజ్ సంకేతం కమిషనర్ల లాగిన్‌లో చూపుతుంది. ఉదయం కమిషనర్లు పర్యటించే సమయంలో ముందు ఆ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తారు. పరిష్కరించిన అనంతరం హాట్ స్పాట్ ఆకుపచ్చ రంగులోకి మారుతుంది.

అనంతపురం నగరంలో యాప్ తీసుకొచ్చిన 5 నెలల్లో 932 ఫిర్యాదులు




నమోదు అయ్యాయి. ఇందులో 868 పరిష్కారం కాగా ఇంకా 64 పరిష్కరించాల్సి ఉంది.

**వినియోగం.. సేవలు సులభం**

ఆండ్రాయిడ్ ఫోన్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి సెర్చిలో పురమిత్ర యాప్ అని టైప్ చేయాలి. ఆకుపచ్చ, పసుపు రంగుల్లో తెలుగు, ఇంగ్లీషు భాషల్లో లోగో కనిపిస్తుంది. ఇన్‌స్టాల్ చేసుకొని ఓపెన్ చేయగానే ఫోన్ నంబరు అడుగుతుంది. ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేయగానే పేరు, పురపాలిక, మీరు ఉన్న వార్డు సచివాలయం వివరాలు ఎంట్రీ చేయాలి.

యాప్‌లో పై భాగాన తొలిసారి నమోదు చేసిన ప్రాంతం ఉంటుంది. అక్కడ క్లిక్ చేస్తే మిగిలిన నగర, పురపాలికల పేర్లు కన్పిస్తాయి.

యాప్‌పై భాగాన ఉన్న 8 విభాగాల్లో మీకు అవసరం ఉన్న దాన్ని క్లిక్ చేస్తే అందులోని ఉపవిభాగాల్లో సమస్యను ఎంపిక చేసుకొని ఫొటోలు అప్‌లోడ్ చేయవచ్చు. వాయిస్ రికార్డు లేదా అక్షరాలు టైప్ చేసి వివరాలు నమోదుకు వీలుంది.

ఉమ్మడి జిల్లాలో పురపాలికలు: 12

పరిధిలో జనాభా: 13,62,117

# 'కరి' మింగిన వెలగలా పరిహారం

పలమనేరు : అరకొర పరిహారంతో ఏనుగుల దాడుల్లో నష్టపోయిన రైతులు కుదేలవుతున్నారు. అంచనాల మదింపులో అటవీ అధికారులు అన్యాయం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే పరిహారం పెంచినా అది చాలట్లేదని, రూ.లక్షల్లో నష్టపోతే రూ.వేలల్లో చెల్లిస్తున్నారంటూ వాపోతున్నారు. ఆరేళ్లలో వివిధ పంటలకు సంబంధించి 4,778 ఎకరాల్లో పంటనష్టం జరగ్గా రూ.4.93 కోట్లు చెల్లించారు. ఇది సగటున ఎకరాకు రూ.10 వేల వరకు మాత్రమే. ఎకరా వరి సాగుకు ఖర్చులన్నీ కలిపి రూ.40 వేలు అవుతుండగా అధికారులు నష్టం జరిగిన ప్రాంతంకంటే కొలతలు తక్కువ వేస్తున్నారని, మార్కెట్ ధర కంటే తక్కువగా పరిహారం ఇస్తున్నారని వాపోతున్నారు. పశువులు మరణిస్తే మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం ఇస్తుండటం కొంత ఊరటనిస్తోంది. ఆరేళ్లలో పశు మరణాలు 38 నమోదవగా వాటికి రూ.7.8 లక్షలు చెల్లించారు.

రూ.1.50 లక్షలు నష్టపోతే రూ.7 వేలిచ్చారు

ఏనుగులు గతేడాది నా పొలంలోని పది కొబ్బరి చెట్లు విరిచేశాయి.



అందివచ్చిన పంటనూ ధ్వంసం చేశాయి. అప్పట్లో కొబ్బరి చెట్టు విలువ రూ.10 వేలు కాగా పది చెట్లకు రూ.లక్ష.. కాగా పంటలకు మరో రూ.50 వేలు నష్టం వాటిల్లింది. అధికారులు మాత్రం రూ.7 వేలు ఇచ్చారు.

**అమ్ములు, మొగిలేపల్లె, గంగవరం**

దాడులు జరగకుండా చూస్తాం..

ప్రభుత్వం రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో ఉదారంగా వ్యవహరిస్తోంది. గతంలోకంటే ఎక్కువ ఇస్తోంది. ఎక్కడా జాప్యం చేయడం లేదు. ఏనుగులు పంటలపై దాడులు చేయకుండా చర్యలు తీసుకుంటాం. రైతులకు నిబంధనల మేరకు న్యాయం చేసి ఆదుకుంటాం.

# చెత్త మాది.. వస్తువు మీది..!!

ఒంగోలు : ఇంట్లో చెత్త పారవేయకండి.. ఆ చెత్తతో మీకు కావాల్సిన వస్తువులు తీసుకోండంటూ కూటమి ప్రభుత్వం పిలుపునిస్తోంది. ప్రతి ఇంటికి స్వచ్ఛ రథాలను పంపించనుంది. సిబ్బందికి చెత్త ఇస్తే బియ్యం, కొబ్బరి నూనె, సబ్బు, షాంపు, పప్పులు, గోధుమ, జొన్న, రాగి పిండి, చక్కెర, ఉప్పు బెల్లం తదితర వస్తువులు అందిస్తారు. జిల్లాలో స్వచ్ఛరథాలు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. జిల్లాలో 30 మండలాలకు 912 పంచాయతీలకు గాను మొదటి దశలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 8 నియోజకవర్గాలకు 8 స్వచ్ఛరథాలు అందిస్తారు. రెండో విడతలో ఎనిమిది నియోజకవర్గంలో 12 స్వచ్ఛరథాలు, మూడో విడతలో అన్ని మండలాలకు స్వచ్ఛరథాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. పట్టణ, గ్రామాల్లో కొత్తగా స్వచ్ఛరథాలు రావడం వల్ల కాలువలతో, బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్, ఇతర ఘన వ్యర్థాలు తగ్గే అవకాశం ఉ



ంటుంది. స్వచ్ఛరథాలు ఒప్పందం చేసుకున్న ఆపరేటర్ చెత్తను తీసుకుని నిత్యావసరాలు ఇవ్వాల్సి ఉంటుంది.

వాహనానికి జీపీఎస్ పరికరం అమర్చకపోతే రోజుకు రూ.వెయ్యి, చెత్తను సేకరించకపోయినా తక్కువ సేకరించినా ఒక్కో తప్పునకు రూ.5వేల నుంచి రూ. 10వేలు, నెలలో ఆరు రోజులు వరుసగా నడపకపోయినా, 25 రోజులకు తక్కువగా వాహనం నడిపినా రోజుకు రూ. 2వేలు, సరిగా చెత్తను తరలించకపోతే ఒక్కో తప్పునకు రూ. 100 నుంచి రూ. 1000 జరిమానా విధిస్తారు.

స్వచ్ఛరథాల తో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రత నెలకొంటోందని పంచాయతీ వనరుల కేంద్రం జిల్లా సమన్వయకర్త కె. నిశ్చల తెలిపారు.

# అతివలకు శిక్షణ.. ఆర్థిక రక్షణ!

సంతనూతలపాడు: ప్రస్తుతం రోజురోజుకీ పెరిగిపోతున్న ఖర్చులతో ఇల్లు గడపడం కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో పది, ఇంటర్, డిగ్రీ తదితర చదువులు చదివిన గృహిణులు, యువతులు తమ కాళ్లపై తాము నిలబడేలా స్వయం ఉపాధి కోర్సులపై మొగ్గు చూపుతున్నారు. వీరికి ఎన్ఎస్పాడు మండలంలోని ఎండ్లూరుడొంకలో గల మహిళా ప్రాంగణం వేదికగా నిలుస్తోంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ హబ్ ఆధ్వర్యంలో మహిళలకు కంప్యూటర్లో ఎకౌంట్స్, టాలీ తదితర కోర్సులను నేర్పిస్తున్నారు. ఇప్పటి వరకు 13 బ్యాచ్లల్లో 410 మంది వరకు శిక్షణ పొందగా.. పలువురు ఉద్యోగాలు సాధించి విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం శిక్షణకు హాజరవుతున్న మహిళలు తమ అభిప్రాయాలను పంచుకున్నారిలా..

**కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటున్నా..**

నా పేరు బి.సరిత. మాది ఎండ్లూరు. డిగ్రీ పూర్తి చేసి ఇంట్లో ఖాళీగా ఉంటున్నాను. నా భర్త ప్రైవేటు జాబ్ చేస్తున్నారు. కుటుంబానికి నేను కూడా చేదోడుగా ఉండాలని భావించి శిక్షణలో చేరాను. గతంలో ఒక ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్లాను. కంప్యూటర్ నాలెడ్జ్ ఉ



ంటే బాగుంటుందని భావించి మహిళా ప్రాంగణంలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారనే సమాచారంతో మూడు నెలల పాటు టాలీ, అడ్వాన్స్ ఎక్సెల్, ఎకౌంట్స్ విభాగంలో తరగతులకు హాజరవుతున్నా.

**బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేస్తా..**

నా పేరు ఎం.డి.నేహాబేగం, మాది చీమకుర్తి. డిగ్రీ వరకు చదువుకున్నా. నాతోపాటు పాటు మరికొంత మందికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నాను. నా భర్త ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలో ఉచితంగా ఇస్తున్న బ్యూటీషియన్ కోర్సులో రెండు వారాల నుంచి తరగతులకు హాజరవుతున్నా. ఇక్కడ బాగా నేర్చుకొని సొంతంగానే బ్యూటీపార్లర్ ఏర్పాటు చేస్తాను.

# వైద్యసేవలకు పరీక్షే

ఒంగోలు : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలకు అవసరమైన రసాయనాలు (రీఏజంట్స్) కొరతతో గత మూడు నెలలుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నామమాత్రంగా జరుగుతున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశాల ప్రకారం 64 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉండగా, సగం కూడా జరగడం లేదు. జిల్లాలో 60 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా, కొన్నిచోట్ల అడపాదడపా రీఏజంట్ కిట్లు ఉండగా, మిగతాచోట్ల పూర్తిగా అయిపోయాయి. వైద్య, ఆరోగ్యశాఖ సెంట్రల్ స్టోర్ ద్వారా కొన్ని నెలలుగా అవసరం మేరకు సరఫరా జరగడంలేదు. త్రిపురాంతకం, బేస్తవార పేట, మోక్షగుండం, తిప్పాయిపాలెం, కృష్ణంశెట్టిపల్లి, జరుగుమల్లి, అమ్మనబ్రోలు పీహెచ్సీల్లో రసాయనాలు పూర్తిగా అయిపోయి రక్త పరీక్షలు జరగడంలేదు. గత ప్రభుత్వంలో ఎర్బా కంపెనీతో పీహెచ్సీలకు రక్త పరీక్షలు చేసే యంత్రాలు, రీఏజంట్స్ సరఫరా చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వం మారాక ఆ కంపెనీ రీఏజంట్స్ సరఫరా సక్రమంగా చేయడంలేదు. దీంతో వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యామ్నాయంగా ఇతర కంపెనీల రీఏజంట్స్ను కొనుగోలు చేసి పీహెచ్సీలకు సరఫరా చేస్తోంది. ఎర్బా కంపెనీ సరఫరా చేసిన యంత్రంలో వేరే కంపెనీ రీఏజంట్లు కంప్యూటర్ ప్రోగ్రాం సపోర్టు చేయడం లేదని ల్యాబ్ టెక్నీషియన్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని కంపెనీ ఇంజినీర్ దృష్టికి తీసుకురాగా తమ కంపెనీ రీఏజంట్లు వాడితేనే సపోర్టు చేస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయంగా ఇచ్చిన ఇతర కంపెనీల కిట్లు కూడా అందుబాటులో లేక సిబ్బంది చేతెలెత్తేస్తున్నారు. ఈ విషయమై డీఎంహెచ్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇండెంట్ పెట్టిన వారందరికీ రీఏజెంట్స్ సరఫరా చేస్తున్నామన్నారు. పీహెచ్సీలకు మల్టీ మిషన్లు ఇచ్చారని, ఏ రీఏజంట్ కిట్ అయినా వినియోగించవచ్చునన్నారు.

# పడితే కన్ను..మాయమే మన్ను!



మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మన్ను కోసం అక్రమార్కులు బరితెగిస్తున్నారు. నిన్నటి మొన్నటి వరకు ఆయకట్టు చెరువులను కొల్లగొట్టి మట్టిని దోచుకున్న అక్రమార్కులు దేవాదాయ, అసైన్మెంట్ భూములు, కొండలను కొల్లగొడుతున్నారు. పొలాల సమీపంలో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతుండడంతో రాకపోకలకు దారే లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. మట్టి తవ్వకాలతో పడిన భారీ గుంతల్లో చేరిన తమ పొలాలన ముంచెత్తుతున్నాయని కన్నీటి పర్యంతమవుతున్నారు. మట్టి తరలించేవారిని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**దేవాదాయ భూముల్లోనూ...**

మార్కాపురం మండలం గోగులదిన్నె పరిధిలోని సుంకేసుల వెలుగొండ నిర్వాసితుల కాలనీ సమీపంలో మార్కండేశ్వరస్వామి ఆలయానికి నాలుగెకరాలుండగా, దీని పక్కనే అసైన్మెంట్ భూమి మరో 2.50 ఎకరాలుంది. ఇక్కడ అక్రమార్కులు భారీగా మట్టి అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. తవ్వకాలతో తమ పొలాలకు వెళ్లడానికి దారి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెన్నరాయునిపల్లె-కేతగుడిపి రహదారి పక్కన 15 అడుగుల మేర మట్టి తవ్వకాలు చేపట్టినట్లు ఆందోళన చెందుతున్నారు.

**కరిగిపోతున్న కొండలు**

మట్టి తవ్వకాలతో మార్కాపురంలో కొండలు, గుట్టలు తరిగిపోతున్నాయి. మార్కాపురం మండలం కోలభీమునిపాడు గ్రామసమీపంలోని ముద్ద సానమ్మ గండి వద్ద ఉన్న కొండను ఇప్పటికే కొల్లగొట్టారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా తవ్వకాలు జరుపుతున్నారు. ఇదే మండలం చింతకుంట నుంచి ఎల్బీఎస్ నగర్కు వెళ్లే రహదారిలోని కొండ వద్ద తవ్వకాలతో 320కేవీ విద్యుత్తు లైన్ ప్రమాదంలో పడింది. దరిమడుగు గ్రామసమీపంలోని నిర్వాసితుల కాలనీ వద్ద ఉన్న కొండను సైతం ఇష్టానుసారంగా తవ్వేశారు. దీనికి పక్కనే ఉన్న మాబుసాహెబ్ కుంటను సైతం చెరబట్టారు. మట్టి అక్రమ తవ్వకాల ద్వారా రోజుకు రూ. 3 నుంచి రూ. 4 లక్షల వరకు సంపాదిస్తున్నారు. టిప్పరుకు రూ. 4 వేల నుంచి రూ. 4,200 వరకు వసూలు చేస్తున్నారు.

మా పొలాలకు దారి లేకుండాపోయింది : గోగులదిన్నె గ్రామపరిధిలోని వెలుగొండ నిర్వాసితుల కాలనీ సమీపంలో అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. మా పొలాల పక్కనే తవ్వకాలు చేపడుతుండడంతో దారి కూడా లేకుండాపోయింది. మట్టి తవ్వకాలతో పడిన గుంతల్లో చేరిన నీరు మా పొలాలను ముంచెత్తుతోంది. అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయాలి.
బత్తుల రమణారెడ్డి, రైతు

# పురపాలికను పంచుకున్నారు!



అమలాపురం : గత ప్రభుత్వంలో వైకాపా నేతలు అమలాపురం పురపాలక సంఘంలో ఇష్టారీతిన వ్యవహారాలు సాగించారు. ఖజానాలో ఉన్న అరకొర నిధులను ఖాళీచేయించేశారు. తమ అనుచరులకు ఇంటి, నీటి పన్నుల నుంచి మినహాయింపు ఇప్పించారు. వారికి వాణిజ్య దుకాణాలను కట్టబెట్టి అద్దె, లీజు సొమ్ములకు గండి గొట్టారు. ఇవన్నీ ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి.

**నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టి..**

పురపాలికలో సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనుల్లో నిబంధనలు పాటించలేదు. కొన్నింటికి సింగిల్ టెండర్లకు అనుమతులిచ్చేశారు. మరికొన్నింటిని అనుయాయులకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టేశారు. వాస్తవానికి రూ. 10 వేలు మించిన పనికి టెండర్ పిలవాలి. కౌన్సిల్లో అత్యవసరమంటూ ప్రతిపాదన పెట్టడం, పనులు జరిగిన మూడు నాలుగు నెలలకు గాని ఎం.బుక్లో నమోదు చేయకపోవడం గమనార్హం.

**నిధులు మళ్లించేసి..**

పన్నుల రూపంలో చెల్లించిన సొమ్మును ప్రజా సమస్యల పరిష్కారానికే వినియోగించాలి. 2023-24లో పురపాలక నిధుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పథకాల పేరిట వైకాపా ప్రచారానికి రూ. 25.27 లక్షలు మళ్లించేశారు. కూటమి సర్కారు వచ్చాక పాత బకాయిలపై దృష్టిసారించి నోటీసులు జారీచేస్తున్నారు. బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పథకాలతో అక్రమాలను సక్రమం చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇటీవల అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు కొందరు ముందుకు వచ్చారు.


**ఆదాయానికి ఎసరు..**

అమలాపురం మున్సిపల్ వాణిజ్య సముదాయంలో సగం దుకాణాలు వైకాపా నేతల అనుచరులకే ఇచ్చి లీజు, అద్దె సక్రమంగా వసూలు చేయలేదు.

**షాపింగ్ కాంప్లెక్స్ నుంచి రూ. 24.92 లక్షల అద్దె రావాలి.**

హొటళ్లు, వాణిజ్య అవసరాలకు తాగునీరు సరఫరా చేశారు. నీటి పన్ను బకాయి రూ. 1.88 కోట్లు ఉంది. 1 నుంచి 14 వార్డుల్లో 2,106 ఖాళీ స్థలాలున్నాయి. వీఎల్టీ రూపేణా రూ. 3.10 కోట్లు రావాల్సి ఉన్నా నేతల ఒత్తిళ్లతో రాలేదు. %-%27 అనధికార లేఅవుట్ల నుంచి ఓపెన్ స్పేస్, పది శాతం భాగస్వామ్య ఛార్జీలు రూ. 9.52 కోట్లు రావాలి. వాటిలో ఎక్కువ వైకాపా నేతలవే.

# ఆస్తిపై హక్కు.. మీకే దక్కు



కాకినాడ : గ్రామ కంఠాల్లో నివసిస్తున్న ప్రజలకు.. ఆస్తిపై హక్కు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'స్వామిత్వ' సర్వేను నిర్వహిస్తోంది. మొదటి విడత సర్వే పూర్తి కాగా, ప్రస్తుతం రెండో విడత శరవేగంగా జరుగుతోంది. చాలామంది ప్రజలు గ్రామ కంఠాల్లో నివసిస్తున్నారు. ముత్తాతలు, తాతలు, తండ్రుల నుంచి సంక్రమించిన ఈ స్థలాల్లోనే వారు ఇళ్లు కట్టుకున్నారు. దశాబ్దాలుగా వారు అక్కడ ఉంటున్నా, వాటికి సంబంధించి ఎటువంటి హక్కు పత్రాలు లేవు. బ్యాంకులు నుంచి గాని, ఇతర సంస్థల నుంచి రుణాలు తీసుకునేందుకు అవకాశముండదు. ఇటువంటి వాటిపై 'స్వామిత్వ' సర్వే ద్వారా స్థల యజమానులకు హక్కు కల్పించనున్నారు.

**అయిదుగురి సభ్యులతో సర్వే**

ప్రతి గ్రామంలో అయిదుగురు సభ్యుల బృందం సర్వే చేస్తోంది. గ్రామ పరిధిలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సర్వేయర్, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో ఈ బృందంలో ఉంటారు. వీరు గ్రామంలో పర్యటించి భూముల లెక్క తేలుస్తారు.

**డ్రోన్లతో పరిశీలన**

గతంలో డ్రోన్ల ద్వారా సర్వే చేసి మ్యాప్లు సిద్ధం చేశారు. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో నివాసాల కొలతలు సరిచూస్తున్నారు. గ్రామ కంఠంలో ఉన్న ప్రతి స్థలాన్ని స్వామిత్వలో నమోదు చేస్తారు. రెవెన్యూ గ్రామాల వారీగా నివాసాలు, జిరాయితీ, శ్మశానవాటికలు, ఇతర ప్రభుత్వ భూములన్నింటినీ సర్వే చేస్తారు. నివాస స్థలాల హక్కుదార్లకు యాజమాన్య కార్డులు జారీ చేస్తారు. జిరాయితీ భూముల్లోనూ పదికి మించి నివాసాలున్న వాటిని పరిగణనలోకి తీసుకుంటున్నారు.

**మార్చికి ప్రక్రియ పూర్తి**

స్వామిత్వ సర్వే ద్వారా గ్రామ కంఠ భూములు, ఆస్తులకు హక్కు కల్పించడం పేద ప్రజలకు మంచి అవకాశం. ఇకపై వారి ఆస్తులపై భరోసా కలుగుతుంది. వచ్చే మార్చి నాటికి మొత్తం సర్వే ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. - రవికుమార్, డీపీవో, కాకినాడ

# తటాకాలకు పెద్దపీట

ఒంగోలు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధిహామీ పథకం నిధులతో ఇప్పటికే పల్లెల్లో సీసీ, బీటీ, మట్టి రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టింది. తాజాగా గ్రామాల్లోని చెరువుల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇందుకు వాటర్షెడ్ పథకం కింద నిధులు కేటాయించనుంది. ఇందులో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన అయిదు చెరువుల అభివృద్ధితోపాటు పార్కు, ఓపెన్ జిమ్, మొక్కల పెంపకం తదితర పనులతో సుందరంగా తీర్చిదిద్దనుంది. మిగతా చెరువులకు ప్రాధాన్యం ఇవ్వనుంది.

**ఒక్కోదానికి రూ. 50 లక్షలు**

సంప్రదాయ చెరువుల అభివృద్ధిలో భాగంగా 5 వేల జనాభా పైబడి, కనీసం పదెకరాల విస్తీర్ణం పైబడిన వాటిని గుర్తించారు. ఇందులో భాగంగా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం, కొత్తపట్నం, పామూరు, కొమరోలు, తర్లుపాడు పంచాయతీలను ఎంపిక చేశారు. టి.నాయుడుపాలెం మినహా, మిగతా వాటి ఎంపికకు సంబంధించి మండల కేంద్రాల్లో ప్రాధాన్యమిచ్చారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటుతోపాటు



చెరువు పక్కనే పార్కు ఉండేవిధంగా ప్రణాళిక చేయనున్నారు. ప్రత్యేకంగా ఆహ్లాదకరంగా ఉండేలా మొక్కలు నాటడంతోపాటు సిమెంటు బల్లలు తదితర వసతులు కల్పించనున్నారు. పార్కు ఏర్పాటు ద్వారా గ్రామానికి కొత్త అందాలు రానున్నాయి. ఒక్కో చెరువును సుమారు రూ. 50 లక్షలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో చేపట్టనున్న పనులకు జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులు అంచనాలు తయారు చేశారు. దీని కోసం డ్వామా మండల, జిల్లా అధికారులు ముందుగా స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదించి వారి సలహాలు తీసుకున్నారు. అనంతరం నిర్మాణ పనులను జిల్లా పంచాయతీరాజ్శాఖకు అప్పగించనున్నారు. ఈ మేరకు త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు డ్వామా పీడీ జోషఫ్కుమార్ తెలిపారు.

# ఊరన్నారు.. నూరన్నారు

కొయ్యలగూడెం : ఇళ్లపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు భారీగా రాయితీ అవకాశం కల్పిస్తున్నా సూర్యఘర్ పథకం అమలు తీరు నత్తనడకను సాగుతోంది. జిల్లాలో ఐదు ఆదర్శ గ్రామాలను ఎంపిక చేసి నూరు శాతం యూనిట్లు ఏర్పాటు లక్ష్యంతో.. రూ.కోటి నజరానా కూడా ప్రకటించిన విషయం విదితమే. అంతాబాగానే ఉన్నా..పథకం అమలులో అంతులేని జాప్యం వినియోగదారులు ముందడుగు వేయడానికి వెనకాడాల్సి వస్తోంది.

శతశాతం ఇళ్లపై సౌర వెలుగులు చిందించి మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని ఐదు గ్రామాలను ఎంపిక చేశారు. సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ఇంటికి రూ. 78 వేలు వరకు రాయితీ ఇస్తుంది. అదే ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితమే. బీసీలకు రూ. 50 వేల వరకు అదనంగా రాయితీ కల్పిస్తున్నారు. నివాస గృహాలపైనే కాకుండా వాణిజ్య అవసరాలకు కూడా సౌర పలకల ఏర్పాటుకు ఈ రాయితీ వర్తిస్తుంది. ద్వారకాతిరుమలలో వాణిజ్య అవసరాలకు తొమ్మిది మంది, దుగ్గిరాల, చిననింద్రకొలనులో ఒకరుచొప్పున, కామవరపుకోటలో



ఆరుగురు దరఖాస్తు చేసుకోగా సోలార్ యూనిట్లు బిగించారు.

**మార్చిలోగా గడువు**

ఆదర్శ గ్రామాల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటుకు వచ్చే మార్చి గడువు. అయితే ఇప్పటికి 10 శాతం కూడా స్థాపించలేదు. కనీసం దరఖాస్తులు కూడా రాలేదు. ఇందుకు కారణం ప్రజలకు పూర్తి స్థాయిలో ఈ పథకంపై అవగాహన లేకపోవడమే. బ్యాంకులు కూడా సోలార్ పలకల ఏర్పాటుకు దరఖాస్తుదారులకు రుణాలు మంజూరు వేగవంతం చేయాల్సి ఉంది. 'యూనిట్ల స్థాపనకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. మార్చిలోగా లక్ష్యాన్ని చేరుకునేలా కృషి చేస్తున్నాం. బ్యాంకుల వద్ద జాప్యం నివరణకు మాట్లాడుతున్నాం' అని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్రాజు తెలిపారు.

# బిల్లు కావాలా..రూ.1000 ఇచ్చుకోండి..!

నిడదవోలు : ఉచిత ఇసుక మాటున.. లోడింగ్ ఛార్జీల పేరిట రేవుల్లో ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారు. బిల్లు ఇస్తే ఒక ధర.. లేకపోతే మరో ధరకు ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ర్యాంపుల నుంచి రహదారులపైకి ఇసుక లోడుతో వస్తున్న లారీలపై కేసులు నమోదు చేసి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. దీనిపై ఆగ్రహించిన లారీ యజమానులు రెండు రోజులుగా నిరసన చేపట్టి ఇసుక కోసం ర్యాంపులకు వెళ్లడం మానేశారు. దీంతో తవ్వకాలు నిలిచిపోయాయి.

చెల్లించాల్సింది రూ. 1900... వసూలు రూ. 5,500..

పెండ్యాల-కానూరు ఇసుక ర్యాంపులో ఆరు యూనిట్ల లారీకి టన్నుకు రూ. 95 చొప్పున లోడింగ్ ఛార్జీలు రూ. 1900 తీసుకోవాలి. బిల్లు కావాలంటే లోడింగ్ ఛార్జీ రూ. 5,500, బిల్లు లేకుండా అయితే రూ. 4,500 వసూలు చేస్తూ ర్యాంపుల నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారు.

**ఆర్డీవోకు ఫిర్యాదు..**

ఇసుక ర్యాంపుల వద్ద జరుగుతున్న అక్రమాలు, అనధికారిక వసూళ్లను నిలుపుదల చేసి లారీలపై జరిమానాలు విధించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీతంపేట, విజ్జేశ్వరం గట్టు సత్తెమ్మ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కొవ్వూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రాన్ని అందించారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానంలో బిల్లు రాస్తే ప్రభుత్వానికి టన్నుకు రూ. 23 వెళుతోందన్నారు. బిల్లు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీలకు రూ. 25 వేల వరకు అపరాధ రుసుము విధిస్తున్నారని వాపోయారు. ప్రతి లారీకి కనీసం రోజుకు ఆన్లైన్లో గాని, ఆఫ్లైన్లో గాని రెండు ట్రిప్పులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

చురకలు



## చీరకట్టులో సంయుక్త అందాలు.. ఆ సోయగానికి ఫిదా!

సంయుక్త మీనన్.. పవన్ కళ్యాణ్ హీరోగా రానా కీలక పాత్రలో పోషిస్తూ వచ్చిన భీమ్లా నాయక్ సినిమాలో రానాకి జోడిగా.. తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఇకపోతే పలు చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన ఈమె గత ఏడాది బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన అఖండ సీక్వెల్ అఖండ 2 సినిమాలో నటించి తన అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. ఇక ఈ ఏడాది శర్వానంద్ హీరోగా వచ్చిన నారీ నారీ నడుమ మురారి సినిమాలో హీరోయిన్గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సంక్రాంతి సందర్భంగా వచ్చిన ఈ సినిమా మంచి కామెడీ ఎంటర్టైన్మెంట్ మూవీ అని చెప్పవచ్చు. ఇకపోతే ప్రస్తుతం సంక్రాంతి సందర్భంగా థియేటర్లలోకి వచ్చిన నేపథ్యంలో మరొకవైపు తన అందంతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా పట్టుచీర కట్టుకొని అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా భిన్నభిన్నమైన ఫోజులు ఇస్తూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. సింపుల్ హెయిర్ స్టైల్ తో జడలో మల్లె పువ్వులు పెట్టుకొని చేతిలో తామర పువ్వు పట్టుకొని ఏదో ఆలోచిస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా పెద్ద పెద్ద జుంకాలతో తన అందాన్ని రెట్టింపు



చేసుకున్న ఈమె మెడలో ఏమీ లేకపోయినా తన అందంతో అభిమానులను ఆకట్టుకుంది..మొత్తానికైతే సంయుక్త మీనన్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్గా మారుతున్నాయి. 2016లో పాప్ కార్న్ అనే మలయాళం చిత్రంతో హీరోయిన్గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. తమిళ్, కన్నడ, తెలుగు సినిమాలలో నటిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది. భీమ్లా నాయక్ సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈమె.. కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన బింబిసారా సినిమాతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. తర్వాత కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నేరుగా తెలుగులో చేసిన చిత్రం సార్. ఈ సినిమాలో టీచర్ పాత్రలో నటించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇక ఆ తర్వాత వచ్చిన విరూపాక్ష సినిమాలో మరోసారి తన నటనతో మంచి మార్కులు వేయించుకుందని చెప్పవచ్చు. హీరోయిన్గా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. ఇందులో డెవిల్ పాత్రలో అందరిని భయపెట్టేసింది. అలా తన పర్ఫామెన్స్ తో మెప్పిస్తున్న ఈమె ఇప్పుడు నారి నారి నడుమ మురారి చిత్రంలో మరోసారి మెప్పించింది. ఇక ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు సినిమాలో నటిస్తోంది. ఇందులో మరో హీరోయిన్ నభా నటేష్ కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇక తర్వాత మహారాగ్ని అనే హిందీ సినిమాలో నటిస్తోంది. అంతేకాకుండా రామ్ అనే మలయాళం చిత్రంలో నటిస్తున్న ఈమె.. బెంజ్ అనే తమిళ చిత్రంలో కూడా నటిస్తోంది. అంతేకాదు విజయ్ సేతుపతి, పూరీ జగన్నాథ్ కాంబినేషన్లో వస్తున్న స్లమ్ డాగ్ అనే సినిమాలో కూడా హీరోయిన్గా నటిస్తోంది.

## రుక్మిణీ ప్రేమలో పడిందా? నిజమేనా?

యంగ్ హీరోయిన్ రుక్మిణీ వసంత్ గురించి అందరికీ తెలిసిందే. తక్కువ టైమ్ లోనే ఎక్కువ గుర్తింపు ఆమె సొంతమవ్వగా.. వివిధ సినిమాలతో సూపర్ క్రేజ్ సంపాదించుకున్నారు. ఆయా చిత్రాల్లో తన యాక్టింగ్ తో అందరినీ మెప్పించి స్పెషల్ ఫ్యాన్ బేస్ ను క్రియేట్ చేసుకున్నారు. అయితే ఇప్పుడు రుక్మిణీ వసంత్ పర్సనల్ లైఫ్ కు సంబంధించిన గాసిప్స్ నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఆమె తన బెస్ట్ ఫ్రెండ్ అయిన సిద్ధాంత్ తో డేటింగ్ లో ఉన్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సిద్ధాంత్ ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ కాగా.. ఇద్దరూ చాలా కాలంగా మంచి స్నేహితులని నెటిజన్లు చెబుతున్నారు. తాజాగా వీరిద్దరూ కలిసి ఉన్న ఓల్డ్ ఫోటోలు ఇన్ స్టాగ్రామ్ లో ట్రెండ్ అవుతున్నాయి. దీంతో డేటింగ్ రూమర్లు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు ఆ విషయంపై రుక్మిణి రెస్పాండ్ అవ్వలేదు. అంతేకాదు.. ఆమె తన రూమర్డ్ బాయ్ ఫ్రెండ్ తో కలిసి ఎక్కడా కనపడలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే రుక్మిణీ వసంత్ డేటింగ్ వార్తల్లో ఎంత నిజమెందో ఎవరికీ తెలియదు. అయితే



ఇటీవల కాలంలో సినీ ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై సోషల్ మీడియాలో అనేక రకాల వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. కొన్ని సందర్భాల్లో అవి నిజమవుతున్నప్పటికీ, మరికొన్ని సార్లు పూర్తిగా రూమర్స్ గా తేలిపోతున్నాయి. ఇప్పుడు రుక్మిణి వసంత్ విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అఫీషియల్ గా రెస్పాన్స్ లేకపోవడంతో డేటింగ్ రూమర్లు నిజమా? కాదా? అన్నది వేచి చూడాల్సిందే. అయితే కెరీర్ పరంగా మంచి దశలో ఉన్న రుక్మిణి వసంత్ పర్సనల్ లైఫ్ కు సంబంధించిన డేటింగ్ వార్తలు ప్రస్తుతం మాత్రం ఊహాగానాలకే పరిమితమయ్యాయి. ఇక రుక్మిణి కెరీర్ విషయానికి వస్తే, బీర్బల్ ట్రైలాజీ చిత్రంతో ఆమె సిల్వర్ స్క్రీన్ కు పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే తన నేచురల్ యాక్టింగ్ తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు అసలైన బ్రేక్ మాత్రం సప్త సాగరాలు దాటితో లభించింది. ఆ చిత్రంలో బ్యూటీ యాక్టింగ్ కు విమర్శకుల ప్రశంసలు కూడా దక్కాయి. ఆ తర్వాత కాంతార సినిమాలో కీలక పాత్రలో కనిపించి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ సినిమా విజయంతో రుక్మిణి పేరు దక్షిణాదికే కాకుండా పాన్ ఇండియా లెవెల్ లో కూడా వినిపించింది. ఇప్పుడు రుక్మిణి వసంత్ చేతిలో భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఆమె జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమాలో యాక్ట్ చేస్తున్నారు. రాకింగ్ స్టార్ యశ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న టాక్సిక్ చిత్రంలో కూడా నటిస్తున్నారు. ఆ రెండు సినిమాలపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. మరి ఎలాంటి హిట్స్ అందుకుంటారో వేచి చూడాలి.




## కాజల్.. ఒక్క వీడియోతో ఇచ్చిపడేసిందిగా!



స్టార్ హీరోయిన్ కాజల్.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ తో పాటు కోలీవుడ్, బాలీవుడ్ లోనూ ఇప్పటికే మంచి క్రేజ్ సొంతం చేసుకున్న కాజల్.. ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తుంటారు. అయితే తాజాగా సినిమాల వల్ల కాకుండా.. తనపై వచ్చిన విమర్శలకు గట్టిగా సమాధానం ఇచ్చిన తీరు కారణంగా వార్తల్లో నిలిచారు. ఒక్క వీడియోతో ట్రోలర్స్ కు కౌంటర్ ఇచ్చారు. రీసెంట్ గా కాజల్ అగర్వాల్ లుక్ పై నెటిజన్ల నుంచి తీవ్ర ట్రోలింగ్ ఎదురైంది. పెళ్లి తర్వాత, మాతృత్వాన్ని అనుభవించిన అనంతరం ఆమె కొంత బరువు పెరిగారని సోషల్ మీడియాలో కామెంట్స్ వెల్లువెత్తాయి. అదే సమయంలో కొందరు నెటిజన్లు హద్దులు దాటి కామెంట్ చేయడం చర్చకు దారి తీసింది. ఆ తర్వాత రీసెంట్ గా గూగుల్ ఇయర్ ఇన్ సెర్చ్ లో కాజల్ పేరు టాప్ సెర్చ్ లిస్ట్ లో లేకపోవడంపై మరికొందరు ట్రోల్ చేశారు. గతంలో వరుసగా ఎన్నో సంవత్సరాలు మోస్ట్ సెర్చ్ సెలబ్రిటీగా నిలిచిన కాజల్, ఈసారి ఆ జాబితాలో వెనుకబడటాన్ని ఆమె లుక్ తో లింక్ చేస్తూ విమర్శలు చేశారు. అయితే ఆ విమర్శలకు మాటలతో కాదొ పనితో సమాధానం ఇవ్వాలని కాజల్ డిసైడ్ అయినట్లు కనిపిస్తోంది. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన జిమ్ వర్కౌట్ వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. దాని ద్వారా కాజల్ ఫిట్నెస్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. హార్డ్ ఎక్సర్సైజ్ చేస్తూ పూర్తి సెల్ఫ్ కాన్ఫిడెన్స్ తో కనిపించిన కాజల్ లుక్ ఇప్పుడు అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆ వీడియోతో కాజల్ తనపై వచ్చిన విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చినట్టే అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఇదే అసలైన ఆన్సర్, మాటల కంటే పనితో చూపించిందని, కాజల్ ఈజ్ బ్యాక్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. ట్రోలింగ్ చేసిన వారికి ఇది సరైన సమాధానం అంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు.

కాజల్ కెరీర్ విషయానికి వస్తే ఒకప్పుడు టాలీవుడ్ లో వరుస హిట్లతో స్టార్ హీరోయిన్ గా వెలుగొందిన ఆమె, కోలీవుడ్ లోనూ టాప్ ప్లేస్ దక్కించుకున్నారు. విజయ్, అజిత్, సూర్య, పవన్ కల్యాణ్, మహేష్ బాబు వంటి స్టార్ హీరోల సరసన నటించి మెప్పించారు. కొంత విరామం తర్వాత మళ్లీ సినిమాలపై ఫోకస్ పెడుతున్న కాజల్, ఫిట్ నెస్ పై కూడా అదే స్థాయిలో శ్రద్ధ చూపుతున్నారని లేటెస్ట్ వీడియో ద్వారా క్లారిటీ వస్తుంది. ఇక సోషల్ మీడియాలో తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలు అభిమానులతో పంచుకుంటూ ఉండే కాజల్, ఈ మధ్య ఫిట్ నెస్ జర్నీ పోస్టులు ఎక్కువగా షేర్ చేస్తున్నారు. ఆరోగ్యం, మానసిక ప్రశాంతతే ముఖ్యమని, ఇతరుల మాటల కంటే తనపై తనకు నమ్మకం ఉండాలని ఇన్ డైరెక్ట్ గా చెబుతున్నట్టుగా ఆమె పోస్టులు కనిపిస్తున్నాయి.

## విశ్వంభర.. నెక్స్ట్ ప్లాన్ కి సిద్ధమయ్యారా?



మెగాస్టార్ చిరంజీవి బాక్సాఫీస్ వద్ద తన వింటేజ్ పవర్ను మళ్ళీ చూపిస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' సంక్రాంతి సీజన్లో వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ప్రస్తుతం 300 కోట్ల క్లబ్ దిశగా పరుగులు తీస్తోంది. ఇక బాక్సాఫీస్ వద్ద ఉన్న ఈ పాజిటివ్ వైబ్ను చిరు తర్వాతి చిత్రం 'విశ్వంభర' కోసం వాడుకోవాల్సిన టైమ్ వచ్చింది. ఒకప్పుడు 'జగదేకవీరుడు అతిలోకసుందరి' లాంటి సోషియో ఫాంటసీలతో మ్యాజిక్ చేసిన చిరంజీవి, మళ్ళీ అదే జోనర్లో వశిష్ఠ దర్శకత్వంలో వస్తున్నారు. 'MSG' ఇచ్చిన కిక్తో ఈ సినిమాపై అంచనాలు గట్టిగానే ఉన్నాయి. అయితే, 'విశ్వంభర' టీమ్ ముందు ఇప్పుడు ఒక పెద్ద టాస్క్ ఉంది. గతంలో రిలీజైన టీజర్పై విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో డివైడ్ రియాక్షన్స్ వచ్చాయి. అందుకే క్వాలిటీ విషయంలో ఎక్కడా తగ్గకూడదని మేకర్స్ సినిమాను 2026 వేసవికి వాయిదా వేశారు. ఇప్పుడు 'MSG' హిట్ అయిన జోష్ లో ఉన్న ఆడియన్స్ను మెప్పించాలంటే, సరికొత్త విజువల్ గ్లింప్స్తో టీమ్ గ్రాండ్ గా ఎంట్రీ ఇవ్వాలి. సోషియో ఫాంటసీ సినిమాలకు విజువల్స్ ప్రాణం. అందుకే వీఎఫ్ఎక్స్ పనుల కోసం ఏడాది పాటు టైమ్ తీసుకుంటున్నట్లు చిరంజీవి స్వయంగా వెల్లడించారు. ఇప్పుడున్న ట్రెండ్కు తగ్గట్టుగా అద్భుతమైన ప్రొమోషనల్ కంటెంట్ రిలీజ్ చేస్తే, 'విశ్వంభర' రిలీజ్ టైమ్కు క్రేజ్ మామూలుగా ఉండదు. ముఖ్యంగా పిల్లలను, పెద్దలను ఆకట్టుకునేలా ఈ సినిమా ఉండబోతోందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రస్తుతం చిరంజీవి దృష్టంతా 'విశ్వంభర' పనుల మీదే ఉందని టాక్. 70% కంటే ఎక్కువ వీఎఫ్ఎక్స్తో రూపొందుతున్న ఈ సినిమా, హై రేంజ్ విజువల్స్ ఇస్తే బాక్సాఫీస్ వద్ద మరో మెగా రికార్డ్ ఖాయం. అయితే సినిమా ఏమోషన్ స్క్రీన్ ప్లేలో కూడా కంటెంట్ ఉంటేనే ఈ మ్యాజిక్ వర్కౌట్ అవుతుంది. షూటింగ్ ఇప్పటికే పూర్తయినందున, వీలైనంత త్వరగా టీమ్ నుంచి సర్ ప్రైజింగ్ అప్డేట్స్ రావాల్సిన అవసరం ఉంది. ఈ సినిమాను పాన్ ఇండియా రేంజ్ లో విడుదల చేయాలని అనుకున్నారు. ఇక ఆ రూట్లో వెళతారా లేదా అనేది తెలియాల్సి ఉంది. సినిమాలో మెగాస్టార్ కు జోడిగా త్రిష నటిస్తున్న విషయం తెలిసిందే. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు.

## గ్లామర్ తో హీటెక్కిస్తున్న రకుల్.. ఆ ఫోజులకే ఫిదా!

హీరోయిన్స్ ఒకవైపు సినిమాలలో నటిస్తూనే.. మరొకవైపు సోషల్ మీడియాలో తమ అందంతో ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. అంతేకాదు ఫాలోవర్స్ లో పెంచుకున్న తర్వాత పలు ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ అలా కూడా ఆదాయాన్ని పొందుతున్న విషయం తెలిసిందే. ఇకపోతే ఫాలోవర్స్ పెరగాలంటే రోజుకు ఒక గ్లామర్ ట్రీట్ ఇవ్వాల్సిందే అనే రేంజ్ లో ప్రస్తుతం ట్రెండ్ నడుస్తోంది అంటూ నెటిజన్లు కూడా కామెంట్లు చేస్తూ ఉంటారు. మరోవైపు ఈ మధ్యకాలంలో హీరోయిన్స్ సినిమా షూటింగ్ లతో బిజీగా ఉన్నప్పటికీ.. మరోవైపు అభిమానులకు చేరువ అవ్వడానికి నిత్యం ఫోటోషూట్ తో ఆకట్టుకుంటున్నారు. అందులో భాగంగానే తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ కూడా తన గ్లామర్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. బ్లాక్ కలర్ లెహంగా ధరించిన ఈమె.. దీనికి కాంబినేషన్ లో సిల్వర్ కలర్ హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన ఒక కోట్ ధరించి.. తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. ముఖ్యంగా గార్జియస్ లుక్ లో అదిరిపోయే స్టిల్స్ ఇచ్చి మరింత అందంగా కనిపిస్తోంది ఈ ముద్దుగుమ్మ. తన మెడను ప్రత్యేకంగా డిజైన్ చేసిన జువెలరీ తో ఫుల్ ఫిల్ చేసుకుంది. ఇక మత్తెక్కించే కళ్ళతో.. మరింత అందంగా ముస్తాబయింది. తాజాగా ఓవర్ లోడెడ్ గ్లామర్ డోస్ తో



అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది . అదిరిపోయే ఫోజులు ఇవ్వడంతో ఆ ఫోజులకే ఫిదా అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికైతే రకుల్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. రకుల్ ప్రీత్ సింగ్ విషయానికి వస్తే.. కెరటం అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. వెంకటాద్రి ఎక్స్ప్రెస్ సినిమాతో మరింత పాపులారిటీ దక్కించుకుంది. "ప్రార్థన ప్రతి రూపాయి కౌంటింగ్ ఇక్కడ" అనే డైలాగ్ తో ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంది. రకుల్ ప్రీత్ సింగ్ ఈ సినిమా తర్వాత లౌక్యం, కరెంటు తీగ , కిక్ 2 , పండగ చేసుకో, బ్రూస్ లీ, నాన్నకు ప్రేమతో, సరైనోడు, ధ్రువ, రారండోయ్ వేడుక చూద్దాం, జయ జానకి నాయక , స్పైడర్ ఇలా పలు తెలుగు చిత్రాలలో పలువురు స్టార్ హీరోల సరసన నటించి భారీ పాపులారిటీ అందుకుంది. ఇక తెలుగులో నాగార్జున సరసన మన్మథుడు 2 సినిమాలో నటించి విమర్శలు ఎదుర్కొన్న ఈమె.. ఆ తర్వాత చెక్ సినిమాలో నటించి డిజాస్టర్ ను మూటగట్టుకుంది. ఇక ఆ తర్వాత ఈమె నటించిన ఎన్నో సినిమాలు ఈమెకు పెద్దగా విజయాన్ని అందించలేదు. దీంతో బాలీవుడ్ కి మకాం మార్చేసింది. అక్కడే పలు చిత్రాలలో నటిస్తూ బిజీగా మారిన రకుల్ ప్రముఖ నటుడు , నిర్మాత జాకీ భగ్నానీతో కలిసి ఏడడుగులు వేసింది. ఇక ప్రస్తుతం తన భర్తతో కలిసి హైదరాబాదులోనే నివసిస్తోంది ఈ ముద్దుగుమ్మ.

## బ్లాక్ అవుట్ ఫిట్ లో నేహా అందాలు అదరహో..

ప్రస్తుత కాలంలో చాలామంది హీరోయిన్స్ సోషల్ మీడియా వేదికగా అందాలు ఆరబోస్తూ ఆడియన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో పైగా సినిమాలలో అవకాశాలు ఉన్నా.. లేకపోయినా.. సోషల్ మీడియాను మాత్రం అస్సలు వదలడం లేదు అని చెప్పడంలో సందేహం లేదు. ఎందుకంటే ఈ సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ ఆడియన్స్ కు సెలబ్రిటీలను దగ్గర చేయడమే కాకుండా వారికి సినిమాలలో కూడా అవకాశాలు కల్పిస్తుందనే ఆశ ఇప్పుడు అందరిలో మొదలైంది. అందులో భాగంగానే తమ ఉనికిని చాటుకోవడానికి సోషల్ మీడియాను ఆశ్రయిస్తున్నారు సెలబ్రిటీలు. పైగా ఇప్పుడు సమయం సందర్భంతో పనిలేకుండా తమకు నచ్చినప్పుడు నచ్చిన ఫోటోలను షేర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే సండే స్పెషల్ అంటూ ప్రముఖ బ్యూటీ నేహా శర్మ తన అందాలు ఆరబోస్తూ బ్లాక్ డ్రెస్ లో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా రకరకాల ఫోజులతో కుర్రకారులో హీట్ పుట్టించిందని చెప్పవచ్చు. బ్లాక్ అవుట్ ఫిట్ లో అమ్మడి అందానికి అభిమానులు కూడా ఫిదా అవుతున్నారు. మొత్తానికి నేహా శర్మ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.



1987 నవంబర్ 21న బీహార్ లోని భాగల్పూర్ లో జన్మించింది. ఈమె తండ్రి అజిత్ శర్మ వ్యాపారవేత్త.ఎ పైగా రాజకీయ నాయకుడు కూడా.ఎ ఈయన భాగల్పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.. నేహా శర్మ న్యూఢిల్లీలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ కళాశాలలో ఫ్యాషన్ డిజైన్ కోర్స్ పూర్తి చేసింది. చిన్నప్పుడే ఆస్తమా వ్యాధితో బాధపడిన ఈమె.. హైదరాబాదుకు చెందిన ఒక కుటుంబం సహాయంతో వ్యాధిని నయం చేయించుకున్నట్లు సమాచారం. అయితే సినిమాల్లోకి రావాలనుకున్న నేహా శెట్టి అందులో భాగంగానే మోడల్ గా తన కెరీర్ను ఆరంభించి, 2007లో తొలిసారి మెగాస్టార్ చిరంజీవి తనయుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తొలి పరిచయంలో వచ్చిన 'చిరుత' సినిమాతోనే ఈమె కూడా తొలిసారి ఇండస్ట్రీకి పరిచయమయ్యింది. ఈ సినిమా మంచి విజయం అందుకుంది. ఈ సినిమా తర్వాత 'కుర్రాడు' అనే మరో తెలుగు చిత్రంలో నటించిన నేహా శర్మ దాని తర్వాత మళ్ళీ తెలుగులో సినిమాలు చేయలేదు. హిందీలో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరించిన ఈమె.. చివరిగా దేదే ప్యార్ దే 2 సినిమాలో నటించింది. ప్రస్తుతం జాస్సీ గిల్ తో సంజోగ్ అనే పంజాబీ చిత్రంలో నటిస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536